సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం  వెల: ₹ 6.00  సంపుటి: 12  సంచిక: 202

ఆదివారం 13-10-2019

SUNDAY Special

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



## 'చెన్నై కనెక్ట్'..

**భారత్-చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం**

- జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ప్రకటించిన ప్రధాని
- గేట్ వే ఆఫ్ ఫ్రెండ్‌షిప్ మహాబలిపురం: మోదీ
- మా బంధం మరింత బలోపేతం: జిన్‌పింగ్

5లో

# దసరా సెలవులు 19 వరకు పొడిగింపు

- మెడికల్ కాలేజీలు మినహా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు వర్తింపు
- ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- బదులుగా ఏప్రిల్ వరకు పనిదినంగా ప్రతి రెండో శనివారం.. ఉత్తర్వులు జారీ

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులను నివారించేందుకు అన్ని విద్యా సంస్థలకు దసరా సెలవులను ఈ నెల 19 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. వైద్య కళాశాలలు మినహా అన్ని ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కాలేజీలు, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఫార్మా కాలేజీలు, యూనివర్సిటీ కాలేజీలకు ఈ నెల 19 వరకు సెలవులు ప్రకటించింది. ఈ నెల 20న ఆదివారం కావడంతో 21న విద్యా సంస్థలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వైద్య కళాశాలలు నడుస్తున్నందున వాటిని యథాతథంగా కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఈ అదనపు సెలవులకు బదులుగా ఏప్రిల్ వరకు ప్రతి నెలా రెండో శనివారం సెలవును రద్దు చేస్తూ ఆ రోజుల్లో విద్యాసంస్థలు యథావిధిగా నడపాలని సూచించింది. బోధన, అభ్యసనా కార్యక్రమాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకుంది. శనివారం సీఎం వద్ద జరిగిన సమావేశంలో సెలవులపై నిర్ణయం తీసుకోవడంతో విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# గూండాగిరీ నడవదు



## ఆర్టీసీ కార్మిక సంఘాలు ఉద్యమం చేసినా ప్రభుత్వం చలించదు: సీఎం కేసీఆర్

- డిపోల వద్ద అరాచకాన్ని సహించం
- ఆర్టీసీని నష్టపరిచిన కార్మికులను క్షమించేది లేదు
- వారు చేస్తున్నది సమ్మె కానే కాదు
- వర్సలు జరిపే ప్రశ్నే తలెత్తదు
- ఆర్టీసీ కార్మిక సంఘాలకు సీఎం కేసీఆర్ తీవ్ర హెచ్చరికలు
- 3 రోజుల్లో బస్సులన్నీ నడవాలి
- డిపోల వద్ద బందోబస్తు పెంచాలి
- సమ్మెతో ఉత్పన్నమైన పరిస్థితులపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్

'ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూనియన్లుగా చెప్పుకునే వారు ప్రకటిస్తున్నారు. ఉధృతం చేసినా, పిల్లిమొగ్గలు వేసినా ప్రభుత్వం చలించదు. బెదిరింపులకు భయపడదు. బస్సులు నడిపి, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది. బస్సులను ఆపి, బస్టాండ్లు, బస్ డిపోల వద్ద అరాచకం చేద్దామని చూస్తే సహించేది లేదు. గూండాగిరీ నడవదు. ఇప్పటివరకు ప్రభుత్వం కాస్త ఉదాసీనంగా ఉంది. ఇకపై కఠినంగా వ్యవహరిస్తుంది. బస్టాండ్లు, బస్ డిపోల వద్ద ఎవరు బస్సులను ఆపినా, విధ్వంసం సృష్టించినా వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ఉత్పన్నమైన పరిస్థితులపై శనివారం ప్రగతి భవన్‌లో సమీక్షించారు. ప్రతి ఆర్టీసీ డిపో, బస్టాండ్ల వద్ద పోలీసు బందోబస్తు పెంచాలని, అన్ని చోట్లా సీసీ కెమెరాలు పెట్టాలని సూచించారు. మహిళా పోలీసులను కూడా బందోబస్తు కోసం వినియోగించాలని, నిఘా పోలీసులను ఉపయోగించాలని ఆదేశించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని, బస్సులను ఆపేవారిని, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి, కేసులు పెట్టి కోర్టుకు పంపాలని, ఉద్యమం పేరిట విధ్వంసం సృష్టిస్తే ఉపేక్షించాల్సిన అవసరం లేదని సమావేశం నుంచే

మిగతా 2వ పేజీలో ▶

### రూపాయికే వైద్యం

శివసేన మేనిఫెస్టో విడుదల

5లో








శనివారం హైదరాబాద్‌లోని బస్‌భవన్ వద్ద ధర్నా చేస్తున్న లక్ష్మణ్, అశ్వత్థామరెడ్డి తదితరులు

# 19న రాష్ట్ర బంద్

**ఆర్టీసీ జేఏసీ పిలుపు**

- 7 రోజుల కార్యాచరణ విడుదల.. పార్టీల మద్దతుతో సమ్మె ఉధృతం చేసిన కార్మిక సంఘాలు
- కొన్నిచోట్ల ఉద్రిక్తతలు

4లో



శ్రీనివాసరెడ్డి

## ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ఖమ్మంలో ఒంటికి నిప్పంటించుకున్న డ్రైవర్..

- సమ్మెపై ప్రభుత్వ వైఖరితో మనస్తాపం
- పరిస్థితి విషమం
- హైదరాబాద్ తరలింపు

- వివరాలు 4లో








## 'పరదా' పడినట్టే..

- కింగ్‌కోఠి ప్యాలెస్‌ను ప్రైవేటు కంపెనీకి అమ్మేసిన నిజాం ట్రస్ట్
- 'పరదాగేట్'ను కొన్న ముంబైవాలా
- 5 వేల గజాల విస్తీర్ణం, రూ. 150 కోట్ల వ్యయం... ప్యాలెస్‌లో ఐరిస్ బిజినెస్ మాల్స్

- 14లో

## పెరిగిన విద్యుత్ కొలువులు

3,025 పోస్టులకు రేపు నోటిఫికేషన్

- వివరాలు 2లో

## బిడ్డా.. ఇంటికి రా!

- గల్ఫ్‌లోని తెలంగాణవాసులకు పిలుపునివ్వనున్న సీఎం కేసీఆర్
- తిరిగొచ్చిన వారికి న్యాక్‌లో శిక్షణ
- త్వరలో గల్ఫ్ దేశాల్లో పర్యటన

- వివరాలు 2లో

### ఇదం జగత్







## ఇక ఇంట్లోనే డయాలసిస్!

- అరగంటలోనే డయాలసిస్ చేసుకునే అవకాశం
- అందరికీ ఉచితంగా అందుబాటులోకి
- 'పెరిటోనియల్' పద్ధతి ద్వారా వెసులుబాటు
- అన్ని రాష్ట్రాల్లో అమలుకు కేంద్రం మార్గదర్శకాలు

- వివరాలు 2లో





ఇంటర్నేషనల్ నేచరల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డే

# విలయం విధ్వంసం..

వాన రాకడ ప్రాణం పోకడ తెలీదని ఒకనాటి సామెత. అయితే ఇప్పుడు కాలం మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక వాన ఎప్పుడు కురుస్తుందో చెబుతున్నాం. తుపాన్లని ముందే పసిగడుతున్నాం. పిడుగులు ఎప్పుడు ఎక్కడ పడతాయో అంచనా వేస్తున్నాం. భూకంపాలు, కరువు కాటకాలు ఇతర విపత్తుల గురించి ఎంతో కొంత తెలుసుకుంటున్నాం. కానీ, వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పులు అడుగడుగునా సవాళ్లు విసురుతున్నాయి. అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయి. ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాయి. ప్రజల్ని చెల్లాచెదురు చేస్తున్నాయి. విపత్తులు సృష్టిస్తున్న విలయం అంతా ఇంతా కాదు. అమెరికా వంటి అగ్రరాజ్యాలకే విపత్తు నిర్వహణ కత్తి మీద సాములా మారింది.



**1995 నుంచి ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవించిన తొలి 5 దేశాలు**

1. అమెరికా, 2. చైనా, 3. భారత్, 4. ఫిలిప్పీన్స్, 5. ఇండోనేసియా

**61.4%** ప్రకృతి విపత్తులతో నిరాశ్రయులవుతున్న వారు

**80%** నిరాశ్రయుల్లో పట్టణాలు, శివారు ప్రాంతాల్లో ఉండేవారు

**70 లక్షలు** ఈ సంవత్సరం నిరాశ్రయులు అయినవారు

**950** ఈ ఏడాది మొదటి 6 నెలల్లో సంభవించిన విపత్తులు

**102** ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటున్న దేశాలు

**34 లక్షలు** ఫణి తుపాన్‌తో భారత్, బంగ్లాదేశ్‌లో నిరాశ్రయులు అయినవారు

**2.2 కోట్లు** ఈ ఏడాది చివరికి నిరాశ్రయులు కానున్న వారు (అంచనా)

**26.8 లక్షలు** 2018లో భారత్‌లో నిరాశ్రయులైన వారు

**56,000 కోట్లు** మన దేశంలో గత 20 ఏళ్లలో జరిగిన ఆర్థిక నష్టం

## క్లుప్తంగా...

### పెరిగిన విద్యుత్ కొలువులు

**3,025 పోస్టులకు రేపు నోటిఫికేషన్**

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్పీడీసీఎల్) భర్తీ చేయనున్న పోస్టుల సంఖ్య స్వల్పంగా పెరిగింది. 2,939 పోస్టుల భర్తీకి గత నెల 28న సంస్థ పత్రికా ప్రకటన జారీ చేయగా, తాజాగా పోస్టుల సంఖ్యను 3,025కు పెంచింది. వీటిలో 2,500 జూనియర్ లైన్‌మెన్, 25 జూనియర్ పర్సనల్ ఆఫీసర్, 500 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయనుంది. పోస్టుల వారీగా పూర్తి స్థాయి నియామక ప్రకటనలను సోమవారం https://www.tssouthernpower.com వెబ్‌సైట్‌లో పొందుపరుస్తా మనియాజమాన్యం ప్రకటించింది. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ అప్‌లోడింగ్ కొంత ఆలస్యమైందని సంస్థ వర్గాలు తెలిపాయి.

### తాత్కాలిక నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఆదేశాలు జారీ చేసిన ఆర్టీసీ ఎండీ**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ బస్సులను పూర్తిస్థాయిలో నడపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశించిన నేపథ్యంలో తాత్కాలిక పద్ధతిలో నియామకాలకు సంబంధించి ఆర్టీసీ ఎండీ శనివారం పలు ఆదేశాలు జారీ చేశారు. వివిధ కేటగిరీల్లో నియమించుకునే వారికి చెల్లించాల్సిన మొత్తాలను అందులో పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు, డిపో మేనేజర్లకు సర్క్యులర్లను పంపారు. ఇందులో డ్రైవర్లు, రిటైర్డ్ డ్రైవర్లు, రిటైర్డ్ ఆఫీసర్లు, రిటైర్డ్ ట్రాఫిక్–మెకానిక్ సూపర్‌వైజర్లకు రోజుకు రూ.1500, కండక్టర్లు, రిటైర్డ్ కండక్టర్లు, ఇతర కేటగిరీ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్ (మెకానిక్స్, శ్రామిక్స్, క్లరికల్ స్టాఫ్)కు రోజుకు రూ. 1,000 చొప్పున, అదేవిధంగా రిటైర్డ్ ఎలక్ట్రీషియన్లు, టైర్‌మెకానిక్‌లు, డిపో మేనేజర్లు నియమించుకునే ఇతర పర్సన్లకు రూ. 1,000 చొప్పున ఇవ్వనున్నారు.

### పలు రైళ్లు రద్దుచేసిన దక్షిణ మధ్య రైల్వే

**సాక్షి, హైదరాబాద్:** బిలాస్‌పూర్–రాయ్‌పూర్ సెక్షన్‌లో చేపట్టిన సాంకేతిక నిర్మాణ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్–రెక్సాల్ రైలు (17005/17006) ఈ నెల 17, 20న, సికింద్రాబాద్–దర్బంగా రైలు (17007/17008) 15, 18, 19న, సికింద్రాబాద్–బరౌని రైలు (07009/07010) 13, 16, 20, 23న రద్దు కానున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతి–బిలాస్‌పూర్ (17482/17481) రైలు రాయ్‌పూర్–బిలాస్‌పూర్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

### నేడు, రేపు మోస్తరు వర్షాలు



**సాక్షి, హైదరాబాద్:** లక్షదీవుల ప్రాంతం నుంచి కోస్తాంధ్ర వరకు ఇంటీరియర్ కర్ణాటక, రాయలసీమ మీదుగా ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనంగా మారింది. దీని ప్రభావంతో నేడు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు కూడా కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇదిలావుండగా గత 24 గంటల్లో సిద్దిపేట జిల్లా మిర్‌దొడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 9 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. సదాశివనగర్‌లో 7, కొండపాకలో 6, మాచిరెడ్డి, చెన్నారావుపేట, మహబూబాబాద్, ధర్మసాగర్, నంగనూర్, నిడమానూర్‌లలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

### అమెరికాలో కాల్పులు.. నలుగురు మృతి

**న్యూయార్క్:** అమెరికాలో కాల్పుల కలకలం చెలరేగింది. న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్‌లో ఓ సోషల్ క్లబ్‌లో జరిగిన కాల్పుల్లో నలుగురు అక్కడికక్కడే మరణించగా, ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. అనంతరం వారిని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. శనివారం ఉదయం జరిగిన ఈ కాల్పులకు కారణం తెలియరాలేదన్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులను ఇంకా పట్టుకోలేదన్నారు.

# ఇక ఇంట్లోనే డయాలసిస్!

- ‘పెరిటోనియల్’ పద్ధతి ద్వారా వెసులుబాటు
- అరగంటలోనే డయాలసిస్ చేసుకునే అవకాశం
- అందరికీ ఉచితంగా అందుబాటులోకి
- పిల్లలు, వృద్ధులకు ఊరట..
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కేంద్రం శుభవార్త..
- మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** డయాలసిస్ చేయించుకునే కిడ్నీ రోగులు నరకం అనుభవిస్తుంటారు. వారానికి రెండు మూడు రోజులు ఆస్పత్రులకు వెళ్లడం, నాలుగైదు గంటల పాటు డయాలసిస్ చేయించుకొని రావడం క్లిష్టమైన ప్రక్రియ. ఇకపై ఈ పద్ధతికి చరమగీతం పాడేందుకు ఇంట్లోనే డయాలసిస్ చేసుకునే పద్ధతికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ‘పెరిటోనియల్ డయాలసిస్’అనే ఈ పద్ధతితో కుటుంబ సభ్యుల సహకారంతో ఇంట్లోనే డయాలసిస్ చేసుకోవచ్చు. ఈ పద్ధతిని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చి.. రాష్ట్రాల్లోనూ అమలు చేసేలా కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. పెరిటోనియల్ డయాలసిస్ బ్యాగు కొనుక్కుని దాని ద్వారా ఇంట్లోనే డయాలసిస్ చేసుకోవచ్చని తెలిపింది. అమెరికా, థాయిలాండ్ హాంకాంగ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సహా అనేక దేశాల్లో పెరిటోనియల్ పద్ధతినే పాటిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఆసుపత్రులకు వెళ్లకుండానే తక్కువ సమయంలో డయాలసిస్ చేసుకోవచ్చు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులను ఉపయోగించుకొని పెరిటోనియల్ డయాలసిస్‌ను అమలు చేయాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

**ఏటా లక్ష మంది బలి..**

దేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఏటా లక్ష మంది ఈ వ్యాధులకు బలవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనంలో వెల్లడైంది. 2015లో ఏకంగా 1.36 లక్షల మంది కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా చనిపోయారు. ప్రస్తుతం దేశంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏకంగా కోటికి చేరింది. ఏటా మరో లక్ష మంది వీరికి తోడవుతున్నారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. 70 ఏళ్లలోపు చనిపోతున్న వారిలో 3 శాతం మంది కిడ్నీ వ్యాధికి లోనైన వారే. త్వరలో దేశంలో 10 లక్షల మందికి డయాలసిస్ చేయాల్సి వస్తుందని కేంద్రం అంచనా. తెలంగాణలో ప్రస్తుతం 3 లక్షల మంది వరకు కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారిలో 15 వేల మందికి డయాలసిస్ జరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 43, ప్రైవేటు రంగంలో 30 యూనిట్లు డయాలసిస్ చేస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ చేసినందుకు ఒక్కోసారి రూ.3 వేల వరకు వసూలు చేస్తుండగా, ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారు.



**పెరిటోనియల్‌తో లాభాలివే..**

ప్రస్తుతం హీమో–డయాలసిస్ పద్ధతి అవలంబిస్తున్నారు. ఇది ఆసుపత్రుల్లో మాత్రమే చేస్తారు. జిల్లా కేంద్రాలు, రాష్ట్ర రాజధానిలోనే ఇవి అందుబాటులో ఉన్నాయి. మారుమూల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, సుదూర ప్రాంతాల నుంచి రోగులు డయాలసిస్ కోసం వారానికి రెండు మూడు సార్లు దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో అనేక మంది అంత దూరం ప్రయాణించలేక, ఖర్చు భరించలేక చికిత్స తీసుకోవట్లేదు. దీంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కానీ పెరిటోనియల్‌తో అలాంటి పరిస్థితి ఉండదు. పిల్లలైతే పెద్దల సహకారంతో చేసుకోవాల్సి ఉంటుంది. రోజుకు అర గంటపాటు డయాలసిస్ చేసుకుంటే సరిపోతుంది. అవసరాన్ని బట్టి రోజుకు రెండు మూడు సార్లు చేసుకోవచ్చు. పెరిటోనియల్ డయాలసిస్‌కు ఇంట్లో వెలుతురు ఉన్న గది ఉంటే చాలు. దానికి అనుబంధంగా బాత్రూం ఉండాలి. గది శుభ్రంగా ఉంచుకోవాలి. నిరంతరం బెడ్‌షీట్లు మార్చుకోవాలి. డయాలసిస్ బ్యాగులు నిల్వ ఉంచుకోవడానికి సాధారణ వసతి సరిపోతుంది. హీమో డయాలసిస్ ద్వారా నెలకు రూ.30 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తే.. పెరిటోనియల్ ద్వారా నెలకు రూ.25 వేల వరకు ఖర్చు అవుతుంది.

**మరింత ప్రయోజనం**



పెరిటోనియల్ డయాలసిస్‌తో రోగికి చాలా కష్టాలు తప్పుతాయి. ఇంట్లోనే డయాలసిస్ చేసుకునే వీలుంది. దీన్ని ఉచితంగా అమలు చేయాలని కేంద్రం సూచించింది. పెరిటోనియల్ డయాలసిస్ బ్యాగును సాధారణ పాల ప్యాకెట్‌లా తీసుకెళ్లొచ్చు. మారుమూల ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో ఈ బ్యాగులను అందుబాటులో ఉంచి సంబంధిత రోగులకు అందజేయాలి. ఈ పద్ధతి వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా రోగి ప్రయాణాలు చేయాల్సిన అవసరం పడదు.

–డాక్టర్ శ్రీభూషణ్‌రాజు, కార్యదర్శి, పెరిటోనియల్ డయాలసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా.

**నోడల్ ఏజెన్సీలుగా సామాజిక ఆరోగ్య కేంద్రాలు..**

ప్రతి జిల్లాకు పెరిటోనియల్ డయాలసిస్‌ను పర్యవేక్షించే నోడల్ ఆఫీసర్ ఉంటారని కేంద్రం మార్గదర్శకాల్లో పేర్కొంది. సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ) నోడల్ ఏజెన్సీలుగా ఉంటాయి. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు కిడ్నీ రోగులకు డయాలసిస్ విషయంలో సాయంగా ఉంటారు. డయాలసిస్ బ్యాగులను రోగులు సంబంధిత ఆసుపత్రుల నుంచే తెచ్చుకోవాల్సి ఉంటుంది. వాటిని ఉపయోగించిన తర్వాత తిరిగి మెడికల్ సిబ్బందికే అప్పగించాలి. రెండు నెలలకోసారి డయాలసిస్ రోగులు సంబంధిత సీహెచ్‌సీకి వెళ్లి తమ పరిస్థితిని చెప్పాలి. మూడు నెలలకోసారి ట్రైనింగ్ తీసుకోవాలి. రెండు మూడు నెలలకో సారి కిడ్నీ వైద్య నిపుణుడిని సంప్రదించాలి.

# బిడ్డా.. ఇంటికి రా!

- గల్ఫ్‌లోని తెలంగాణ వాసులకు పిలుపునివ్వనున్న కేసీఆర్
- తిరిగొచ్చిన వారికి న్యాక్‌లో శిక్షణ
- త్వరలో సీఎం గల్ఫ్ దేశాల్లో పర్యటన

**సాక్షి, హైదరాబాద్:** గల్ఫ్ దేశాలకు వెళ్లిన తెలంగాణ బిడ్డలు రాష్ట్రానికి వచ్చేయాలని పిలుపునివ్వడానికి త్వరలో తానే స్వయంగా గల్ఫ్ దేశాలకు వెళ్లనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. కుటుంబాలను పోషించుకోవడానికి గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ పనులు చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలోనే వారు చేసుకోవడానికి పనులున్నందున తిరిగి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ‘ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పనులు వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు పోయారు. అక్కడ దొరికిన పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంతా చేస్తే వారికి దొరికే జీతం కూడా తక్కువే. తెలంగాణలో పరిస్థితి గతంలో లాగా లేదు. ఇక్కడే చేసుకోవడానికి చాలా పని ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అనేక నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడ పనికి మనుషులు దొరక్క వేరే ప్రాంతాల నుంచి రప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ బిడ్డలు పనికోసం వేరే చోటకి వెళ్తే, తెలంగాణలో పనికోసం వేరే ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్లే వారిని తిరిగి రప్పించాలని ప్రభుత్వం భావిస్తున్నది. వారికి హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో తగిన శిక్షణ ఇస్తాం. రియల్ ఎస్టేట్ వ్యాపారులతోనూ, బిల్డర్లతోనూ సంప్రదించి, నిర్మాణ రంగంలో పని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది’అని సీఎం ప్రకటించారు. నూతన ఎన్‌ఆర్‌ఐ విధానం అధ్యయనం కోసం ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, జీఏడీ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హాలతో కూడిన బృందం ఆదివారం కేరళ రాష్ట్రంలో పర్యటించనుంది. గల్ఫ్ దేశాల్లో పనికి పోయిన వారు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలతో త్వరలోనే సీఎం సమావేశం కానున్నారు.

# లంచంగా బంగారం

- బ్లడ్‌బ్యాంక్‌కు అనుకూలంగా సర్టిఫికెట్ ఇచ్చేందుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లంచం డిమాండ్
- జంటనగరాల జోన్ డీఐ లక్ష్మిని పట్టుకున్న ఏసీబీ అధికారులు
- లంచంగా తీసుకున్న బంగారు ఆభరణాలు స్వాధీనం

**సాక్షి, హైదరాబాద్:** రక్తనిధి కేంద్రానికి అనుకూలంగా ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు లంచాన్ని డిమాండ్ చేసిన ఓ డ్రగ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఆ డీఐ నుంచి బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకుని ఆ అవినీతి అధికారిని కోర్టులో హాజరు పరిచారు. లింగంపల్లి లక్ష్మీరెడ్డి 15 ఏళ్లుగా బోయిన్‌పల్లిలో జనని వాలంటరీ పేరుతో రక్తనిధి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. జంటనగరాల జోన్ కు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న బొమ్మిశెట్టి లక్ష్మి ఇటీవల ఆ రక్తనిధి కేంద్రంలో తనిఖీలు చేపట్టింది. తనిఖీల సందర్భంగా రికార్డ్స్‌లో దాతల వివరాలు సరిగా లేకపోవడంతో పాటుగా రక్తం నిల్వ చేసిన గదిలో ఏసీ పని చేయడం లేదని డీఐ లక్ష్మి గుర్తించి బ్లడ్ బ్యాంక్‌పై కేసు నమోదు చేసింది. రక్తనిధి కేంద్రాన్ని సీజ్ చేయకుండా ఉండాలంటే రూ.2 లక్షలు లం చంగా ఇవ్వాలని డిమాండ్ చేసింది. అంతమొత్తం ఇచ్చుకోలేనని, నోటీసులిస్తే లోపాలను సరిదిద్దుకుంటానని లక్ష్మీరెడ్డి వేడుకుంది. తమకు కూడా టార్గెట్లు ఉన్నాయని, తాము కూడాపై అధికారులకు ముట్ట జెప్పాలని, అడిగినంత ఇవ్వాల్సిందేనంటూ డీఐ హుకుం జారీ చేసింది. డీఐ వేధింపులు భరించలేక బాధితురాలు ఏసీబీని ఆశ్రయించింది.



పట్టుబడిన ఆభరణాలతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి

**పథకం ప్రకారం వలపన్ని పట్టుకున్నారు**

అడిగినంత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానంటూ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు లక్ష్మీరెడ్డి కబురు పంపించింది. అయితే డీఐ నగదు రూపంలో కాకుండా బంగారు ఆభరణాల రూపంలో కావాలని కోరింది. అప్పటికే ఏసీబీకి సమాచారం ఇచ్చిన రక్తనిధి నిర్వాహకురాలు లక్ష్మీరెడ్డి ఏసీబీ ప్రణాళిక ప్రకారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను గురువారం సాయంత్రం అబిడ్స్‌లోని ఓ బంగారు దుకాణానికి రప్పించింది. రూ.1.10 వేల విలువ చేసే బంగారు గొలుసు ఆభరణాన్ని ఎంపిక చేసుకుంది. అయితే లక్ష్మీరెడ్డి ప్రస్తుతం తనవద్ద ఇంత డబ్బుల్లేవని, ఇదే బంగారు గొలుసును మరుసటి రోజు తెచ్చి ఇస్తానని చెప్పి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను పంపివేసింది. ఆ తర్వాత ఆ గొలుసుకు డబ్బులు చెల్లించి, షాపు నుంచి బిల్లు తీసుకుంది. డీఐకి బంగారు గొలుసును ఇచ్చేందుకు లక్ష్మీరెడ్డి శుక్రవారం రాత్రి మధురానగర్ సూర్య అపార్ట్ మెంట్‌కు వెళ్లింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బొమ్మిశెట్టి లక్ష్మికి బంగారు గొలుసును అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే సమయంలో ఆమె నుంచి పలు నగలను కూడా సీజ్ చేసినట్లు తెలిసింది. ఈ తతంగమంతటిని అధికారులు వీడియో రికార్డు చేశారు. ఆ తర్వాత ఆమెను అరెస్టు చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. తనిఖీల పేరుతో ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే వేంటనే 1064 కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచించింది.

# గూండాగిరీ నడవదు



శనివారం ప్రగతిభవన్‌లో ఆర్టీసీ సమ్మెపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు సబిత, పువ్వాడ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

డీజీపీ మహేందర్‌రెడ్డికి ఫోన్ చేసి ఆదేశించారు.

**ఎవరినీ ఎవరు డిస్మిస్ చేయలేదు..**

‘యూనియన్ నేతల పిచ్చి మాటలు నమ్మి కార్మికులు అనధికారికంగా గైర్హాజరయి తమంతట తామే ఉద్యోగాలు వదులుకున్నారు. అంతే తప్ప ఎవరినీ ఎవరు డిస్మిస్ చేయలేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సూపర్ వైజర్లను కూడా సమ్మెలోకి లాగారు. యూనియన్ నేతలు అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించి 48 వేల మంది ఉద్యోగాలు పోయేలా చేశారు. విధులకు హాజరుకాని వారిని తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశమే లేదు. వారితో చర్చలు జరిపే ప్రసక్తే లేదు.. పండుగ సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసి, ఆర్టీసీని నష్టపరిచిన కార్మికులను క్షమించే ప్రసక్తే లేదు. అసలు వారు చేస్తున్నది సమ్మె కానే కాదు. ఈ విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. విధులకు హాజరైన ఉద్యోగులు, కార్మికుల సెప్టెంబర్ జీతం వెంటనే విడుదల చేస్తాం’అని సీఎం వివరించారు.

**నాదాష్ దుష్మన్‌లా పరిస్థితి..**

‘అర్థరహిత డిమాండ్లతో, చట్ట విరుద్ధంగా కార్మికులు చేస్తున్న సమ్మెకు రాష్ట్రంలో కొన్ని రాజకీయ పక్షాలు మద్దతివ్వడం అనైతికం. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, న్యాయ సమ్మతం కాని కోర్కెలతో సమ్మె చేసే వారికి మద్దతిచ్చే రాజకీయ పక్షాలకు ప్రజల మద్దతు లేదు. అసలు రాష్ట్రంలో సరైన ప్రతిపక్షమే లేదు. రాష్ట్రంలో పరిస్థితి నాదాన్ దుష్మన్ అనేలా ఉంది. రాజకీయ ప్రయోజనం కోసం గోతికాడి నక్కల్లా ఎదురు చూస్తున్నాయి. వారి ఆశ ఫలించదు. గతంలో అనేక విషయాల్లో తప్పుడు వైఖరి వల్లే వారు ప్రజల మద్దతు కోల్పోయారు. ఆర్టీసీ విషయంలో కూడా అలాగే జరుగుతుంది. ఇక్కడ ఆర్టీసీ కార్మికులు కోరుతున్న డిమాండ్లలో వేటిని కూడా ఆయా రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయట్లేదు’అని సీఎం పేర్కొన్నారు.

**వెంటనే నియామకాలు..**

‘మూడు రోజుల్లో వంద శాతం బస్సులు పునరుద్ధరించాలి. ఇందుకు అవసరమైన సిబ్బందిని వెంటనే తీసుకోవాలి. రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్లు, రిటైర్డ్ పోలీస్ డ్రైవర్లను ఉపయోగించుకోవాలి. బస్సులు, భారీ వాహనాలు నడిపిన అనుభవం కలిగిన వారిని పనిలోకి తీసుకోవాలి’అని సీఎం ఆదేశించారు. ‘ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన ప్రకారం ఆర్టీసీలో 50 శాతం (5,200) సంస్థ సొంత బస్సులు నడపాలి. ఇందుకు అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలి. 30 శాతం(3,100) అద్దె బస్సులు నడపాలి. ఇందులో ఇప్పటికే 21 శాతం ఉన్నాయి. మరో 9 శాతం బస్సుల కోసం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి. 20 శాతం (2,100) ప్రైవేటు బస్సులకు స్టేజీ క్యారేజీలుగా పర్మిషన్లు ఇవ్వాలి’అని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్, సీనియర్ అధికారులు సునీల్ శర్మ, నర్సింగ్‌రావు, సందీప్ సుల్తానియా, ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్లు పాండురంగనాయక్, సి.రమేశ్, మమతా ప్రసాద్, డీటీసీలు ప్రవీణ్ రావు, పాపారావు పాల్గొన్నారు.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలాగా?**

‘బీజేపీ నేతలు బాగా మాట్లాడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రైల్వే వ్యవస్థను, రైళ్లను ప్రైవేటీకరిస్తోంది. ఎయిర్‌లైన్స్‌ను ప్రైవేటీకరించింది. చివరికి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను కూడా ప్రైవేటీకరించింది. వివిధ ప్రభుత్వ రంగసంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించుకోవడం ద్వారా నిధులు సమకూర్చుకుంటామని కేంద్ర బడ్జెట్‌లోనే చెప్పింది. అక్కడి వారి ప్రభుత్వం ఇలా చేస్తుంటే, ఇక్కడి ఆ పార్టీ నేతలు మాత్రం అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు’అని మండిపడ్డారు.

### 8న కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించనున్న మోదీ



**న్యూఢిల్లీ:** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కర్తార్‌పూర్ కారిడార్‌ను నవంబర్ 8న ప్రధాని మోదీ ప్రారంభించనున్నారని కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ బాదల్ వెల్లడించారు. భారత్ వైపునున్న చెక్‌పోస్టును మోదీ ప్రారంభిస్తారని ఆమె ట్వీట్ చేశారు. కర్తార్‌పూర్ సాహిబ్ పాకిస్తాన్‌లోని నరోవల్ జిల్లాలో రావి నది ఒడ్డున ఉంది. దీన్ని సిక్కుల తొలి గురువు గురునానక్ 1522లో ఏర్పాటు చేశారు. సిక్కులకు ఎంతో పవిత్రమైన ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వీలుగా కర్తార్‌పూర్ కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు భారత్, పాకిస్తాన్‌లు గత నవంబర్‌లో అంగీకరించాయి. కాంగ్రెస్ 72 ఏళ్ల పాలనలో సాధ్యం కాని దాన్ని ప్రధాని మోదీ సాధ్యం చేసి చూపించారన్నారు. కాగా గురునానక్ 550వ ప్రకాశ్ పూర్వ్ వేడుకలతోపాటు కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ గత వారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీలను ఆహ్వానించారు. ఈ కారిడార్ కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్‌ను పంజాబ్ గుర్‌దాస్‌పూర్ జిల్లాలోని డేరా బాబా నానక్ ఆలయంతో కలుపుతుంది. దీని ద్వారా భారతీయ భక్తులు వీసా లేకుండానే, కేవలం ముందస్తు అనుమతితోనే దర్బార్ సాహిబ్‌ను సందర్శించవచ్చు.



## సెండాయ్ సెవన్..



జపాన్‌లో సెండాయ్ నగరం 2011లో భూకంపం ధాటికి విలవిల్లాడిపోయింది. ఆ నగరం పునర్నిర్మాణానికి జపాన్ ప్రభుత్వం రచించిన ప్రణాళికలు అంతర్జాతీయంగా స్ఫూర్తి రగిల్చాయి. ఏదైనా విపత్తు వచ్చినప్పుడు ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వాలు, వివిధ వర్గాలు, పౌర సమాజం, సామాజిక సంస్థలు, ప్రైవేటు రంగాలు, అంతర్జాతీయ సంస్థలు, శాస్త్ర సాంకేతిక రంగాలు కలసికట్టుగా పనిచేస్తే గండాల నుంచి ఎలా గట్టెక్కవచ్చునో సెండాయ్ నిరూపించింది. జపాన్ వేసిన బాటలో యూఎన్ నడుస్తూ ప్రపంచ దేశాలు ప్రకృతి విల యాలను ఎదుర్కోవడానికి సెండాయ్ సెవన్ పేరుతో 2030 నాటికి పూర్తి చేసేలా ఏడు మార్గదర్శకాలను రూపొందించింది. దీనిని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అవేంటంటే..

- ప్రకృతి విపత్తుల మృతుల సంఖ్యని గణనీయంగా తగ్గించడం
- 2020–30 మధ్య ఏడాదికి సగటున లక్ష మంది నిరాశ్రయులవుతారని అంచనా. దీనిని తగ్గించడం.
- ప్రకృతి వైపరీత్యాలతో అమెరికాలో గత ఏడాది 5,200 కోట్ల డాలర్ల నష్టం వచ్చింది. ఫణి తుఫాన్ ఈ ఏడాది మనకి రూ.24 వేల కోట్ల నష్టాన్ని తెచ్చింది. ఈ తరహా ఆర్థిక నష్టాలను తగ్గించడానికి వ్యూహరచన.
- విపత్తులు సంభవించినా తట్టుకునేలా పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణం.
- విపత్తుల సమయంలో వివిధ దేశాల మధ్య ఆర్థిక, శాస్త్రసాంకేతిక సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం.
- విపత్తుల్ని ఎదుర్కోవడానికి అన్ని దేశాలు వ్యూహాలు రచించేలా చర్యలు.
- ముందస్తుగా ప్రకృతి వైపరీత్యాలను గుర్తించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, ముప్పు ఎక్కువగా ఉండే తీర ప్రాంతాల ప్రజల్లో తమని తాము రక్షించుకునేలా అవగాహనని పెంచడం.

## డాలర్‌కి ఆరు డాలర్లు...



ప్రకృతి వైపరీత్యాలను తగ్గించడానికి, వరదలు, భూకంపాల సమయంలో బాధితుల్ని కాపాడటానికి పకడ్బందీ ప్రణాళికలు రచించేలా ప్రపంచ దేశాల్లో అవగాహనను నింపడానికి ప్రతీ ఏడాది అక్టోబర్ 13న ఐక్యరాజ్యసమితి ఇంటర్నేషనల్ డే ఫర్ డిజాస్టర్ రిడక్షన్ నిర్వహిస్తోంది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేం కానీ, ఎంతో కొంత ఆ తీవ్రతని తగ్గించే ప్రయత్నాలైతే చేయొచ్చు. దీనికి వివిధ దేశాల ప్రభుత్వాలు, విపత్తులు పొంచి ఉన్న ప్రాంత ప్రజలు అందుకు సన్నద్ధులుగా ఉండాలి. అలా సన్నద్ధతను పెంచే దిశగా ఐక్యరాజ్యసమితి కృషి చేస్తోంది. గత కొద్ది కాలంగా సంభవిస్తున్న ప్రకృతి విలయాలను చూస్తుంటే ప్రపంచ దేశాలు కొన్ని లక్షల డాలర్లను పెట్టుబడిగా పెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల్ని కాపాడుకోవడంలో ఇతర దేశాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని ఇండియా చెబుతోంది. ఈ మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు పెట్టే ప్రతీ డాలర్‌కి ఆరు డాలర్లు తిరిగి వస్తాయని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గటరస్ అంచనా వేస్తున్నారు. ఇలా పెట్టుబడి పెట్టడం వల్ల కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతుంది. పెట్టిన పెట్టుబడికి ఆరింతలు లాభం రావడం వల్ల సుస్థిరాభివృద్ధి జరుగుతుంది.

### కోడెల సొంతూరుకు
## రాష్ట్ర పోలీసులు

హైదరాబాద్: ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య ఘటనలో దర్యాప్తు కోసం బంజారాహిల్స్ పోలీసులు శనివారం గుంటూరు జిల్లా నర్సరావుపేటకు వెళ్లారు. గత నెల 16న తన నివాసంలో కోడెల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన సెల్‌ఫోన్‌ను కుటుంబ సభ్యులు తమ అధీనంలోనే ఉంచుకున్నారు. దర్యాప్తులో భాగంగా రెండు వారాల కింద సీన్ రీకన్‌స్ట్రక్షన్ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా కుటుంబ సభ్యులు అందుబాటులో లేరు. కోడెల కొడుకు శివరాంతో పాటు కూతురు విజయలక్ష్మిని విచారించాల్సి ఉంది. ఇందుకు పలుమార్లు కబురు పెట్టినా వారి నుంచి స్పందన లేదు. దీంతో నేరుగా వారిని విచారించేందుకు పోలీసులే కోడెల సొంతూరుకు వెళ్లి ఆయన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయన కూతురి నుంచి సమాచారాన్ని రాబట్టేందుకు యు. కోడెల ఆత్మహత్యకు మూడు నెలల ముందు శివరాం కెన్యాకు వెళ్లారని, మధ్యలో హైదరాబాద్‌కు వచ్చారా లేదా అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

## త్వరలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ రోడ్‌మ్యాప్
### ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

హైదరాబాద్: బ్లాక్‌చైన్ టెక్నాలజీ రోడ్‌మ్యాప్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ వెల్లడించారు. డిజిటల్ ఐడెంటిటీ కాన్ఫరెన్స్–2019లో భాగంగా ఐఎస్‌బీతో పాటు పలు సంస్థలతో తెలంగాణ బ్లాక్‌చైన్ డిస్ట్రిక్ట్ పార్ట్‌నర్‌షిప్ ఒప్పందంపై శనివారం సంతకాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్‌లో నవంబర్ 18 నుంచి బ్లాక్‌చైన్ స్టాండర్డ్ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్లాక్‌చైన్ టెక్నాలజీ నిపుణులు పాల్గొంటారని వివరించారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రత్యేక బ్లాక్‌చైన్ చైర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ అంశంపై ఇప్పటికే ట్రిపుల్‌ఐటీ, సీడాట్, టెక్‌మహీంద్రలతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫేక్ డ్రగ్స్, విద్యార్హత సర్టిఫికెట్లు, భూమి రిజిస్ట్రేషన్స్, ల్యాండ్‌రికార్డుల నిర్వహణలో ఈ టెక్నాలజీ ద్వారా అనేక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి, నీతిఆయోగ్ ప్రతినిధి ఆర్నబ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం'

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి ఆధారాల్లేకుండా ప్రజా సంఘాలను నిషేధిత సంఘాలుగా మీడియా ద్వారా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని పలు ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. గత 50 ఏళ్లుగా ప్రజా జీవితంలో వివిధ అంశాలు, సమస్యలపై పోరాడుతున్న తమపై దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఎన్.నారాయణరావు (పౌర హక్కుల సంఘం), కాశీం (విరసం), అభినవ్ (కుల నిర్మూలన పోరాట కమిటీ), బల్లా రవీంద్రనాథ్ (రాజకీయ ఖైదీల విడుదల కమిటీ), రవిచందర్ (తెలంగాణ ప్రజా ఫ్రంట్), అనిత (చైతన్య మహిళా సంఘం), జె.కోటి (ప్రజా కళా మండలి), సందీప్ (తెలంగాణ విద్యార్థి వేదిక), సమీర్ (తెలంగాణ విద్యార్థి సంఘం), ఎం.రాజు (దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం) తదితరులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రజల పక్షాన పోరాడుతున్న సంఘాలను కేసీఆర్ ప్రభుత్వం నిషేధిత సంఘాలుగా తప్పుడు ప్రచారాన్ని చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

## కొత్త మార్గదర్శకాలెక్కడ?

- మార్చి 31తో ముగిసిన 'టీఎస్‌ఐపాస్' అమలు గడువు
- 2019-24 మార్గదర్శకాల రూపకల్పనపై స్పష్టతివ్వని ప్రభుత్వం
- టీ ఐడియా, టీ ప్రైడ్ కింద రూ. 2,540 కోట్ల రాయితీలు పెండింగ్




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో పారిశ్రామిక రంగం అత్యంత కీలకమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం 2015, జనవరి ఒకటి నుంచి నూతన పారిశ్రామిక చట్టం టీఎస్ ఐపాస్‌ను అమలు చేస్తోంది. దాదాపు నాలుగేళ్ల పాటు అమల్లో ఉన్న టీఎస్‌ఐపాస్ మార్గదర్శకాల అమలు గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగిసింది. నూతన పారిశ్రామిక చట్టం మార్గదర్శకాల రూపకల్పనపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు పాత మార్గదర్శకాలను కొనసాగించాలని పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2015 నుంచి రాయితీలు, ప్రోత్సాహకాల చెల్లింపు రూ.2,540 కోట్ల మేర బకాయిల రూపంలో నిలిచిపోయాయి. పాత మార్గదర్శకాలు అమలుకు నోచుకోక, కొత్త మార్గదర్శకాలపై స్పష్టత లేక ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో గందరగోళం నెలకొంది. ఇది పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పారిశ్రామికవర్గాలు చెబుతున్నాయి.

#### ఇంకా ఎన్నాళ్లు..

రాయితీలు, ప్రోత్సాహకాలకు సంబంధించి పారిశ్రామిక చట్టం టీఎస్‌ఐపాస్‌లో అంతర్భాగంగా ఉన్న టీ ఐడియా, టీ ప్రైడ్‌ను తదుపరి మార్గదర్శకాలు జారీ అయ్యేంత వరకు కొనసాగించాలంటూ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ ఏడాది మార్చి 28న ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు 2019–24 మధ్యకాలంలో ఐదేళ్ల పాటు అమల్లో ఉండేలా టీఎస్‌ఐపాస్‌కు సంబంధించి కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వానికి లేఖ రాసి 6 నెలలు గడిచినా నూతన మార్గదర్శకాల రూపకల్పనపై పరిశ్రమల శాఖకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. దీంతో టీఎస్‌ఐపాస్ పాత మార్గదర్శకాలు మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని పరిశ్రమల శాఖ వర్గాలు అంటున్నాయి.

#### బకాయిలు రూ. 2,540 కోట్లు..

టీఎస్‌ఐపాస్‌లో భాగంగా జనరల్ కేటగిరీ పరిశ్రమల యజమానులకు టీ ఐడియా, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు టీ ప్రైడ్ కింద కలిపి మొత్తంగా 29 వేల మంది పారిశ్రామికవేత్తలకు రూ.2,540.17 కోట్ల రాయితీలు, ప్రోత్సాహకాల బకాయిలు అందాల్సి ఉంది. రాష్ట్ర అవతరణకు పూర్వం అమ్మకం పన్నుకు సంబంధించిన బకాయిలు 2013 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. విద్యుత్ రాయితీలు, పావలా వడ్డీ ప్రోత్సాహకం, తనఖా సుంకం, నైపుణ్య శిక్షణ తదితరాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో 2017 నుంచి, జనరల్ కేటగిరీల్లో 2015 నుంచి పరిశ్రమల శాఖ నుంచి విడుదల కావాల్సిన రాయితీలు, బకాయిలు పేరుకుపోయాయి. టీఎస్‌ఐపాస్ పాత మార్గదర్శకాల ప్రకారమే రాయితీలు, బకాయిలు కొనసాగిస్తామని పరిశ్రమల శాఖ ప్రకటించినా.. ఏళ్ల తరబడి బకాయిలు పేరుకుపోవడంతో పరిశ్రమల నిర్వహణ తమకు భారంగా మారుతోందని పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. నూతన మార్గదర్శకాలు రూపొందించే పక్షంలో రాయితీలు, ప్రోత్సాహకాలపై ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందనే అంశం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అంతు చిక్కడం లేదు.

#### ముగిసిన గడువు...

త్వరితగతిన పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2014లో 'తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రూవల్, సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్'(టీఎస్‌ఐపాస్) చట్టాన్ని రూపొందించింది. 14 కీలక రంగాలను లక్ష్యంగా చేసుకుని పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షించేలా మార్గదర్శకాలు రూపొందించింది.

టీఎస్‌ఐపాస్ కింద అనుమతిచ్చిన పరిశ్రమలు: **11,000**
ఉత్పత్తిని ప్రారంభించిన పరిశ్రమలు: **8,400**
వీటి కోసం చేసిన ఖర్చు: **1.60** లక్షల కోట్లు
ప్రత్యక్షంగా ఉపాధి లభించిన వారు: **12** లక్షలు
పరోక్షంగా ఉపాధి పొందిన వారు: **20** లక్షలు

## 'హుజూర్'లో ముందంజలో ఉన్నాం

- టీఆర్‌ఎస్‌కు అనుకూలంగా అంతర్గత సర్వేలు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- హుజూర్‌నగర్ ఎన్నికపై పార్టీ నేతలతో టెలి కాన్ఫరెన్స్
- వారం పాటు ఇంటింటికీ ప్రచారం చేయాలని నేతలకు సూచన

సాక్షి, హైదరాబాద్: హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేల ప్రకారం కాంగ్రెస్ కంటే టీఆర్‌ఎస్ ఎంతో ముందంజలో ఉందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. హుజూర్‌నగర్‌లో ఉప ఎన్నిక ప్రచారం తీరుతెన్నులపై పార్టీ ఇన్‌చార్జిలు, సీనియర్ నేతలతో శనివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొంటున్న పార్టీ ఇన్‌చార్జిలతో పాటు, ఇతర నేతల నుంచి ప్రచారం జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. మరో వారం రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇంటింటికీ పార్టీ ప్రచారం చేరాలని పార్టీ నేతలను ఆదేశించారు. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు.. ప్రజల నుంచి టీఆర్‌ఎస్‌కు అనూహ్య మద్దతు లభిస్తోందని, పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లో కనీసం 50 శాతం ఓట్లు టీఆర్‌ఎస్ అభ్యర్థికి అనుకూలంగా పోలవుతాయని కేటీఆర్ వెల్లడించారు. గత ఎన్నికల్లో పార్టీ ఎన్నికల చిహ్నం కారును పోలివున్న ట్రక్కు గుర్తుతో టీఆర్‌ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ కొన్ని వాహనాలకు సంబంధించిన ఇతర గుర్తులు ఉన్నందున.. పార్టీ చిహ్నాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డమ్మీ ఈవీఎంలు ఉపయోగించాలని పార్టీ నేతలకు సూచించారు.

#### కాంగ్రెస్‌కు ప్రచారాంశాలు కరువు..

'టీఆర్‌ఎస్ గెలిస్తే హుజూర్‌నగర్‌కు లాభం'నినాదంతో చేస్తున్న ప్రచారానికి ప్రజల మద్దతు లభిస్తోందని, అదే సమయంలో కాంగ్రెస్‌కు ప్రచారాంశాలు లేకుండా పోయాయని పార్టీ నేతలతో కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో లేకున్నా.. కేంద్ర నిధులతో హుజూర్‌నగర్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేస్తున్న ప్రచారానికి పెద్దగా ప్రాధాన్యత లేదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడుతుందనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత ఉప ఎన్నికతో బీజేపీ బలం తేలిపోతుందని, డిపాజిట్ దక్కితే అదే వారికి అతిపెద్ద ఉపశమన్నారు. ప్రజాభిమానం పొందలేని బీజేపీ.. కాంగ్రెస్‌కు పరోక్షంగా సహకరిస్తూ దొంగ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.

#### హుజూర్‌నగర్ ప్రచారానికి కేటీఆర్ దూరం..?

దసరా తర్వాత హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రచారంలో కేటీఆర్ పాల్గొంటారని పార్టీ వర్గాలు తొలుత వెల్లడించాయి. నామినేషన్ల పర్వం ముగిసిన తర్వాత ఈ నెల 4న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రోడ్ షోలో కేటీఆర్ పాల్గొన్నారు. తిరిగి ఈ నెల 10 నుంచి నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్‌షోలలో పాల్గొంటారని ప్రచారం జరగ్గా.. చివరి నిమిషంలో పర్యటన షెడ్యూల్ రద్దయింది. కాగా, హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రచారంలో కేటీఆర్ పాల్గొనే అవకాశం లేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 19న ఉప ఎన్నిక ప్రచారం ముగియనుండగా.. సీఎం కేసీఆర్ ఈ నెల 18న జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని ప్రచారం జరిగింది. అయితే సీఎం కేసీఆర్ ప్రచారానికి సంబంధించి ఇప్పటివరకు షెడ్యూల్ ఖరారు కాలేదు.

## టీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి వాదన సరికాదు
### ప్రతిపక్షంలో ఉండి రూ.కోట్ల అభివృద్ధి చేశా: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్న పార్టీ గెలిస్తేనే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందనే వాదన సరైంది కాదని, ఈ తప్పుడు వాదనను తిప్పికొట్టాలని కాంగ్రెస్ కేడర్‌కు టీపీసీసీ చీఫ్, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాను ప్రతిపక్షంలో ఉండగా కోదాడ ఎమ్మెల్యేగా కోట్లాది రూపాయలు నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి గెలుపు ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని కోరారు. శనివారం ఆయన ఫేస్‌బుక్ లైవ్ ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలతో మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ గెలవాలనే నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. హుజూర్‌నగర్ అభివృద్ధి కోసం తాను శాయశక్తులా కృషి చేస్తానని, ఎంపీగా ఉన్నందున కేంద్ర నిధులతో ప్రపంచస్థాయి వృత్తి నైపుణ్య కేంద్రం ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తానని ఉత్తమ్ హామీ ఇచ్చారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోయిందని, ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్.. ఉన్న ఉద్యోగాలు తీసేసిన విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలని ఉత్తమ్ కోరారు.

## మద్దతుపై పునరాలోచన: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు మద్దతిచ్చే విషయంలో పునరాలోచనలో ఉన్నట్లు సీపీఐ తెలిపింది. దీనిపై తుది నిర్ణయాన్ని చర్చించాక ప్రకటించనున్నట్టు శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆర్టీసీ ఉద్యోగులను తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని పేర్కొంది.

"Buddha Education Society & Trust"
BHAGAWAN BUDDHA HOMOEOPATHIC MEDICAL COLLEGE & HOSPITAL
(Approved by the Govt. of Karnataka., Affiliated to Rajiv Gandhi University of Health Sciences, Karnataka,Bangalore & Recognised by Ministry of AYUSH & CCH,New Delhi)
ADMISSIONS OPEN FOR 2019-20
BHMS (Bachelor of Homoeopathic Medicine & Surgery)
(5 ½ years inclusive of Internship). Eligibility : Pass in PUC, 10+2 (PCB 45%, / SC & St 40% Agg)
For Admissions Contact: 9640777757/ 9886664713 / 98860 73010

## డిజైన్ రంగానికి చిరునామాగా తెలంగాణ

- కేంద్ర సంస్థ డిప్ సహకారంతో హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్
- 2020 నాటికి రూ.19 వేల కోట్లకు చేరనున్న డిజైనింగ్ రంగ సామర్థ్యం
- వరల్డ్ డిజైన్ అసెంబ్లీ 31వ సమావేశంలో మంత్రి కేటీఆర్



సమావేశంలో పాల్గొన్న మంత్రులు పువ్వాడ అజయ్, కేటీఆర్, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ డిజైనింగ్ రంగానికి తెలంగాణను చిరునామాగా మారుస్తామని, డిజైనింగ్ రంగంలో పరిశోధనల దిశగా రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన వరల్డ్ డిజైన్ అసెంబ్లీ 31వ వార్షిక సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డిజైనింగ్ రంగానికి పెరుగుతున్న ప్రాముఖ్యత దృష్ట్యా కేంద్ర పారిశ్రామిక విధానాలు, ప్రోత్సాహక విభాగం (డిప్) సహకారంతో హైదరాబాద్‌లో 'నేషనల్ డిజైన్ సెంటర్'ను ఏర్పాటు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. వివిధ సంస్థలకు డిజైన్ కన్సల్టెన్సీ సేవలు, సామర్థ్యం పెంపుదల, డిజైన్ ఎడ్యుకేషన్‌లో పెంపు లక్ష్యంగా ఈ కేంద్రం సేవలందిస్తుందన్నారు. వివిధ సంస్థలు రూపొందించే ఉత్పత్తులు, సేవలకు 'బ్రాండింగ్'ఇచ్చేందుకు ఈ సంస్థ దోహదం చేస్తుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ డిజైన్ అసెంబ్లీ ద్వారా..అంతర్జాతీయ డిజైన్ సంస్థలతో హైదరాబాద్‌లోని డిజైన్ సంస్థలు అనుసంధానమయ్యే అవకాశం లభించిందన్నారు. డిజైనింగ్ రంగంలో హైదరాబాద్ సామర్థ్యాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఏర్పడిందని.. భవిష్యత్తులో మరిన్ని డిజైనింగ్ కార్యక్రమాల్లో రాష్ట్రం భాగస్వామిగా మారుతుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

#### 2020 నాటికి రూ.19 వేల కోట్లకు!

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ లెక్కల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో డిజైనింగ్ రంగం వాటా కేవలం రూ.800 కోట్ల నుంచి రూ. వేయి కోట్ల మేర ఉందని..2020 నాటికి ఇది రూ.19 వేల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. డిజైన్ ప్రాముఖ్యతపై అవగాహన పెరుగుతున్నా రాష్ట్రంలో డిజైనింగ్ రంగం ఇంకా శైశవదశలోనే ఉందని, లాభాలు, నిపుణులు, విషయ పరిజ్ఞానం తదితరాల్లో ఇంకా సాధించాల్సి ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలో డిజైన్ రంగంలో పలు సంస్థలు ఇంకా పాత పద్ధతులనే అనుసరిస్తున్నాయని, మరోవైపు స్థానిక మార్కెట్లలో వివిధ ఉత్పత్తులకు నూతన డిజైన్ల ద్వారా తమదైన ముద్ర వేసేందుకు అనేక బహుళ జాతి సంస్థలు భారత్‌లో అడుగు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని కేటీఆర్ వెల్లడించారు. ఐటీ సాంకేతిక, సేవల్లో బెంగుళూరుతో హైదరాబాద్ పోటీ పడుతోందని, డిజైన్ రంగంలోనూ హైదరాబాద్ ప్రత్యేకత నిలిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ ప్రస్తుతం అనేక వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు కేంద్ర స్థానంగా మారిందని, చేర్యాల పెయింటింగులు, గద్వాల, పోచంపల్లి, గొల్లభామ చీరలు, కరీంనగర్ ఫిలిగ్రీ వంటి చేనేత, హస్తకళలకు తెలంగాణ నిలయంగా ఉందన్నారు. తెలంగాణ సినిమా పరిశ్రమ కూడా సృజనాత్మకతకు పెద్దపీట వేస్తోందని..డిస్నీ, కార్టూన్ నెట్‌వర్క్, నికలోడియన్ వంటి అంతర్జాతీయ కార్టూన్ సంస్థలకు సాంకేతిక సేవలు అందించే దశకు హైదరాబాద్ చేరుకుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. సమావేశంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, వరల్డ్ డిజైన్ అసెంబ్లీ నూతన అధ్యక్షుడు శ్రీనివాసన్ పాల్గొన్నారు. భారత్‌తో పాటు 40 దేశాలకు చెందిన వరల్డ్ డిజైన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. వరల్డ్ డిజైన్ అసెంబ్లీ సందర్భంగా నగరంలో వారం రోజుల పాటు హైదరాబాద్ డిజైన్ వీక్ పేరిట వివిధ సంస్థలు పలు కార్యక్రమాలు నిర్వహించాయి. వివిధ అంశాల్లో యువతకు, విద్యార్థులకు డిజైన్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.



For More Details Contact: HYDERABAD & SECUNDERABAD: 9949869551, 9384699610, REST OF TWIN CITIES: 9966479203, KHAMMAM & NALGONDA: 9949869551, 9384699610.
DISTRIBUTORS:- HYDERABAD & SECUNDERABAD: Sri Rama Marketing Ph: 9849009874, REST OF TWIN CITIES: R.N.R. Agencies Ph: 9393990973, DIRECT DEALER:- KHAMMAM & NALGONDA: Garlapati Metal Stores Ph: 9866228080, 9866399299
DISTRIBUTORS / TRADE ENQUIRY: 9384699600, 73585 33111



## ఆనకట్టలే ముంచేస్తున్నాయ్...



ఇదో కొత్త కష్టం. ఎవరూ ఊహించని విపత్తు. ఏ వరదలైతే ప్రజల్ని ముంచేస్తున్నాయని భయపడి వాటిని కట్టడి చేయడానికి ఆనకట్టలు నిర్మించామో ఇప్పుడవే ప్రజల ఉసురు తీస్తున్నాయి. ప్రకృతి విపత్తుల్ని ఎదుర్కోవడంలో సాంకేతికంగా ఎదిగే క్రమంలో మానవ తప్పిదాల కారణంగా కొత్త కష్టాలు వచ్చిపడుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో భారీ వర్షాలతో రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్‌లో నదుల్లో నీరు 25 రెట్లు ఎక్కువగా పొంగి ప్రవహించింది. దీంతో విధిలేక హఠాత్తుగా డ్యామ్ గేట్లు ఎత్తుతుండటంతో వరదలు ముంచెత్తడం లాంటి ఘటనలు ఎక్కువైపోతున్నాయి. గత పదేళ్లలో ఇలాంటి ఘటనలు పెరిగిపోయాయి. 2009లో హిరాకుడ్ డ్యామ్‌తో ఒడిశా.. 2010, 2013లో తెహ్రీ డ్యామ్ గేట్లు ఎత్తడంతో ఉత్తరాఖండ్... 2016లో కోసి డ్యామ్‌తో బిహార్.. 2017లో రంగనది డ్యామ్ గేట్లు ఎత్తడంతో అసోం.. ఈ ఏడాది హిడ్కల్, మలప్రభ డ్యామ్ గేట్లు ఎత్తడంతో కర్ణాటక.. కోయనా, వార్నా ఆనకట్టలు పొంగిపొర్లడంతో మహారాష్ట్రను వరదలు ముంచెత్తాయి. ఆనకట్టల గేట్లు ఎప్పుడు ఎత్తాలనేది మనం 1950 కాలం నాటి వర్షపాతం ఆధారంగా నిబంధనలు రూపొందించాం. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో కుండపోత వర్షాలు ఎక్కువైపోయినా అవే నిబంధనల్ని పాటిస్తూ ఉండటంతో అపార నష్టం జరుగుతోంది.

## ఆ గోడంతా పచ్చగా...



రుతువులు గతి తప్పి, ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోవడానికి ఎన్నో కారణాల్లో ఎడారీకరణ ఒకటి. దానిని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం గ్రేట్ గ్రీన్ వాల్‌ను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. గుజరాత్ నుంచి ఢిల్లీ–హర్యానా సరిహద్దు ప్రాంతం వరకు అరావళి పర్వతాల మీదుగా 1,400 కి.మీ. పొడవు, 5 కి.మీ. వెడల్పుతో ఈ గ్రీన్ వాల్‌ని నిర్మించనున్నారు. పోర్‌బందర్ నుంచి పానిపట్ వరకు నిర్మించే ఈ గ్రీన్ వాల్‌తో పశ్చిమ దేశాల నుంచి వచ్చే దుమ్ము, ధూళిని నివారించవచ్చు. గ్రీన్‌వాల్ అంటే నిట్టనిలువుగా పెరిగే చెట్లను ఒక గోడ మాదిరిగా వరసగా, దట్టంగా పెంచడం. ఎడారీకరణ విసురుతున్న సవాళ్లపై ఇటీవల ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులోనే ఈ కొత్త ఆలోచనకు బీజం పడింది. ఆఫ్రికాలో నిర్మిస్తున్న గ్రేట్ గ్రీన్ వాల్ స్ఫూర్తితో దీని నిర్మాణం కూడా జరపనున్నారు. 2030 నాటికి 2.6 కోట్ల హెక్టార్ల అటవీ భూమిని పునరుద్ధరించాలని కేంద్రం లక్ష్యంలో భాగంగా ఈ గ్రీన్‌వాల్ నిర్మాణాన్ని చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఈ గ్రీన్‌వాల్ కూడా ఎంతో ఉపయోగపడుతుందని పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు.

# 19న రాష్ట్ర బంద్



హైదరాబాద్‌లోని బస్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

- ఆర్టీసీ జేఏసీ పిలుపు
- రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ఉధృతం
- ఖమ్మంలో ఒంటికి నిప్పంటించుకున్న ఓ డ్రైవర్
- హైదరాబాద్ తరలింపు.. పరిస్థితి విషమం
- కొన్నిచోట్ల ఉద్రిక్త పరిస్థితులకు దారితీసిన వైనం
- తగ్గేది లేదంటున్న కార్మికులు... పట్టించుకునేది లేదంటున్న సర్కారు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మె క్రమంగా ఉధృతమవుతోంది. ఇప్పటివరకు శాంతియుతంగా కార్యక్రమాలు చేస్తున్న కార్మికులు ఇక వ్యూహాత్మక కార్యాచరణతో సమ్మెను తీవ్రతరం చేస్తున్నారు. వీరికి రాజకీయ పార్టీలు సైతం మద్దతుగా నిలిచి కార్మికుల డిమాండ్ల సాధనకు తోడ్పాటు అందిస్తుండడంతో సమ్మె తీవ్రత బలంగా మారుతోంది. ఇదిలావుండగా ఖమ్మం బస్ డిపోకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడం, నగరంలోని ఆస్పత్రికి తరలించడం, శ్రీనివాస్‌రెడ్డి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటం... తదితర అంశాలు సమ్మెను మరింత వేడెక్కించాయి. మరోవైపు కార్మికుల చర్యలకు భయపడే ప్రసక్తే లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. శనివారం ఉదయం మంత్రి పువ్వాడ అజయ్ మాట్లాడుతూ.. గడువులోగా విధుల్లో చేరని వారు కార్మికులే కాదని, వారితో చర్చలు జరిపేది లేదని తేల్చిచెప్పారు. మూడ్రోజుల్లోగా నూరుశాతం బస్సులు నడపాలని, కొత్త విధానం ప్రకారం బస్సుల నోటిఫికేషన్లు తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా పట్టు వీడకపోవడం... కార్మికులు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేస్తుండడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతున్నట్లు కనిపిస్తోంది.

**ఏడు రోజుల కార్యాచరణ విడుదల...**

సమ్మె పట్ల వెనక్కు తగ్గని కార్మిక సంఘాలు ఏకంగా వారం రోజుల కార్యాచరణను ప్రకటించింది. ఇప్పటి వరకు ప్రత్యేక కార్యాచరణ ఏదీ లేకుండా రోజు వారీగా నిరసన కార్యక్రమాలు చేస్తూ వచ్చింది. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అఖిలపక్ష పార్టీ నేతల సమావేశంలో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఈనెల 19వ తేదీ వరకు రోజువారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలను వెల్లడించింది. ఈ నెల 13న అన్ని డిపోల వద్ద వంటా–వార్పు చేపట్టాలి. ఈ నెల 14న బస్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మహా ధర్నాలు నిర్వహించాలి. అదేవిధంగా ఇందిరాపార్క్ వద్ద సమ్మెకు మద్దతిస్తున్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, కార్మిక, కర్షక, మహిళా సంఘాలతో మహా ధర్నా. ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు, చౌరస్తాల వద్ద ఆర్టీసీ కార్మికులతో పాటు రాజకీయ, విద్యార్థి సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, కుల సంఘాలు, సబ్బండ వర్ణాల భాగస్వామ్యం తో రాస్తారోకోలు. 16న విద్యార్థి సంఘాలతో ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై ర్యాలీలు. 18న బైక్ ర్యాలీలు. ఈనెల 19న తెలంగాణ రాష్ట్ర బంద్. జేఏసీ కార్యాచరణ ప్రకటించిన గడువులోగా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను మరింత తీవ్రతరం చేయనున్నట్లు జేఏసీ స్పష్టం చేసింది.

## ప్రజలను ఇబ్బంది పెట్టేందుకే సమ్మె

మీడియా సమావేశంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్



**సాక్షి, హైదరాబాద్:** ప్రజలను ఇబ్బంది పెట్టేందుకే ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ పేర్కొన్నారు. దసరా సమయంలో లక్షలాది మంది గ్రామాలకు వెళ్లే సమయంలో సమ్మె చేయడం వెనుక అర్థం ఇదేనని, ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసేలా సమ్మెను చేపట్టారన్నారు. ఈనెల ఐదోతేదీ సాయంత్రం ఆరుగంటల్లోపు విధుల్లో చేరిన వారిని మాత్రమే కార్మికులుగా పరిగణిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. విధుల్లో చేరని వారు కార్మికులు కాదని, వారితో చర్చలు జరపాల్సిన అవసరం లేదన్నారు. శనివారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో జరిగిన సమావేశానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని సీఎం కేసీఆర్ ఎన్నడూ చెప్పలేదని మంత్రి స్పష్టం చేశారు. చెప్పని మాటలను చెప్పినట్లు కార్మికులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సమంజసం కాదని మంత్రి సూచించారు. దసరా రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులతో పాటు స్కూల్, కాలేజీ బస్సులను నడిపించామని, ప్రస్తుతం ఆ అవసరం లేదన్నారు. సమ్మెను ప్రయాణికుల మీద, ప్రభుత్వం మీద బలవంతంగా రుద్దారని మంత్రి మండిపడ్డారు.

**అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు**

తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో నడుస్తున్న ఆర్టీసీ సర్వీసులతో పాటు వివిధ ప్రైవేటు వాహనాల్లోఅధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పువ్వాడ హెచ్చరించారు. సమ్మె విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందన్నారు. సమ్మె పరిష్కారం కోసం ముగ్గురు ఐఏఎస్‌లతో ప్రభుత్వం కమిటీని నియమించిందని, దానికి సంబంధించిన సంప్రదింపుల ప్రక్రియ కూడా ముగిసిందని ఈనెల నాలుగో తేదీనే చెప్పామని, బస్సులను నడిపేందుకు తాత్కాలిక సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ప్రతి ఆర్‌ఎం కింద పోలీసు సిబ్బంది ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని రకాల పాసులు అనుమతిస్తామని, ఈ విషయంలో ఆదేశాలు సైతం ఇచ్చామన్నారు.

## మూల్యం చెల్లించుకోక తప్పదు

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం: డా.కె.లక్ష్మణ్



డా.కె.లక్ష్మణ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

**ముషీరాబాద్:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోతే టీఆర్‌ఎస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. వేలాది మంది కార్మికులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు కొనసాగిస్తుంటే ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. దసరా వేడుకలు కూడా లేకుండా ఆందోళన చేస్తున్న కార్మికులను చూస్తుంటే ఎంతో బాధ కలుగుతుందన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీకి మద్దతుగా శనివారం బస్‌భవన్ వద్ద బీజేపీ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రోడ్డుపై బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ రోడ్డుపైకి వచ్చిందని, ఇక ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీని కాపాడుకునేందుకే తాము సమ్మె కొనసాగిస్తున్నామన్నారు. ఈ ధర్నాలో బీజేపీతో పాటు తెలంగాణ జన సమితి, పలు ప్రజా, మహిళా, కార్మిక సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. బస్‌భవన్ ప్రాంగణం అంతా కార్మికులతో కిటకిటలాడింది. మరోవైపు ధర్నా నేపథ్యంలో ఉదయం నుంచే భారీ బందోబస్తు చేపట్టిన పోలీసులు ఆర్టీసీ క్రాస్‌రోడ్డు నుంచి వీఎస్‌టీ వరకు ప్రధాన రహదారి మొత్తం బారికేడ్లతో మూసివేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వాత్థామరెడ్డి, థామస్‌రెడ్డిలతో పాటు వివిధ జిల్లాల బీజేపీ నాయకులతో కలిసి బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపం నుంచి భారీ ర్యాలీగా బస్ భవన్‌కు తరలివచ్చారు. డా.కె.లక్ష్మణ్ బస్ భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసు బందోబస్తు నడుమ బలవంతంగా అరెస్టు చేశారు. కాగా, ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో బస్‌భవన్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ స్వల్పంగా గాయపడ్డారు. దీంతో చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగంలో చేర్చారు. ఆయనకు అన్ని వైద్య పరీక్షలు పూర్తి అయిన అనంతరం రాత్రి 7.20 ప్రాంతంలో లక్ష్మణ్ డిశ్చార్జ్ అయ్యారు.

## ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పలేదు: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని టీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పలేదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం టీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ భవిష్యత్తుపై జరుగుతున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, సంస్థను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఆర్టీసీపై ఉన్న ప్రేమతోనే సీఎం కేసీఆర్ ఉద్యోగులకు 44శాతం ఫిట్‌మెంట్ సహా అనేక సానుకూల నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రతీ అంశంపైనా విపక్ష పార్టీలు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నాయని, పండుగ సమయంలో ప్రజలను ఇబ్బంది పెట్టేందుకే కొందరు అత్యు త్సాహంతో సమ్మెకు దిగారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఆర్టీసీని బీజేపీ ప్రైవేటు పరం చేయగా.. ఛత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ ఏకంగా రద్దు చేసిందని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తలసాని వారికి సవాలు విసిరారు.

## ఆత్మహత్యలు వద్దు..: ఉత్తమ్



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వంతో పోరాడి సాధించుకుందామని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి సీఎం కేసీఆర్ బాధ్యత వహించి, అతని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఉత్తమ్ శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దసరా పండుగ రోజు ఆర్టీసీ కార్మికులు పస్తులున్నారని, వారి ఆకలి బాధలు కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు కార్మికుల ఉసురు తగులుతుందని, ఇప్పటికైనా మొండి వైఖరి విడనాడి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కాంగ్రెస్‌పార్టీ వారికి అండగా ఉంటుందని ఆ ప్రకటనలో భరోసా ఇచ్చారు.

## సెలవులు పొడిగించొద్దు: ఎస్టీఎఫ్

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఈ నెల 19 వరకు పాఠశాలలకు సెలవులు పొడిగించడం పట్ల స్టేట్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యు.పోచయ్య, సైదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**సెలవుల పొడిగింపు సరికాదు: యూఎస్‌పీసీ**

విద్యాసంస్థలకు సెలవులు పొడిగించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) అభిప్రాయం వ్యక్తం చేసింది. సెలవుల పొడిగింపును వెంటనే రద్దు చేసి పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలవాలని యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ రాములు, సీహెచ్ రవి (టీఎస్ యూటీఎఫ్), వై అశోక్ కుమార్, మైస శ్రీనివాసులు (టీపీటీఎఫ్), ఎం రఘుశంకర్ రెడ్డి, టీ లింగారెడ్డి (డీటీఎఫ్) కోరారు.

## బెదిరింపులకు పాల్పడితే నష్టమే

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ

**సాక్షి, హైదరాబాద్:** ఉద్యమంలో తోటి సంఘాల సహకారం తీసుకోవడంలో తప్పులేదని, బెదిరింపులకు పాల్పడితే నష్టం జరుగుతుందని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, సెక్రటరీ జనరల్ కె.రవీందర్‌రెడ్డి, వి.మమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎన్జీవో, టీజీవోలపై కొందరు బురద జల్లే ప్రయ త్నం చేస్తున్నారంటూ వాటిని ఖండించారు. బురద జల్లే వారిపై తామూ అదే వైఖరి అవలంబిస్తామని చెప్పారు. ఉద్యోగులు, టీచర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకతీతంగా ఉద్యమించాలని, అన్ని సం ఘాల మద్దతు కూడగట్టి ముందుకెళ్లాలన్నారు.

## యూనియన్లతో వెంటనే చర్చలు జరపాలి: గూడూరు

**సాక్షి, హైదరాబాద్:** కేసీఆర్ మొండి వైఖరి కారణంగానే ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేంతవరకు వెళ్లిందని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి మండిపడ్డారు. దసరా రోజున కుటుంబ సభ్యులకు బట్టలు కొనేందుకు కూడా డబ్బులు లేకపోవడం, అన్యాయంగా తమను తొలగించారన్న మనస్తాపంతోనే ఖమ్మం జిల్లాకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని శనివారం ఓ ప్రకటనలో ఆయన ఆరోపించారు.

## మరో పోరాటానికి సిద్ధం కావాలి: ఎంపీ బండి సంజయ్

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ నేతృత్వంలో కార్మిక వర్గం పక్షాన చేప ట్టిన ప్రజా ఆందోళనపై పోలీసుల అతి ప్రవర్తన.. నియంతృత్వ పోకడలతో కేసీఆర్ ప్రభుత్వం అవలంబించిన అణచివేత విధానాలకు నిదర్శనమని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఈ దాష్టీకమంతా రజాకార్ల విధానానికి తీసి పోని విధంగా ఉందని, సకల జనుల సమ్మె స్ఫూర్తి తో రాష్ట్ర ప్రజలు మరో విమోచన పోరాటానికి సంసిద్ధం కావాలని ఆయన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. యావత్తు రాష్ట్ర ప్రజానీకం కేసీఆర్ సర్కార్ దమననీతిపై ప్రజాస్వామిక పద్ధతిలో గాంధేయవాద ఉద్యమాలు నిర్మించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## 14న డీపీవో కార్యాలయాల ముట్టడి

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 14న డీపీవో కార్యాలయాల ముట్టడి, 15న మున్సిపాలిటీల్లో సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించాలని రాష్ట్ర గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాలు, మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ సంయుక్త సమావేశం నిర్ణయించింది. సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గం అండగా నిలవాలని తీర్మానించింది. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో పాలడుగు భాస్కర్, జె.వెంకటేష్ (సీఐటీయూ), కె.ఏసురత్నం, రవిచంద్ర (ఏఐటీయూసీ), కె.సూర్యం (ఐఎఫ్‌టీయూ), వెంకన్న (ఐఎన్‌టీయూసీ) తదితరులు పాల్గొన్నారు.



శనివారం హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

## సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: ఇంద్రసేనారెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి మొండి పట్టుదలకు పోకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చి, సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంఘీభావంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడాన్ని, దురహంకార పద్ధతుల్లో బీజేపీ నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసులు అత్యుత్సాహంతో అమర్యాదకరంగా వ్యవహరించడం వల్లే లక్ష్మణ్ అస్వస్థతకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చేరినట్టు చెప్పారు. గవర్నర్ పదవిని కించపరుస్తూ సీఎం సీపీఆర్వో వ్యాసం రాసినందుకు ఆయనను తొలగించాలని అన్నారు.

## ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

- ఖమ్మంలో ఘటన
- భగ్గుమన్న కార్మిక సంఘాలు



**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** ఆర్టీసీ కార్మికుల సమ్మె ఖమ్మంలో తీవ్ర ఉద్రిక్త, విషాదం, విధ్వంసకర పరిస్థితులకు దారితీసింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వ వైఖరికి మనస్తాపంతో నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఖమ్మం డిపో డ్రైవర్ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఖమ్మంలోని తన ఇంటి వద్ద కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం డిపోకు చెందిన మరో డ్రైవర్ వెంకటేశ్వరాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అయితే వెంటనే పోలీసులు, కార్మిక సంఘాల నేతలు, రాజకీయ పక్షాలు ఆయనను నిలువరించారు. శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యాయత్నంతో పెద్ద ఎత్తున కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు కలెక్టరేట్ వద్ద మోహరించి ఆందోళన నిర్వహించారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పలువురు కలెక్టరేట్ వద్ద బైఠాయించి.. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. మణుగూరు డిపోకు చెందిన బస్సుపై ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో బస్సు స్వల్పంగా ధ్వంసమైంది. శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యాయత్నంపై భగ్గుమన్న కార్మిక సంఘాలు కలెక్టరేట్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో ఆందోళనకారులపై బస్టాండ్ వద్ద పోలీస్ అధికారి చేయి చేసుకోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కార్మిక నాయకులు, రాజకీయ పక్షాలు ఆందోళనకు దిగాయి. శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ ఆదివారం జిల్లాలోని బస్సుల బంద్ నిర్వహించాలని కార్మికుల జేఏసీ నిర్ణయించింది.

## సీఎం ప్రకటన బెదిరింపు ధోరణికి అద్దంపడుతోంది: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులతో చర్చలకు తావులేదని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన బెదిరింపు ధోరణికి అద్దంపడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గమని, కార్మిక వ్యతిరేక వైఖరి వీడి వెంటనే చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. ఓ వైపు పోరాటం, మరోవైపు చర్చల ద్వారానే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని గుర్తుచేశారు. 48 వేల కుటుంబాలు బజారునపడటం న్యాయసమ్మతం కాదనేది తమ పార్టీ అభిప్రాయమని తెలిపారు. సకలజనులసమ్మెలో ఆర్టీసీ కార్మికుల భాగస్వామ్యం మరవలేనిదన్నారు.

## కార్మికులపై నియంతృత్వం తగదు: ఏఐటీయూసీ

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించడం తగదని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. నెల రోజుల క్రితం సమ్మె నోటీసులు ఇచ్చిన కార్మికులతో చర్చలు జరపకుండా అసలు సమ్మె చేయడమే తప్పు అనడం సరికాదని శనివారం ఆమె ఓ ప్రకటనలో తప్పుబట్టారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న కార్మికులను అణచివేసే ప్రయత్నాలను మానుకోవాలని ప్రభుత్వానికి ఆమె సూచించారు.

## ఆర్టీసీ సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సంపూర్ణ మద్దతు తెలిపింది. శనివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు జాక్టో చైర్మన్ జి.సదానందం గౌడ్, సెక్రెటరీ జనరల్ ఇ.రఘునందన్, ఎం.రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో మీడియా సమావేశాలు నిర్వహించాలని, పాఠశాలలు తెరిచిన రోజు నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించాలని, ఈ నెల 15న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘ నేతలు కె.కృష్ణుడు, సి.హెచ్. శ్రీనివాస్, కౌనగాని వెంకట్, గీతాంజలి, రాముని మల్లీశ్వరి, మోయిన్, కె.పర్వతరెడ్డి, కె.గౌరీశంకర్, బి.భుజంగరావు, కె.జయబాబు తదితరులు పాల్గొన్నారు.


ఫిషర్‌మన్ కోవ్ రిసార్ట్‌లో జిన్‌పింగ్, మోదీ

• భారత్-చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం

# ‘చెన్నై కనెక్ట్’

• చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ప్రకటించిన ప్రధాని మోదీ
• వాణిజ్యం, పెట్టుబడుల ఊతానికి ఇరుదేశాల నేతలు అంగీకారం
• గేట్ వే ఆఫ్ ఫ్రెండ్‌షిప్ మహాబలిపురం: మోదీ • మా బంధం మరింత బలోపేతం: జిన్‌పింగ్

**సాక్షి ప్రతినిధి, చెన్నై/మామల్లపురం:** విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటూ సహకారంలో నూతన అధ్యాయం ప్రారంభించాలని భారత్, చైనాలు నిర్ణయించాయి. భారత్, చైనా సంబంధాల్లో ‘చెన్నై కనెక్ట్’ కొత్త ఊపునిస్తుందని ప్రధాని మోదీ అభివర్ణించారు. మామల్లపురంలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య ముఖాముఖి రెండోరోజు కొనసాగింది. ద్వైపాక్షిక చర్చలకు వేదికైన మహాబలిపురం సమీపంలోని కోవలం బీచ్ తాజ్ ఫిషర్‌మన్ కోవ్ రిసార్టుకు ఉదయం 9.30 గంటలకు చేరుకున్న జిన్‌పింగ్‌కు మోదీ స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలూ గోల్ఫ్‌కార్ట్‌లో తిరిగారు. బీచ్‌లో నడిచారు. అక్కడి ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అద్దాల గదిలో ఇద్దరు నేతలు ఏకాంతంగా 90 నిమిషాలసేపు చర్చలు జరిపారు. అనువాదకులు ఆ సమయంలో వారితో ఉన్నారు. తర్వాత భారత విదేశాంగ మంత్రి జైశంకర్, చైనా విదేశాంగ కార్యదర్శి వాంగ్యూ సహా ఇరుదేశాలకు చెందిన 8 మంది అధికారులతో కలిసి మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారు. రెండు రోజుల్లోనూ సుమారు 7 గంటలపాటు జరిపిన ముఖాముఖిలో రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల పెంపునకు ఉన్నతస్థాయి యంత్రాంగం ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతోపాటు ప్రతిపాదిత ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ)పై జరుగుతున్న చర్చల్లో భారత్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేందుకు, భద్రతలో సహకారం, సరిహద్దుల్లో శాంతికి మరిన్ని చర్యలు తీసుకునేందుకు చైనా హామీ ఇచ్చింది. మూడో భేటీకి చైనా రావాలన్న జిన్‌పింగ్ ఆహ్వానాన్ని ఈ సందర్భంగా మోదీ అంగీకరించారు.

**ఇద్దరు నేతలు ఏమన్నారంటే..**

‘వూహాన్ సమ్మేళనంతో ప్రారంభమైన రెండు దేశాల మధ్య సంబంధాల్లో ‘చెన్నై కనెక్ట్’తో కొత్త ఊపు వచ్చింది. చైనా అధ్యక్షుని రాకతో మహాబలిపురం గ్రేట్ వే ఆఫ్ ఫ్రెండ్‌షిప్‌గా చరిత్రపుటల్లో నిలిచిపోయింది’ అని మోదీ అన్నారు. ప్రధాని మోదీ, నేను మంచి స్నేహితులం. ఈ రెండు రోజుల్లో ఇద్దరం మనసువిప్పి మాట్లాడుకున్నాం’ అని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. తమిళనాడులో తాను పొందిన ఆతిథ్యాన్ని ఎన్నటికీ మరువజాలనని జిన్‌పింగ్ అన్నారు. డ్రాగన్, ఏనుగు నాట్యం కేవలం చైనా, భారత్‌ల విషయంలోనే సాధ్యమని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ‘రెండుదేశాల మధ్య విభేదాలు ద్వైపాక్షిక సహకారంపై ప్రభావం చూపజాలవు. ఏనుగు, డ్రాగన్ నాట్యం చేయడం భారత్, చైనాల విషయంలో మాత్రమే నప్పుతాయి. రెండు దేశాల కీలక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఏళ్లుగా నానుతున్న సమస్యలను విభేదాలను జాగ్రత్తగా పరిష్కరించుకోవాలి’ అని అన్నారు.

**ప్రస్తావనకు రాని కశ్మీర్**

భేటీ అనంతరం విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే మీడియాతో మాట్లాడారు. ‘సరిహద్దుల్లో తరచూ తలెత్తే వివాదాలను పరిష్కరించుకునేందుకు, శాంతిని నెలకొల్పేందుకు పరస్పరం విశ్వాసం పాదుకొల్పే మరిన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వాణిజ్యంలో సమతూకం సాధించేందుకు, వాణిజ్య, వ్యాపార సంబంధాలను విస్తృతం చేసుకునేందుకు ప్రత్యేకంగా ఉన్నత స్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, తయారీ రంగం భాగస్వామ్యం, పెట్టుబడుల పెంపుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ చర్చలకు చైనా ఉప ప్రధాని హు చిన్హువా, భారత్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వం వహిస్తారని తెలిపారు’ అని ఆయన తెలిపారు. ఇద్దరు నేతల మధ్య కశ్మీర్ అంశం చర్చకు రాలేదని, ఆ ప్రస్తావనే లేదని తెలిపారు. భారత్, చైనా దౌత్య సంబంధాలకు వచ్చే ఏడాది 70 ఏళ్లు నిండుతున్న సందర్భంగా రెండు దేశాల మధ్య సాంస్కృతిక, ప్రజా సంబంధాలను మరింత విస్తృతం చేసుకునేందుకు జిన్‌పింగ్ అంగీకరించారని చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. ఇలా ఉండగా, జిన్‌పింగ్ పర్యటనను పురస్కరించుకుని చైనా పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఐదేళ్ల ఈ వీసా సౌకర్యం కల్పిస్తున్నట్లు బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మధ్యాహ్నం 12.55 గంటలకు జిన్‌పింగ్ కోవలం బీచ్ హోటల్ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో నేపాల్ వెళ్లిపోయారు.

## బీచ్‌లో మోదీ ప్లాగింగ్

**చెత్తా చెదారాన్ని ఎత్తివేసి ప్రజల్లో స్ఫూర్తిని నింపిన ప్రధాని**

మహాబలిపురం సముద్ర తీరంలో మోదీ అరగంట సేపు స్వచ్ఛభారత్ నిర్వహించారు. అక్కడ పరిసరాలు చెత్తా చెదారంతో నిండిపోవడంతో ఆయన వాటన్నింటిని ఎత్తేశారు. స్వచ్ఛభారత్ అభియాన్, ఫిట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తిని ఏకకాలంలో ప్రజల్లో రగిల్చేలా చేశారు. నల్లని రంగు కుర్తా, పైజామా ధరించిన ప్రధాని మోదీ ఒక పెద్ద ప్లాస్టిక్ బ్యాగ్‌ని పట్టుకొని ఇసుక తిన్నెల్లో నడుస్తూ తాగి పారేసిన ప్లాస్టిక్ బాటిల్స్, క్యారీ బ్యాగ్స్ , స్ట్రాలు ఇతర చెత్తలన్నీ ఏరారు. ఇలా చేయడం వల్ల వంటికి వ్యాయామానికి వ్యాయామం జరుగుతుంది. పరిసరాలు శుభ్రానికి శుభ్రం అవుతాయి. దీనికి సంబంధించిన మూడు నిమిషాల వీడియోను ప్రధాని తన ట్విట్టర్ అకౌంట్‌లో పోస్టు చేశారు. ‘‘మహాబలిపురం తీరంలో ప్లాగింగ్ చేశాను. దాదాపుగా 30 నిమిషాల సేపు చెత్తలన్నీ ఏరి దానిని హోటల్ యజమాని జయరాజ్‌కు అందజేశాను. ప్రజలందరూ బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అదే సమయంలో ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండాలి’’అని ప్రధాని ట్వీట్ చేశారు. అంతకు ముందు సముద్రం నీళ్లలో తడుస్తూ, అక్కడి సూర్యోదయం అందాలను వీక్షిస్తూ ప్రధాని చాలా సేపు బీచ్‌లో గడిపి సేద తీరారు. రోడ్లపై జాగింగ్ చేస్తూ చెత్తా చెదారాన్ని ఎత్తేపారేసే ప్రక్రియని ప్లాగింగ్ అని పిలుస్తారు.


బీచ్‌లో చెత్తను తీసి బ్యాగ్‌లో వేస్తూ..


మామల్లపురం బీచ్‌లో సేదతీరుతున్న మోదీ

## జిన్‌పింగ్ ముఖచిత్రంతో చేనేత పట్టు శాలువా

**చైనా అధినేతకు మోదీ అపూర్వ కానుక**

భారత్‌కు రెండు రోజుల పర్యటన కోసం వచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపురూపమైన కానుకని బహూకరించారు. చేతితో తయారు చేసిన ఎర్ర రంగులో ఉన్న ఈ శాలువాపై జిన్‌పింగ్ ముఖ చిత్రాన్ని డిజైన్‌గా వేయించారు. బంగారు రంగు అంచుల జరీతో మెరిసిపోతున్న ఈ శాలువా ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉంది. తమిళనాడులో కోయంబత్తూరు జిల్లాలోని సిరుముగైపుడూర్‌కి చెందిన శ్రీ రామలింగ సౌదాంబిగై చేనేత సహకార సంఘం మల్బరీ పట్టుతో ఎర్ర శాలువాని తయారు చేసింది. ఎరుపు రంగు ఎంచుకోవడానికి ఓ కారణం ఉంది. చైనా జాతీయ జెండా రంగు, అధికార పార్టీ జెండా రంగు ఎరుపే. అంతేకాదు చైనా సంస్కృతిలో ఎరుపు రంగుని శుభసూచికంగా పరిగణిస్తారు. ఈ రంగుతో అదృష్టం కలిసివస్తుందని, జీవితం ఆనందోత్సాహాల్లో నిండిపోతుందని వారి నమ్మకం. ఈ శాలువాపై జిన్‌పింగ్ ముఖ చిత్రాన్ని డిజైన్‌గా వేయడానికి ఎలక్ట్రానిక్ ఫ్యాబ్రిక్‌ని వినియోగించారు. ఆ తర్వాత దానిపై బంగారు రంగు దారాలతో అల్లారు. చేతి వృత్తుల పరిశ్రమ, చేనేత కళలకు తమిళనాడు పెట్టింది పేరు. దశాబ్దాలుగా ఎందరో చేనేత కార్మికులు చేతితో తయారు చేసే వస్త్రాలతో అద్భుతాలు సృష్టించారు. కంచి, ఆరణి, మదురై, కోయంబత్తూరు వంటివి పట్టు వస్త్రాల ప్రపంచంలో తమకంటూ ఒక గుర్తింపుని సాధించాయి.


తన ఫొటో ఉన్న జ్ఞాపికను జిన్‌పింగ్ నుంచి స్వీకరిస్తున్న మోదీ

### క్లుప్తంగా...

#### కేరళ నన్‌కు సెయింట్‌హుడ్ నేడే



**కొచ్చి:** కేరళకు చెందిన క్రైస్తవ సన్యాసిని (నన్) మరియం థ్రెసియా చిరమెల్ మంకిడియాన్‌కు క్రైస్తవ మతాధినేత పోప్ ఫ్రాన్సిస్ ‘పునీత హోదా’ (సెయింట్‌హుడ్)ను ప్రదానం చేయనున్నారు. వాటికన్‌లోని సెయింట్ పీటర్ ప్రధాన ప్రార్థనాస్థలిలో ఆమెతో పాటు ఇంగ్లండ్‌కు చెందిన కార్డినల్ జాన్ హెన్రీ, స్విట్జర్లాండ్‌కు చెందిన మహిళ మార్గరెట్ బేస్‌కు, బ్రెజిల్‌కు చెందిన సిస్టర్ డూస్లెకు, ఇటలీకి చెందిన సిస్టర్ గిసెప్పినాలకు పునీత హోదా ప్రకటించనున్నారు. 2000వ సంవత్సరంలో పోప్ సెయింట్ జాన్‌పాల్2, మరియం థ్రెసియాకు ‘బ్లెస్డ్’ హోదాను ప్రకటించారు.

#### మోదీ అన్న కుమార్తె పర్స్ చోరీ

**న్యూఢిల్లీ:** బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు ఏకంగా ప్రధాని మోదీ అన్న కూతురి పర్స్‌ను దోచుకెళ్లిన ఘటన ఢిల్లీలో జరిగింది. లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ల నివాసాలకు కొద్ది కిలోమీటర్ల దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. మోదీ అన్న కుమార్తె దమయంతి బెన్ మోదీ అమృత్‌సర్ నుంచి ఢిల్లీ చేరుకొని, నగరంలోని సివిల్ లైన్స్ వద్దకు ఆటోలో చేరుకున్నారు. ఆటో నుంచి దిగగానే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె పర్స్‌ను లాక్కెల్లారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదుచేశారు. పర్స్‌లో రూ. 56,000ల నగదు, రెండు ఫోన్లు, కొన్ని కీలక పత్రాలు ఉన్నట్లు వెల్లడించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఉత్తర ఢిల్లీ డీసీపీ మోనికా భరద్వాజ్ తెలిపారు.

## ఆర్‌టీఐ లేకుండానే సమాచారం

• అందుకు కొత్త వ్యవస్థకు సన్నాహాలు
• సమాచార హక్కు చట్టాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలి
• ప్రజలకు అమిత్ షా హితవు

**సాక్షి, న్యూఢిల్లీ:** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వచ్చే దరఖాస్తులను తగ్గించడానికి ప్రభుత్వం ఇకపై క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్నంతటినీ ప్రజలకు అందుబాటులో ఉంచేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆర్టీఐ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఢిల్లీలో జరిగిన అన్ని రాష్ట్రాల చీఫ్ కమిషనర్లు, కమిషనర్ల సదస్సులో అమిత్ షా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడితే అది ప్రభుత్వ విజయానికి సంకేతం కాదని అన్నారు. ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా ఉన్నప్పుడే ఆర్‌టీఐ కింద వచ్చే దరఖాస్తుల సంఖ్య తగ్గుతుందని షా అన్నారు. ఆర్‌టీఐ దరఖాస్తు అవసరం లేకుండా ప్రజలు ఎలాంటి సమాచారాన్నయినా క్షణాల్లో తెలుసుకునేలా ఒక వ్యవస్థని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టుగా షా వెల్లడించారు. ప్రజలకి తమ హక్కులతో పాటుగా బాధ్యతలు కూడా తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నా చితకా కారణాలకి, అవసరం లేకపోయినా ఆర్‌టీఐని ప్రయోగిస్తూ దానిని దుర్వినియోగం చేయవద్దని అమిత్ షా ప్రజలకి హితవు పలికారు. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత కోసం, ఎవరికైనా వ్యక్తిగతంగా అన్యాయం జరిగితే అప్పుడే ఆర్‌టీఐని వినియోగించాలని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ఒక హక్కులా చూడకుండా, దానిని వినియోగించడంలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అమిత్ షా కోరారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఎం. రవి కుమార్, కమిషనర్లు బివి. రమణకుమార్, ఇలాపురం రాజా పాల్గొన్నారు.


రాష్ట్రాల చీఫ్ కమిషనర్లు, కమిషనర్ల సదస్సులో మాట్లాడుతున్న అమిత్ షా

## కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లపై ఐటీ దాడులు

**తమిళనాడులో రూ. 30 కోట్లు సీజ్**

**న్యూఢిల్లీ:** తమిళనాడులోని ఓ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఐటీ శాఖ రూ. 30 కోట్లు స్వాధీనం చేసుకుంది. నీట్‌లాంటి ప్రవేశ పరీక్షలకు ఈ ఇన్‌స్టిట్యూట్ శిక్షణ ఇస్తోందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) శనివారం వెల్లడించింది. నమక్కల్ కేంద్రంగా ఉన్న ఈ గ్రూపుకి సంబంధించిన 17 ప్రాంగణాలలో శుక్రవారం ఏకకాలంలో దాడులు జరిపామని, ప్రాథమిక అంచనాల ప్రకారం, ఆ గ్రూప్ ఆదాయం రూ. 150 కోట్ల రూపాయలకు పైగా ఉందని తెలిపింది. ఈ బృందం ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకోసం విద్యాసంస్థలు, కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లను నడుపుతోంది. ఈ ట్రస్ట్ నియంత్రణలో అనేక భాగస్వామ్య సంస్థలు, వ్యక్తులు ఉన్నారని తెలిపింది. సీబీడీటీ ఆదాయపన్ను శాఖ కోసం వివిధ విధానాలను రూపొందిస్తుంది. శుక్రవారం నమక్కల్, పెరుండురై, కరూర్, చెన్నైలోని గ్రూప్ ప్రమోటర్ల ఇళ్లు, ప్రాంగణాలపై దాడులు జరిగాయి. ఫీజు రశీదులను విడివిడిగా రూపొందించడం ద్వారా సంస్థ గణనీయంగా పన్ను ఎగవేతలకు పాల్పడుతోందని వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు ఐటీ దాడులు చేశామని సీబీడీటీ వెల్లడించింది. ఫీజులో కొంత భాగాన్ని నగదు రూపంలో స్వీకరించడం, రశీదులను సైతం సాధారణ ఖాతాల పుస్తకాలలో నమోదు చేయకపోవడం లాంటి పనులకు సంస్థ పాల్పడిందని వెల్లడించింది. సోదాల సమయంలో డైరీలు, ఎలక్ట్రానిక్ స్టోరేజ్ పరికరాల్లో లెక్కలేనన్ని ఫీజు రశీదులను గుర్తించినట్లు తెలిపింది. బినామీ ఉద్యోగుల పేర్లతో లాకర్లు తెరిచారని, ప్రధాన బ్రాంచ్‌లోని లాకర్‌లో భారీ ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నామని బోర్డు తెలిపింది. ఉద్యోగులకు ఆదాయపన్నుకు అందకుండా నగదు రూపంలో జీతాలు చెల్లిస్తున్నారని తెలిపింది.



## రూ.10కి భోజనం.. రూ.1కే వైద్యపరీక్షలు

**శివసేన మేనిఫెస్టో విడుదల**

**సాక్షి ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో శివసేన పార్టీ తమ మేనిఫెస్టోను విడుదల చేసింది. ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే శనివారం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నట్టే రూ. 10కే భోజనం అందించనున్నట్టు పేర్కొన్నారు. ఒకే వంటశాలలో తయారుచేసిన భోజనాన్ని చుట్టుపక్కల ప్రాంతాలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాల మహిళలను కూడా ఇందులో చేర్చుకోనున్నట్టు తెలిపారు. మరోవైపు ఇళ్లలో వినియోగించే విద్యుత్ చార్జీలలో 300 యూనిట్ల వరకు వచ్చే బిల్లులపై 30 శాతం రాయితీ కల్పించనున్నట్టు ప్రకటించారు.

**ఆరోగ్యం..విద్య..**

ప్రజలకు అందుబాటులో లేని 200 రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కేవలం ఒక్క రూపాయికే అందించనున్నట్లు తెలిపారు. పేద రైతులకు ప్రతి సంవత్సరం రూ.10వేలు నేరుగా అకౌంట్లో జమ చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 15 లక్షల పట్టభద్రులైన యువకులకు ‘యువ ప్రభుత్వం ఫెలో’ ద్వారా స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. ఉపాధి కల్పించే శిక్షణ సంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల నుంచి పాఠశాల వరకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. విద్యార్థులందరికి మానసిక, శారీరక పరీక్షలు నిర్వహించనున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిని భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు వంటి విషయాలు మేనిఫెస్టోలో ఉన్నాయి. ముంబైలోని ఆరే కాలనీలో చెట్ల నరికివేత గురించి మేనిఫెస్టోలో లేదు.


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఉద్ధవ్, ఆదిత్య

### సన్నీ డియోల్, కరిష్మాలు నిర్దోషులు

**22 ఏళ్ల నాటి కేసులో రాజస్తాన్ కోర్టు తీర్పు**

**జైపూర్:** 22 ఏళ్ల క్రితం నాటి ఓ కేసులో ఎంపీ, బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్, నటి కరిష్మా కపూర్‌లు నిర్దోషులుగా బయటపడ్డారు. 1997లో రైలు చైన్ లాగిన కేసులో వారిని రాజస్తాన్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించిందని వారి తరపు న్యాయవాది ఏకే జైన్ శనివారం వెల్లడించారు. రైలు చైన్‌ను అక్రమంగా లాగి రైలు ఆలస్యానికి కారణమయ్యారన్నది వారిపై ఉన్న అభియోగం. 2009లో ఈ కేసులో రైల్వే కోర్టు వీరిని దోషులుగా ప్రకటించగా వీరు సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో సన్నీ, కరిష్మాలతోపాటు స్టంట్‌మ్యాన్ టీనూ వర్మ, సతీష్ షాలు కూడా నిందితులుగా ఉన్నారు.

### మసీదులో కాల్పులు..

**బుర్కినా ఫాసోలో 16 మంది మృతి**

**ఓవాగడౌగౌ:** ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో కాల్పుల కలకలం చెలరేగింది. ఓవాగడౌగౌ నగరంలోని మసీదులో జరిగిన ఈ దాడిలో 16 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఆయుధాలు ధరించిన కొందరు ఉగ్రవాదులు శుక్రవారం సాయంత్రం మసీదులో ప్రవేశించి కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఫ్రెంచ్, అమెరికన్, కెనడియన్, జర్మన్ బలగాలు తమ ప్రాంతంలో ప్రవేశించి ఉగ్రవాదులతో పోరాడుతున్నామని చెబుతున్నాయని, అయితే విదేశీయులు తమ దేశంలో ఉండటం ఇష్టం లేని ఉగ్రమూకలు ఈ దాడులకు తెగబడుతున్నాయని ఓ స్థానికుడు తెలిపారు.

## మాజీ ఉప ముఖ్యమంత్రి పీఏ ఆత్మహత్య

**సాక్షి బెంగళూరు:** ఐటీ దాడుల నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి పరమేశ్వర్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) రమేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఐటీ శాఖ అధికారులు గత మూడు రోజులుగా పరమేశ్వర్ ఇళ్లు, కార్యాలయాలు, విద్యాసంస్థలపై సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పరమేశ్వర్ సన్నిహితుడు, పీఏ రమేశ్ ఇంటిలో కూడా సోదాలు చేపట్టారు. ఈ సోదాల నేపథ్యంలో ఆయన శనివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. బెంగళూరులోని జ్ఞాన భారతి విశ్వవిద్యాలయం ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. అంతకుముందు తన ఇద్దరు స్నేహితులకు రమేశ్ ఫోన్ చేసి ‘నేను పేదవాడిని, నాపై ఐటీ శాఖ అధికారులు సోదాలు చేపట్టింది. ఎంతో నిజాయితీగా బతికాను. ఐటీ అధికారుల విచారణను ఎదుర్కొనే శక్తి నాకు లేదు. వారి ప్రశ్నలను ఎదుర్కోలేను’ అని చెప్పినట్లు తెలిసింది.


జపాన్‌లో శనివారం భారీ తుపాను సృష్టించిన బీభత్సానికి సజీవ సాక్ష్యమీ దృశ్యం. ఈ తుపాను కారణంగా దేశవ్యాప్తంగా పలుచోట్ల ఇళ్లు కూలిపోగా పలువురు నిరాశ్రయులయ్యారు.

# హరియాణా దారెటు?


ఖట్టర్


కుమారి సెల్జా

హరియాణాలో రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ అగ్రనాయకులంతా హరియాణాలో మకాం వేస్తున్నారు. దీంతో హోరాహోరీ నెలకొంది. రాష్ట్రంలో 2009 వరకు కాంగ్రెస్ హవా కొనసాగినా 2014 తొలిసారి బీజేపీ పాగా వేసింది. గత మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పదికి పది స్థానాల్లోనూ విజయఢంకా మోగించిన కమలం ఇప్పుడు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం తమదేనని ధీమాతో ఉంది. మరోవైపు కాంగ్రెస్‌లో అంతర్గ కుమ్ములాటలు కూడా బీజేపీకి మరింత బలాన్నిస్తున్నాయి. అయితే కుమారి సెల్జా నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ కూడా ఎలాగైనా పగ్గాలు చేజిక్కించుకోవాలని కసరత్తు చేస్తోంది. ప్రధాన పోటీ బీజేపీ కాంగ్రెస్‌ల మధ్యే ఉండనుంది.




### ‘కశ్మీర్’ పనిచేస్తుందా?

బీజేపీకి తీవ్రమైన వ్యతిరేకత ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే బీజేపీ ప్రజాప్రదర్శన లాంటి పలు కార్యక్రమాలు చేపట్టింది. అస్సాంలో మాదిరిగా హరియాణాలో అక్రమ వలసల నివారణకు ప్రభుత్వం యత్నిస్తోంది. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో బీజేపీ ఎదుర్కోనున్న ప్రధాన సవాల్ నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్నార్సీ) నుంచే. అయితే మోదీ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలైన కశ్మీర్ స్వయంప్రతిపత్తి రద్దు, ముస్లిం మైనారిటీ మహిళల హక్కులను కాపాడే ట్రిపుల్ తలాక్ రద్దు చట్టం ఈ ఎన్నికలను ప్రభావితం చేసే అంశాలన్నది నిపుణుల అంచనా.

### జాట్ ఉద్యమం...

హరియాణాలో 18 ఏళ్ళ తరువాత జాట్‌యేతరుడైన ఖట్టర్ సీఎం అయ్యారు. అయినా జాట్‌ల ఉద్యమాన్ని సరిగ్గా డీల్ చేయలేకపోయారన్న విమర్శలున్నాయి. అయితే ఈసారి ఎలాగైనా అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ శాయశక్తులా కృషి చేస్తోంది. ఎన్నికలు అత్యంత సమీపంలో ఉన్న వేళ బీజేపీలో అసంతృప్తి జ్వాలలు అలుముకున్నాయి. మోదీతో సహా బీజేపీ అగ్రనేతలంతా ప్రచారానికి దిగుతున్నారు. దీంతో అంతర్గత కుమ్ములాటలు చల్లారే అవకాశం ఉంది.

### కాంగ్రెస్‌లో లుకలుకలు

రాష్ట్రంలో పునర్వైభవాన్ని తీసుకొచ్చే మాట అటుంచి, అసలు పార్టీలో అంతర్గత కుమ్ములాటలకు అంతేలేదు. స్వయంగా రాహుల్ గాంధీయే ఏరికోరి పీసీసీ అధ్యక్షుడిని చేసిన దళిత నేత అశోక్ తన్వర్‌ని తీవ్రంగా వ్యతిరేకించిన మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ పై ఈ వర్గాలు తాడోపేడో అన్నట్టున్నాయి. అంతేకాదు. ఏకంగా ఢిల్లీలో సోనియా నివాసం ముందు ధర్నాకి కూడా దిగారు. దీంతో విసిగిపోయిన శ్రేణులు బీజేపీలో చేరిపోయారు. రేపటి నుంచి రాహుల్ ప్రచారం ప్రారంభమౌతున్నా కాంగ్రెస్‌ని నిరాశాభావం వెంటాడుతోంది.

### భూపేందర్ స్థానమెక్కడ?

హరియాణాలో 27 శాతం జాట్ సామాజికవర్గాలే ఉన్నాయి. గతంలో ఐదుగురు ముఖ్యమంత్రులు ఇదే సామాజికవర్గం నుంచి ఉన్నారు. స్వయంగా భూపేందర్ సింగ్ హుడా, అతని కుమారుడు దీపేందర్ సింగ్ హుడా సోనాపేట్, రోహతక్‌ల నుంచి 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. జాట్ సామాజిక వర్గం ఆధిపత్యంలోని ఈ ప్రాంతం ఒకప్పుడు భూపేందర్‌కి బలమైన ప్రాంతం. ఈసారి సైతం కష్టతరమేనని నిపుణులు అభిప్రాయం.



## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి పౌర్ణమి రా.1.51 వరకు, తదుపరి బ.పాడ్యమి
నక్షత్రం ఉత్తరాభాద్ర ఉ.8.04 వరకు తదుపరి రేవతి, వర్జ్యం రా.9.14 నుంచి 11.01 వరకు, దుర్ముహూర్తం సా.4.01 నుంచి 4.51 వరకు
అమృతఘడియలు... లేవు.

**సూర్యోదయం** : 5.55
**సూర్యాస్తమయం** : 5.38
**రాహుకాలం** : సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం** : ప.12.00 నుంచి 1.30 వరకు

జిన్‌పింగ్ (చైనా అధ్యక్షుడు)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కామ్రేడ్ నరేంద్ర మోదీలో చూడచక్కనిది ఏదైనా ఉందీ అంటే అది ఆయన నాటకీయత మాత్రమే. గత ఏడాది మేము మధ్య చైనా ప్రాంతంలోని ఆలయ పట్టణం ఉహాన్‌లో కలుసుకున్నప్పుడు ఆయనలో ఇంత నాటకీయత కనిపించలేదు! ఇండియా తన సొంత దేశం కనుక ఇప్పుడు మామల్లపురంలో నాటకీయతను అభినయించడానికి ఆయనకు ఎక్కువ స్కోప్ దొరికినట్లుంది.

బీజింగ్ నుంచి చెన్నై బయల్దేరే ముందు నా పక్కనే నడుస్తూ ఉన్న చైనా ఉప విదేశాంగ మంత్రి ల్యూజావోహ్యూ నవ్వుతూ నాతో అన్న ఒక మాట చెన్నైలో ఫ్లయిట్ దిగగానే ఒకసారి, చెన్నైలో నేను బస చేయబోతున్న గ్రాండ్ చోళా హోటల్ ముఖద్వారానికి సమీపిస్తున్నప్పుడు మరొకసారి నాకు గుర్తొచ్చింది. 'ఇండియా మోదీ సొంత దేశమే కానీ, ఇండియాలోని తమిళనాడు మోదీ సొంత రాష్ట్రం కాదు మిస్టర్ ప్రెసిడెంట్' అని అన్నాడు ల్యూజావోహ్యూ. మోదీకి, నాకు మధ్య ఈ ఫ్రెండ్లీ మీటింగ్‌కి మామల్లపురాన్ని ఎంపిక చేసింది అతడే.

'మామల్లపురమే ఎందుకు ల్యూజావోహ్యూ?!' అని అడిగాను.

'ఢిల్లీలో మీటింగ్ పెట్టుకుంటే మనం మోదీ కంట్రోల్‌లో ఉండాలి మిస్టర్ ప్రెసిడెంట్. మామల్లపురంలో మీటింగ్ పెట్టుకుంటే మోదీ మన కంట్రోల్‌లో ఉంటారు. ఎందుకంటే మామల్లపురం ఉన్న తమిళనాడు మోదీ కంట్రోల్‌లో లేదు' అన్నాడు ల్యూజావోహ్యూ.

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే 'జిన్‌పింగ్ గో బ్యాక్' అంటూ ఆరుగురు టిబెటన్‌లు నేను ఊహించని విధంగా నా ముఖం మీదే పిడికిళ్లు బిగించారు! అప్పుడొకసారి, గ్రాండ్ చోళా దగ్గర ఐదుగురు మహిళా టిబెటన్‌లు



'జిన్‌పింగ్ గో బ్యాక్' అని నినాదాలు చేసినప్పుడొకసారి నాకు ల్యూజావోహ్యూ మాటలు గుర్తొచ్చాయి. నిజమే. ఇండియా మోదీ సొంత దేశం కావచ్చు. ఇండియాలోని తమిళనాడు ఆయన సొంత రాష్ట్రం కాదు.

"నా దాకా ఎలా వచ్చారట?" అని అడిగాను హోటల్‌లో దిగగానే.

"కనుక్కున్నాను మిస్టర్ ప్రెసిడెంట్. ఎయిర్‌పోర్ట్‌లో మిమ్మల్ని అడ్డుకున్నవాళ్లవి తమిళముఖాలు కావట. బెంగళూరు నుంచి వచ్చారట. తమిళనాడు సీఎం చెప్పారు" అన్నాడు!

"టిబెటన్‌లలో తమిళ్ ముఖాలు, నాన్-తమిళ్ ముఖాలు ఉంటాయా ల్యూజావోహ్యూ!" అన్నాను.

"గ్రాండ్ చోళా దగ్గర నినాదాలు చేసిన ఐదుగురు టిబెటన్‌లూ అందమైన యువతులు కాబట్టి, మిమ్మల్ని విష్ చెయ్యడానికి వచ్చారని పొరపడి వాళ్లను రానిచ్చారట" అని ఆ రెండో ఇన్సిడెంట్ గురించి కూడా చెప్పాడు ల్యూజావోహ్యూ.

తొలిరోజు సాయంత్రం మామల్లపురం సముద్రపు ఇసుకలో అక్కడక్కడే తనతో పాటు నన్నూ రెండు కిలోమీటర్లు నడిపించారు మోదీ. ఒక చోట ఒక పెద్దరాయిని చూపించి, "మిస్టర్ జిన్‌పింగ్.. ఈ పెద్ద బండరాయిని చూశారా! కొండపై ఏటవాలుగా, గాలి వీస్తే దొర్లిపోయేలా ఉంది కదా. కానీ శతాబ్దాలుగా దీన్నెవరూ కదల్చలేకపోయారు" అని చెప్పారు మోదీ. ఇండియా సార్వభౌమాధికారాన్ని కూడా ఇలాగే ఎవరూ కదల్చలేరని చెప్పడం ఆయన ఉద్దేశమని నాకు అర్థమైంది.

"ఇసుకలో నడవటం కష్టంగా ఉంది మిస్టర్ మోదీ. కాసేపు కూర్చుందాం" అన్నాను.

"ఊరికే కూర్చోవడం కాదు. తియ్యటి కొబ్బరి నీళ్లు తాగుతూ కూర్చుందాం" అని నాటకీయంగా ఒక పొడవాటి నవ్వు నవ్వి, రెండు గుండ్రటి కొబ్బరి బోండాలు తెప్పించారు మోదీ.

మచ్చలతో బలహీనంగా తెగులు కాయల్లా ఉన్న ఆ కొబ్బరి బోండాలను చూడగానే నాకు ఇంకో సంగతి కూడా అర్థమైంది. ల్యూజావోహ్యూ కరెక్ట్‌గానే చెప్పాడు. తమిళనాడు కామ్రేడ్ మోదీ కంట్రోల్‌లో లేదు!

# పల్లవ రాజు... పండిత నెహ్రూ

జనతంత్రం



వర్దెల్లి మురళి



ఆసియా ఖండంలోని ఇద్దరు శక్తిమంతమైన నాయకులు నరేంద్ర మోదీ, షీ జిన్ పింగ్‌ల 'వ్యూహాత్మక' సమావేశం ముగిసింది. సంయుక్త ప్రకటన వంటిది ఏమీ ఉండదని ముందుగానే చెప్పారు కనుక, ఏ అంశాల మీద వారిద్దరి మధ్యన చర్చలు జరిగి వుంటాయన్న దానిపై సహజంగానే ఆసక్తి వుంటుంది. ఆ ఆసక్తిని మించి, సగటు భారతీయుడి హృదయాన్ని రంజింపజేసే మరో ఆకర్షణీయ దృశ్యం ఈ సమావేశాల్లో ఆవిష్కృతమైంది. అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుత ప్రపంచంలో అత్యంత శక్తిమంతుడి కింద లెక్క. ఆ తర్వాతి స్థానం చైనా అధ్యక్షుడైన జిన్ పింగ్‌దే. ఆయన మనదేశం వచ్చారు. మన ప్రధానితో కలిసి సమావేశమయ్యారు. ఇద్దరూ కలిసి భారతీయ శిల్పకళా సొగసులను తిలకించారు. సంగీత నాట్యాలను ఆస్వాదించారు. ఆలయాల వెలుపల కలయదిరుగుతూ టీవీల ద్వారా ప్రజలకు కనువిందు చేశారు. ఒక రాజును గొప్పవాడిగా పరిగణించడానికి చాణక్యుడు నిర్దేశించిన ప్రమాణాల్లో పొరుగు రాజులకంటే బలంగా కనిపించడం కూడా ఒకటి. నిన్నటి సమావేశం సందర్భంగా నరేంద్ర మోదీ ఆహార్యం, ఆంగికవాచకం చాణక్యుడు నిర్దేశించిన ప్రమాణాలకు సరిపోతాయి. మామల్లపురంలో పల్లవుల కాలంనాటి ఏకశిలా రథాల ముందు తమిళ సంప్రదాయ వస్త్రధారణతో, ఎడమ భుజంపై వున్న ఉత్తరీయం వెనుక భాగాన్ని కుడి ముంజేతిపై వేసుకొని జిన్ పింగ్ ఎదుట రాజసంగా కనిపించిన విధానం దేశ ప్రజలను కచ్చితంగా ఆకర్షించి ఉంటుంది. మన సినిమాలు, నాటకాల్లో చక్రవర్తులు, రాజాధిరాజుల పాత్రలు ఈ భంగిమలోనే కనిపిస్తాయి. అంతర్జాతీయ వేదికలపై ఇతర దేశాల నాయకుల నడుమ మన నాయకుడు ప్రత్యేకంగా, కీలకంగా కనిపించాలని దేశ ప్రజలు బలంగా కోరుకుంటారు. ఎందుకంటే ఆ నాయకుడు ఆ వేదికపై మన దేశ సార్వభౌమాధికారానికి ప్రతీక. దక్షిణాసియా దేశాలు, అలీన దేశాలు వంటి పరిమిత స్థాయి వేదికలపై తప్ప, సంపన్న దేశాలు పాల్గొనే విస్తృత వేదికపై కొన్ని దశాబ్దాలుగా మన నాయకులు నిరాశపరుస్తూనే వున్నారు. ఇన్నాళ్లూ ఒకటి... ఇప్పుడొకటి అన్నట్టుగా నరేంద్ర మోదీ ఆ సంప్రదాయానికి చరమగీతం పాడారు. మూడు నెలల కిందటి ఆ గేమ్ చేంజర్ దృశ్యాన్ని బహుశా ఎప్పటికీ మరిచిపోలేమేమో. అసలే కోతి, ఆపై కల్లు తాగింది... అని సామెత చెప్పినట్టు అసలే ట్రంపు... ఆపై అమెరికా అధ్యక్షుడు. అతనితో వ్యవహారం అంటే మాటలా? ఉమ్మడి మీడియా సమావేశంలో ఆకతాయిగా వ్యవహరించబోయిన ట్రంప్ చేతిపై తన ఎడమ చేత్తో చరిచి చాల్లే బడాయని ఒక భారత నేత అదుపు చేయడం గతంలో ఊహలకు కూడా అందని దృశ్యం. ఈ దృశ్యం సగటు భారతీయుని హృదయాన్ని సమ్మోహితం చేసింది. అతని ఆత్మగౌరవాన్ని ఉత్తేజ పరిచింది.

అంతర్జాతీయ వ్యవహారాల్లో భారతదేశానికి సంబంధించినంత వరకు ఈ గాలి మార్పు ఎలా సాధ్యమైంది? మన కోటీశ్వరులు, అంతర్జాతీయ కోటీశ్వరులతో పోటీపడుతూ ఫోర్బ్స్ జాబితాల్లోకి క్రమం తప్పకుండా ఎక్కుతున్నందుకా? కాదు. మన ప్రభుత్వాలు అద్భుతాలు సృష్టించి ఆర్థికాభివృద్ధిని శరవేగంగా పరుగెత్తిస్తున్నందుకా?... కాదు. మన రక్షణ పాటవం అమాంతం పెరిగిపోయి, పొరుగుదేశాలు వణికిపోతున్నందుకా? కానేకాదు. ప్రపంచంలో ఇప్పుడు భారత్‌కు లభిస్తున్న గౌరవం ఆ దేశపు మధ్య తరగతి మందహాసం. వినిమయ వస్తువులను కొనుగోలు చేయగలిగిన మధ్య – ఉన్నత మధ్యతరగతి జనాభా దేశంలో 30 కోట్లు దాటింది. ఈ జనాభా నానాటికీ పెరుగుతున్నది. దాదాపు అమెరికా జనాభాతో సమానంగా భారత్‌లో ఒక కొనుగోలు మార్కెట్ తయారై వుంది. గనిలో, వనిలో, కార్ఖానాల్లో విరామ మెరుగక శ్రమించిన ముందుతరం త్యాగధనుల స్వేదంలోంచి కొత్త మధ్య తరగతి ఉద్భవించింది. పాడిపంటల్లో కాయకష్టం చేసిన లక్షలాది మంది తల్లుల కొంగుముడుల్లో దాగిన పొదుపులోంచి పుట్టుకొచ్చిన నయా మధ్యతరగతి ఉపాధివేటలో దేశదేశాలకు విస్తరించింది. విదేశాల్లో తమ అవసరాలను కుదించుకొని మాతృదేశానికి ఏటా లక్షల కోట్లు పంపిస్తూ ప్రవాస భారతీయులు భారతీయ వినిమయ మార్కెట్‌ను పటిష్టపరుస్తున్నారు. ఈ మార్కెట్ అంటే అమెరికాకు గౌరవమే, చైనాకూ గౌరవమే, వస్తువులు అమ్ముకునే ప్రతిదేశానికీ గౌరవమే. ఈ మార్కెట్‌ను పరిపాలిస్తున్న భారత ప్రభుత్వమంటే కూడా గౌరవమే ఉండితీరాలి. శరీరకష్టం పునాదిగా నిర్మితమైన భారత మధ్యతరగతి ఆత్మగౌరవ ఆకాంక్షలకు అనుగుణంగానే అంతర్జాతీయ వేదికలపై మన చాయ్‌వాలా ప్రధాని వ్యవహరిస్తున్నారని భావించవచ్చు.

ఇంతకూ మోదీ – జిన్ పింగ్ ఏ విషయాలపై సీరియస్‌గా చర్చించి వుంటారు? ఏ దేశానికైనా దీర్ఘకాలిక లక్ష్యాలు వేరు. తాత్కాలిక వ్యూహాలు వేరు. ఇందుకు భారత్, చైనాలు కూడా మినహాయింపు కాదు. అమెరికాను అధిగమించి అగ్రరాజ్యంగా ఎదగాలన్న కోరిక చైనాకు వున్నది. కోరిక వుండటమే కాదు.. అది నెరవేర్చుకునేందుకు చాలాకాలంగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకున్నది. అంతర్జాతీయ వర్తక వాణిజ్యాల్లో అమెరికాకు సవాల్ విసురుతున్నది. అందుకు ప్రతిగా చైనాను అదుపు చేసేందుకు భారత్ సహాయాన్ని అమెరికా ఆశిస్తున్నది. తాను ఏర్పాటు చేసే ఇండో–పసిఫిక్ కూటమిలో భారత్ భాగం కావాలన్నది అమెరికా కోరిక. ఇది వాస్తవరూపం దాలిస్తే ఈ ప్రాంతంలో చైనా దూకుడుకు కళ్లెం పడుతుంది. కానీ, అమెరికా చెప్పుచేతుల్లో వుండటానికి భారత్ కూడా అంగీకరించదు. ప్రపంచ శక్తిగా ఎదగాల్సిన అవసరం, అవకాశం భారత్‌కు కూడా వున్నాయి. ఈ ప్రాంతంలో అమెరికా పెత్తనమయినా, చైనా ఆధిపత్యమైనా, భారత్ సహించే అవకాశమే లేదు. కనీసం దక్షిణాసియా వరకైనా తన మాట చెల్లుబాటు కావాలన్న లక్ష్యం భారత్‌కు వుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి చైనా–పాక్ ఎకనామిక్ కారిడార్‌ను చైనా ఏర్పాటు చేసింది. ఇది భారత ప్రయోజనాలకు వ్యతిరేకం. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారత్ దూకుడుగా వ్యవహరించడం చైనాకు సమ్మతం కాదు. రెండు దేశాల మధ్యన 3,800 కిలోమీటర్ల పొడవున వున్న సరిహద్దుపై పేచీలు కూడా ఇప్పుడప్పుడే పరిష్కారమయ్యే సమస్యకాదు. భారత్–చైనాల మధ్య వర్తకం ఏటా రూ. ఏడు లక్షల కోట్లకు చేరుకున్నది. ఇందులో భారత్ నష్టపోతున్నది. చైనా ఎగుమతులు ఐదు లక్షల కోట్లకిమ్మత్తు చేస్తుంటే భారత్ ఎగుమతులు (హాంకాంగ్‌తో సహా) రెండు లక్షల కోట్లు దాటడం లేదు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించుకోవాలని భారత్ కోరుకుంటున్నది. ఇందుకోసం భారత్ ఎగుమతులకు చైనాలో మరిన్ని అవకాశాలివ్వాలని అడుగుతున్నది. భారత్‌లో భారీ పెట్టుబడులు పెట్టే అవకాశం లభించాలని చైనా కోరుకుంటున్నది. బహుశా ఈ రెండు అంశాల మీద కొంత పురోగతి వుండే అవకాశం వుంటుంది.

భారత్–చైనాల దీర్ఘకాలిక లక్ష్యాలు రెండు దేశాల మధ్య సంపూర్ణ స్నేహ సంబంధాలకు అవకాశం ఇవ్వకపోవచ్చు. ఆర్థిక అవసరాల దృష్ట్యా తాత్కాలికంగా కొన్ని విషయాలపై రాజీ పడవచ్చు. మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ టెర్రరిస్టుగా ప్రకటించాలన్న భారత్ డిమాండ్‌కు అడ్డు తగులుతున్న చైనా దాన్నుంచి పక్కకు తప్పుకోవడం ఈ తాత్కాలిక వ్యూహంలో భాగంగానే చూడాలి. ఈ శతాబ్దాన్ని ఆసియా శతాబ్దంగా పరిగణిస్తున్నారు. కనుక ఆసియాలో ఎవరు సూపర్ పవర్ అవుతారో వారే సూపర్ గ్లోబల్ పవర్ కావచ్చు. అవకాశం రెండు దేశాలకూ వున్నది. అందువల్ల ఒకరికి ఒకరు సంపూర్ణంగా సహకరించుకొని మానవాళికి ఆదర్శంగా మిగిలిపోతారని భ్రమించడం అవివేకమే అవుతుంది. 1962లో జరిగిన భారత్–చైనా యుద్ధానికి సంబంధించి ఇటీవల సీఐఏ కొన్ని పత్రాలను బయట పెట్టింది. వాటి ఆధారంగా అప్పటి చైనా ప్రధాని చౌ ఎన్ లై పండిట్ నెహ్రూను నమ్మించి గొంతుకోశాడని అది అభిప్రాయ పడింది. సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా ఆఫ్రో– ఆసియా దేశాలు సంఘటితంగా పని చేయాలని నెహ్రూ భావించాడు. ఈ ప్రయాణంలో చైనాను నమ్మకమైన మిత్రదేశంగా భావించాడు. స్వాప్నికుడు, ఆదర్శవాది అయిన నెహ్రూ 'హిందీ–చీనీ భాయి భాయి' అంటూ పులకించిపోయేవాడు. భారత్‌తో చైనా స్నేహం నటిస్తూనే యుద్ధ సన్నాహాలు పూర్తి చేసింది. యుద్ధానికి దారి తీయవలసినంత తీవ్రమైన పరిస్థితులు అప్పుడు లేవు. కానీ చైనా అంతరంగం మరొక విధంగా వున్నది. భారత్‌ను బలహీన దేశంగా ప్రపంచం ముందు చిత్రించడం ద్వారా మాత్రమే చైనా ప్రయోజనాలు నెరవేరగలవని ఆలోచించింది. ఈ విషయంపై యుద్ధం తర్వాత చైనా అధ్యక్షుడు లీ షావో చీ స్వీడన్ రాయబారితో మాట్లాడుతూ భారత్‌కు గుణపాఠం నేర్పడానికే యుద్ధం చేశామని స్వయంగా చెప్పినట్టు ఈ పత్రాల్లో వెల్లడైంది. ఊహించని యుద్ధం కారణంగా భారత్ దారుణ పరాభవంపాలు కావలసివచ్చింది. నెహ్రూకు నమ్మకద్రోహం చేసిన చౌ ఎన్ లై కూడా మామల్లపురానికి 1956 డిసెంబర్‌లో వచ్చారు. ఆ తర్వాత కొంతకాలానికే చైనా భారత్‌పై దాడి చేసింది. ఇప్పుడు చైనా ప్రభుత్వం కూడా జిన్‌పింగ్ పర్యటనకు మామల్లపురాన్ని స్వయంగా ఎంపిక చేసినట్టు సమాచారం.

ఈ మహాబలిపురానికి చైనాకు రెండువేల ఏళ్లుగా సంబంధాలున్నాయి. పల్లవ రాకుమారుడొకరు ధర్మప్రబోధి అనే పేరుతో చైనాకు వెళ్లి అక్కడ షావోలిన్ మొనాస్టరీని స్థాపించి ధ్యాన బౌద్ధాన్ని బోధించాడు. మార్షల్ ఆర్ట్స్‌ను కూడా చైనీయులకు ధర్మప్రబోధుడే పరిచయం చేశాడని చెబుతారు. పల్లవరాజ్యం నుంచి చైనా దేశానికి భారీగా ఎగుమతులు జరిగేవని చెప్పడానికి సాక్ష్యంగా మామల్లపురం రేవులో విస్తృతంగా ఆ కాలం నాటి చైనా నాణేలు దొరికాయి. మొదటి నరసింహవర్మ కాలంలో పల్లవరాజ్యం ఉచ్ఛదశను చూసింది. ఆ కాలంలోనే చైనాతో వర్తక వ్యాపారాలు వర్ధిల్లాయి. ఎగుమతులదే పైచేయిగా వుండేది. చౌ ఎన్ లై వచ్చివెళ్లిన 63 ఏళ్ల తర్వాత మరో చైనా నేత షీ జిన్ పింగ్ మామల్లపురం దర్శించి వెళ్లారు. ఇప్పుడేమవుతుంది? మరోసారి మోసపోవడానికి నెహ్రూలాగ స్వప్న లోకాల్లో విహరించే రకంకాదు నరేంద్ర మోదీ. చైనాకు ఎగుమతులను పెంచి, వర్తకంలో లాభాలు పిండి నయా పల్లవ రాజు నరసింహవర్మ అవుతాడేమో చూడాలి.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### హిందూ



"నేను హిందువును. నన్ను–గోధ్రాలో తగులబెడతారు, బెంగాల్‌లో చంపేస్తారు, ఢిల్లీలో మూకదాడికి పాల్పడతారు, ఉత్తరప్రదేశ్‌లో రాళ్లతో కొడతారు, కశ్మీర్‌లో అత్యాచారం చేస్తారు. అయినప్పటికీ మైనారిటీలను చులకన చేస్తున్నానని నన్ను తప్పుబడతారు. దేశంలోని లౌకికవాదుల దృష్టిలో ముస్లింల మరణాలన్నీ హిందువుల మూకదాడులతోనే జరిగినట్టు, హిందూ మరణాలు మాత్రం కుటుంబ కలహాలతో జరిగినట్టు. సెక్యులర్లంతా సిగ్గుపడాలి. హిందువులను కాపాడండి"

– వినితా రాజ్‌పుట్, టీచర్

### చరిత్ర



"కాశీలోని విశ్వనాథ జ్యోతిర్లింగ క్షేత్రంపై 1664లో దాడికి యత్నించిన ఔరంగజేబు, అతని మొఘల్ సేనలను నాగసాధువులు ఘోరంగా ఓడించారని మీకు తెలుసా? పాఠశాలల్లోని చరిత్ర పుస్తకాలు మనకు ఈ విషయాలు బోధించవు. దీన్ని వీలైనంతమందికి షేర్ చేయండి. దాంతో ఔరంగజేబును కీర్తించే వాళ్లకు చేరుతుంది"

– మానుషీ సిన్హా, రచయిత

### నాన్ వెజ్



"సిద్ధరామయ్య నాన్‌వెజ్ తిన్న తరువాత దేవాలయాలను సందర్శించినందుకు అవాకులుచెవాకులు వాగిన వాళ్లంతా, వాళ్ల మహానేత ఒక ఆలయంలో నాన్‌వెజ్ ఆహారంతో ఆతిథ్యం ఇస్తుంటే మాత్రం నోళ్లు మెదపటం లేదు. హిపోక్రసీకి పర్యాయపదం బీజేపీ"

– లావణ్య బళ్లాల్, కాంగ్రెస్ నేత

### జనం



"ముస్లిం తండ్రికీ, హిందూ తల్లికీ జన్మించినందుకు విమర్శించి, వివక్ష చూపిన జనాలే, ఎంపీ నస్రత్ జహాన్ హిందూ సంప్రదాయాలను పాటించి సెక్యులర్‌గా ఉన్నందుకు అభినందనలు కురిపిస్తున్నారు"

– సానియా అహ్మద్, మేనేజర్

### లీడర్



"నిజమైన లీడర్ ఎప్పుడూ అందరికీ ఉదాహరణగా నిలుస్తాడు. నరేంద్ర మోదీకి హ్యాట్సాఫ్. పరిశుభ్రమైన భారత్ కోసం మనందరం కూడా చెత్తను ఏరివేయాల్సి ఉంది"

– వివేక్ ఆనంద్ ఒబెరాయ్, హీరో

### సిగ్గుచేటు



"ఇది చాలా సిగ్గుచేటు. ప్రధాని నరేంద్ర మోదీ బీచ్‌లో చెత్త ఏరుతుంటే కెమెరామన్ ఎందుకు సహాయం చేయలేదు? పోనీ విలేకరులైనా ఎందుకు సాయపడలేదు? పీఎంఓ అధికారులు, భద్రతా సిబ్బంది, కమాండోలు, పోలీసులు ఎవరూ బీచ్‌ను ఎందుకు శుభ్రం చేయలేదు? వాళ్లలో ఒక్కరైనా పరుగున వచ్చి సహాయం చేయలేదు. పర్యావరణం కాపాడటానికి ప్రయత్నించలేదు. సిగ్గుచేటు కాదూ?"

– రాకేష్ శర్మ, ఫిల్మ్ మేకర్

### అసహనం

అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి వచ్చాక అసహనం పెచ్చరిల్లుతోందని తరచు జరుగుతున్న ఘటనలు నిరూపిస్తున్నాయి. ఆ పరంపరలో ఇది మరొకటి. క్యూబా నుంచి వలసవచ్చి స్థిరపడిన కుటుంబంలో జన్మించిన రచయిత్రి జెనీ కాపో క్రూసెట్‌ను ఆమె రాసిన 'మై టైమ్ అమాంగ్ వైట్స్' గ్రంథంపై మాట్లాడమని జార్జియా సదరన్ యూనివర్సిటీ ఆహ్వానించింది. భిన్నత్వంపైనా, విద్యార్థినిగా తన అనుభవాలపైనా ఆమె మొదటి సంవత్సరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తమతో పోలిస్తే శ్వేతజాతి పిల్లలకు ప్రాధాన్యత లభించేదని చెప్పారు. ఇలా మాట్లాడటానికి మీకున్న అర్హతేమిటని శ్వేతజాతి విద్యార్థిని ఆగ్రహంతో ఆమెను ప్రశ్నించింది. దాంతో వాద ప్రతివాదాలు మొదలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పటంతో రచయిత్రి అక్కడినుంచి నిష్క్రమించారు. ఆ తర్వాత ఆ పుస్తకం ప్రతుల్ని కొందరు విద్యార్థులు తగలబెట్టారు. ఆ వీడియో దృశ్యాన్ని సామాజిక మాధ్యమాల్లో దాదాపు లక్షన్నరమంది చూశారట. ఇలాంటి పనులు మన సంస్థ నమ్ముతున్న విలువలకు పూర్తి విరుద్ధమని, ఇది దురదృష్టకరమని వర్సిటీ అధ్యక్షుడు కైల్ మరెరో వాపోయారు. విద్యార్థులు హేతుబద్ధమైన చర్చల్లో పాలు పంచుకుని ఉంటే సంతోషించేవాడినన్నారు. పిల్లలు ఆవేశపడినా యూనివర్సిటీ అధ్యక్షుడు జరిగిన దానికి నొచ్చుకోవడం అమెరికా గనుకే సాధ్యపడిందేమో!

**ఆదిమ సమాజం నుంచి నేటి అత్యాధునిక సమాజం వరకు ఒక 'విచ్ఛిన్న ప్రవాహం'లా సాగిన ప్రకృతి మానవీకరణ క్రమంలో వివిధ చారిత్రక దశల్లో ఏర్పడిన నిర్దిష్ట సామాజికార్థిక సంక్షోభాలకు సహజాతంగా పర్యావరణ సంక్షోభాలు కూడా ఉనికిలోకి వచ్చాయి. లాభార్జనే పరమావధిగా సాగే సరకుల ఉత్పత్తి విధానం, కార్పొరేట్ శక్తుల అత్యాశకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వ విధానాల స్థానంలో ప్రకృతికి సమాజానికి మధ్య లావాదేవీల సమతుల్యతను సాధించే ఉత్పత్తి విధానం ప్రపంచంలో ఉనికిలోకి వస్తే తప్ప పర్యావరణ సంక్షోభానికి ఒక హేతుబద్ధ పరిష్కారం దొరకదు. పర్యావరణ సంక్షోభంపై వివిధ అంతర్జాతీయ ఒప్పందాల్ని ఆర్థిక విధానంతో సంబంధం లేకుండా వాటికవిగా అమలు చేయడం సాధ్యం కాదు.**

# ఇ-వ్యర్థాలను అరికట్టలేమా?

సందర్భం



వెన్నెలకంటి రామారావు

ప్రపంచాన్ని తీవ్రంగా కలవరపెడుతున్న అంశాల్లో ఇ–వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమైన సమస్యగా అవతరించింది. స్మార్ట్ ఫోన్‌లు, టీవీలు, వాషింగ్ మెషీన్‌లు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి సవాలక్ష ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగం తర్వాత వ్యర్థాలుగా మారి పర్యావరణ, ప్రజారోగ్య విధ్వంసానికి పాల్పడుతున్నాయి. 2019లో 5 కోట్ల టన్నుల ఇ–వ్యర్థాలు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి కానున్నాయని అంచనా. ఆ వ్యర్థాల్లో సగభాగం ఆధునిక సంస్కృతికి అద్దం పడుతున్న, వ్యక్తిగతంగా వినియోగిస్తున్న కంప్యూటర్లు, స్క్రీన్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్లెట్స్, టీవీలు, మిగిలిన వాటిలో వేడి, చల్లబరచే వివిధ రకాల గృహోపకరణాలే. వీటి వినియోగం ద్వారా హానికర వ్యర్థాలు విడుదలవడమే కాకుండా, ఇ–సరుకుల ఉత్పత్తిలో విడుదలయ్యే హరిత గృహ వాయువులు భూతాపం పెరుగుదలకు, పర్యవసానంగా వాతావరణ మార్పు వైపరీత్యాలకు కారణమవుతున్నాయి. ఇ–వ్యర్థాల నిర్వహణ భౌగోళిక రాజకీయ సవాలుగా మారి, ప్రపంచస్థాయిలో ఈ వ్యర్థాల నిర్వహణ, నియంత్రణ చేయవలసిన అవసరం ఏర్పడిన నేపథ్యంలో 2002 ఏప్రిల్‌లో 'వేస్ట్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ (డబ్ల్యూఈఈఈ) అంతర్జాతీయ వేదిక ఏర్పడింది. అంతర్జాతీయ సమాజంలో ఇ–వ్యర్థాల అనర్థాలు, నియంత్రణ అవసరంపై అవగాహన పెంపొందించేందుకు 'ఇంటర్నేషనల్ ఇ–వేస్ట్ డే'ను ప్రతి ఏటా అక్టోబర్ 14 తేదీన జరుపుకోవాలని డబ్ల్యూఈఈఈ వేదిక 2018లో పిలుపునిచ్చింది.

ఏటా 50 శాతం వృద్ధితో ఇ–వ్యర్థాలు పోగవుతున్నప్పటికీ గ్లోబల్ వ్యర్థాల్లో 20 శాతం మించి రిసైక్లింగ్‌కు నోచుకోవడం లేదు. మిగిలిన 4 కోట్ల టన్నుల వ్యర్థాలను చెత్త క్షేత్రాల్లో నిలువ చేయడమో, భస్మం చేయడమో లేదా ప్రధానంగా వెనుకబడిన, వర్ధమాన దేశాలకు చట్టవిరుద్ధంగా ఎగుమతి చేయడమో, లేదా సముద్ర జలాల్లో పారబోయడమో జరుగుతోంది. అత్యధిక స్థాయిలో ఇ–వ్యర్థాలను సృష్టిస్తున్న అభివృద్ధి చెందిన ఉత్తరార్ధగోళ పారిశ్రామిక దేశాలు ఆ వ్యర్థాలను జీవ



వైవిధ్యం మెండుగా ఉన్న దక్షిణార్ధగోళ వ్యావసాయిక దేశాల్లో అన్యాయంగా పారబోస్తున్నాయి.

మన దేశంలో ఏటా 18.5 లక్షల టన్నుల ఇ–వ్యర్థాలు విడుదలవుతున్నాయి. ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో మహారాష్ట్ర, తమిళనాడు తరవాత 3వ స్థానంలో తెలుగు రాష్ట్రాలున్నాయి. అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్, కంటితుడుపు చట్టాలు, లోపాయికారీ నియంత్రణ కారణంగా ఇ–వ్యర్థాల నుంచి పెద్దఎత్తున విష రసాయనాలు వెలువడుతున్నాయి. సంపన్న దేశాలు భారత్‌ను ఎలక్ట్రానిక్ వ్యర్థాల కుప్పతొట్టిగా భావిస్తూ ఏటా 50 వేల టన్నులకు పైగా ఇ–వ్యర్థాల్ని భారత్‌లో లేదా ఇక్కడి సముద్ర జలాల్లో కుప్పపోస్తున్నాయి.

ప్రస్తుతం ప్రపంచం పునరుద్ధరణ సాధ్యం కాని 'ఆకస్మిక వాతావరణ మార్పు' దశకు చేరుకోబోతోంది. ఇ–సరకుల వినియోగం, ఉత్పత్తి విషయంలో వ్యక్తి, సంస్థాగత స్వీయ నియంత్రణలు, ప్రభుత్వ స్థాయిలో నియంత్రణ చర్యలు, అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా ఇ–వ్యర్థాలను నిరోధించడం అసాధ్యం. ఇ–వ్యర్థాల సమస్య, హరిత గృహ వాయువులు వెలువడుతున్న కారణంగా ఏర్పడిన వాతావరణ మార్పు ముప్పు, పారిశ్రామిక, వ్యవసాయ కార్యకలాపాల వల్ల జల, వాయు, శబ్ద, కాంతి కాలుష్యాలు తదితర భూగోళంపై సాగుతున్న పర్యావరణ వైపరీత్యాలన్నీ విడివిడి అంశాలు కావు. సమాజానికి, ప్రకృతికి మధ్య జరిగే లావాదేవీల సమతుల్యత దెబ్బతిన్నందువల్ల ఏర్పడిన పర్యావరణ సంక్షోభంలో ఈ వైపరీత్యాలన్నీ విడదీయరాని అంతర్భాగాలే.

ఆదిమ సమాజం నుంచి నేటి అత్యాధునిక సమాజం వరకు ఒక 'విచ్ఛిన్న ప్రవాహం'లా సాగిన ప్రకృతి మానవీకరణ క్రమంలో వివిధ చారిత్రక దశల్లో ఏర్పడిన నిర్దిష్ట సామాజికార్థిక సంక్షోభాలకు సహజాతంగా పర్యావరణ సంక్షోభాలు కూడా ఉనికిలోకి వచ్చాయి. పర్యావరణ సంక్షోభంపై వివిధ అంతర్జాతీయ ఒప్పందాలు, వినిమయ సంస్కృతిని సంస్కరించే ప్రయత్నాలు, ప్రభుత్వాల నిషేధాలు, నిబంధనలన్నీ ఆర్థిక విధానంతో సంబంధం లేకుండా వాటికవిగా అమలు చేయడం సాధ్యం కాదు.

ఐక్యరాజ్యసమితి దేశాధినేతల సమావేశాన్ని ఉద్దేశించి వాతావరణ మార్పును అరికట్టేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేస్తూ ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణిగా ప్రపంచ ఖ్యాతిని గడించిన బాలిక గ్రెటా థెన్‌బర్గ్ చేసిన ప్రసంగం... భవిష్యత్ చిత్రానికి అద్దం పడుతోంది. లాభార్జనే పరమావధిగా సాగే సరకుల ఉత్పత్తి విధానం, కార్పొరేట్ శక్తుల అత్యాశకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వ విధానాల స్థానంలో ప్రకృతికి సమాజానికి మధ్య లావాదేవీల సమతుల్యతను సాధించే ఉత్పత్తి విధానం ప్రపంచంలో ఉనికిలోకి వస్తే తప్ప పర్యావరణ సంక్షోభానికి ఒక హేతుబద్ధ పరిష్కారం దొరకదు.

(అక్టోబర్ 14న అంతర్జాతీయ ఇ–వేస్ట్ డే సందర్భంగా)

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు
మొబైల్ : 95503 67536

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

**నమిత అభిమానులకు శుభవార్త!**
**ఆమె బోలెడంత లాస్ అయ్యారు!**
**కంగారు పడకండి. నమిత లాస్ అయింది డబ్బు కాదు.**
**వెయిట్ లాస్!! బరువు తగ్గి, మెరుపుతీగ అయ్యారు నమిత.**
**తారలు వెయిట్ తగ్గితే.. ఇండస్ట్రీలో వెయిట్ పెరుగుతుంది.**
**'సొంతం'తో ఎంట్రీ ఇచ్చి.. 'సింహా' తర్వాత కొంచెం ఒళ్లు చేసిన నమిత**
**సన్నబడి, మళ్లీ ఇప్పుడు సౌత్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతున్నారు.**
**ఆ వివరాలు.. 'సాక్షి'కి ఎక్స్‌క్లూజివ్..!**

# నమితానందం





● **రెండేళ్ల క్రితం పెళ్లప్పుడు బొద్దుగా ఉన్నారు. ఈ మధ్య బరువు తగ్గారు. సినిమాల కోసమా?**

**నమిత:** బరువు తగ్గడానికి ముఖ్య కారణం కొన్ని పెద్ద సినిమాలు అంగీకరించడమే. వచ్చే ఏడాది మేలో ఈ సినిమాలు ఆరంభమవుతాయనుకుంటున్నాను. అందుకే టైమ్ తీసుకొని బరువు తగ్గుతున్నాను. ప్రతి రోజూ ఉదయాన్నే ఐదున్నరకే నిద్ర లేస్తున్నాను. రోజు మార్చి రోజు యోగా, జిమ్ చేస్తున్నాను. వారానికి ఆరు రోజులు చేస్తున్నాను. ఒక్క రోజు సెలవు తీసుకుంటున్నాను. బరువు తగ్గడానికి మరో కారణం ఆరోగ్య సమస్యలు. నిజం చెప్పాలంటే నేనెప్పుడూ ఓవర్ వెయిట్‌ని ఎంజాయ్ చేయలేదు.

● **ఉన్నట్లుండి ఎందుకు బరువు పెరిగారు?**

ఆడవాళ్లకు హార్మోన్స్ సమస్యలు ఉంటాయి. అలాంటి సమస్యల వల్లే నేను విపరీతంగా బరువు పెరిగాను. మన సమస్యలను మనం తెలుసుకోగలగాలి. నేను, నా భర్త (వీర్) నా శరీరంలోని సమస్యకు మూలం ఏంటి? అనే దగ్గర నుంచి వర్కౌట్ చేయడం మొదలుపెట్టాం. సాధారణంగా ఏదైనా సమస్య వస్తే తాత్కాలిక పరిష్కారం కోసం చూస్తాం. కానీ మేం శాశ్వత పరిష్కారం కావాలనుకున్నాం. ఈ ఏడాది జనవరి నుంచి జిమ్, యోగా మొదలుపెట్టాను. కొత్త డైట్‌ని ఫాలో అవుతున్నాను. 2011 నుంచి 2016 వరకూ డిప్రెషన్‌లో ఉన్నాను. 2017లో నార్మల్ అయ్యాను. డిప్రెషన్‌లో ఉన్నప్పుడు మద్యానికి బానిస కావొచ్చు, పిచ్చి పిచ్చి ఆలోచనలతో మానసికంగా వేరే స్థితికి వెళ్లొచ్చు. లక్కీగా నేను ఆధ్యాత్మికం వైపు వెళ్లాను. ధ్యానం చేయడం మొదలుపెట్టాను. అలాంటి సమయంలో వీర్ నా జీవితంలోకి వచ్చాడు. తను నా బ్యాక్‌బోన్‌లా మారిపోయాడు. నాలో చాలా స్ఫూర్తి నింపాడు. వీర్ లైఫ్ స్టయిల్ చాలా నేచురల్‌గా ఉంటుంది. అన్నీ ఆర్గానిక్, హెర్బల్స్‌ని తీసుకుంటాడు. ఇంగ్లీష్ మెడిసిన్‌ని ఇష్టపడడు. కెమికల్స్ ఎక్కువ ఉండవు. నన్ను కరెక్ట్ దారిలో పెట్టాడు. డాక్టర్స్‌ను సంప్రదించాం. సహజమైన పద్ధతిలో బరువు తగ్గే ప్రయత్నం మొదలుపెట్టా.

● **ఈ బరువు తగ్గే విషయంలో మిగతా స్త్రీలకు ఉపయోగపడే టిప్స్ ఏమైనా?**

ఒక్కొక్కరికి ఒక్కో సమస్య ఉంటుంది. నాకు పీసీఓడి, థైరాయిడ్ సమస్యలున్నాయి. వంశపారంపర్యం కూడా ఉంది. వీటన్నింటికి తోడు డిప్రెషన్‌తో బాధపడ్డాను. ఆ సమయంలో ఏం తింటున్నాం? ఎంత తింటున్నాం అనే దాని మీద శ్రద్ధే ఉండదు. అలా బరువు పెరిగాను. వీర్ సపోర్ట్‌తో నా ఆరోగ్య సమస్య గురించి తెలుసుకున్నాను. ప్రతి ఒక్కరూ తమ సమస్యని తెలుపుకోవాలి. బయటకు చెప్పడానికి మొహమాట పడకూడదు. డాక్టర్ దగ్గరికెళ్లడానికి సిగ్గుపడకూడదు. అప్పుడే మన సమస్యను మనం అధిగమించగలుగుతాం.

● **ఎంత బరువు తగ్గారు? మీ డైలీ డైట్ ఏంటి?**

పది కిలోలు తగ్గాను. ఇంకో 7 కిలోలు తగ్గాలనుకుంటున్నాను. మేం రాగి, జొన్నలు వంటి వాటిని ఎక్కువగా తీసుకుంటున్నాం. వీటి ప్రభావం లాంగ్ రన్‌లో ఎక్కువ ఉపయోగపడుతుంది. నేను ఉదయం నిద్ర లేవగానే ములక్కాడ ఆకుల రసం తీసుకుంటాను. ములక్కాడ ఆకుల రసానికి తేనె, నిమ్మరసం కలుపుతాను. 20 నిమిషాల తర్వాత జీలకర్ర వాటర్ తాగుతాను. రాత్రి మొత్తం జీరాను నానబెట్టి ఉదయాన్నే వేడి చేసి, తాగుతాను. మిగిలిన జీరాను నమిలేయాలి. కొంత సేపటి తర్వాత ఒక యాపిల్ తింటాను. జిమ్ లేదా యోగా నుంచి తిరిగొచ్చాక బ్రేక్‌ఫాస్ట్ చేస్తాను. ముస్లీ, డ్రై ఫ్రూట్స్, మిల్క్ లేదా పెరుగు తింటాను. లంచ్‌లో రాగి ఇడ్లీ, రాగి దోశె లేదా రాగి పనియారమ్ తింటాను. బ్రౌన్ రైస్ తీసుకుంటాను. రెండు గంటల తర్వాత ఒక గ్లాస్ కొబ్బరినీళ్లు తాగుతాను. రోజు మొత్తంలో సుమారు 6 నుంచి 7 లీటర్ల నీళ్లు తాగుతాను. రాత్రి డిన్నర్‌లో వెజిటేబుల్ సూప్ మాత్రమే ఉంటుంది. ఒకవేళ బాగా ఆకలనిపిస్తే మా కుక్‌ను రాగి పనియారం చేయమంటాను. పూండు చట్నీ (వెల్లుల్లిపాయ చట్నీ), కొబ్బరి చట్నీతో తింటాను. పల్లీల చట్నీ అంటే నాకు బాగా ఇష్టం కానీ డైట్‌లో వద్దన్నారు. అందుకే పదిరోజులకోసారి పల్లీ చట్నీ తింటాను.

● **ఈ డైట్‌ని ఎవరు చెప్పారు?**

నా డైట్ మొత్తం నా డైటీషియన్, వీర్ కలిసి ప్లాన్ చేశారు. ప్రస్తుతం మనందరం చాలా కాలుష్యంలో ఉంటున్నాం. దానివల్ల మనకు కావాల్సిన విటమిన్లు సరిగ్గా అందే అవకాశాలు తక్కువ. అందుకే ఒక్కోసారి విటమిన్ టాబ్లెట్లు తీసుకుంటుంటాను. ఇవన్నీ డాక్టర్ల సూచన మేరకే వాడతాను.

● **ఇదే డైట్‌ను ఎప్పటికీ కొనసాగిస్తారా?**

కొనసాగించాలనుకుంటున్నాను. అయితే ఒక సంవత్సరానికి మించి ఇదే డైట్‌ని ఫాలో అవ్వలేననిపిస్తోంది. స్వీట్స్ మానేశాను. మధ్యలో కీటో డైట్ కూడా పాటించాను. అది నాకు సరిగ్గా వర్కౌట్ కాలేదు. మా కజిన్ ఒకామెకు బాగా వర్కౌట్ అయింది.

**మీ భర్త సపోర్ట్ వల్లే మీరు బరువు తగ్గగలిగారా?**

అవును. అయితే ప్రాబ్లమ్ ఎక్కడ అంటే.. సన్నగా అవ్వాలనే ఆసక్తి భార్యకు కూడా ఉండాలి. భర్త డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లినా భార్య రాననడం నేను చాలా సందర్భాల్లో చూశాను. లావుగా ఉండడంవల్ల ఎక్కువ వయసున్నట్లు కనిపిస్తారు. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లని భర్తలు కూడా ఉంటారు. అప్పుడు వాళ్ల నాన్నలను అడగాలి. వినకపోతే రెండుమూడు సార్లు అడగాలి. లేకపోతే వాళ్లంతట వాళ్లే డాక్టర్‌ని సంప్రదించాలి. ఇంట్రెస్ట్ వాళ్లకే ఉండాలి. నా వల్ల కాదు, నాకు అక్కర్లేదు అనుకుంటే ఎవరు ఎంత సపోర్ట్ చేసినా ఉపయోగం ఉండదు. తన మార్పు మిగతావాళ్లకు ప్రేరణ కలిగించాలి.

● **నో చాక్లెట్, నో స్వీట్స్ అంటే కష్టమేమో?**

హార్మోనల్ ఇంబ్యాలెన్స్ వల్ల నాకు తీపి తినాలనే ధ్యాస పెద్దగా ఉండట్లేదు. లేకపోతే ప్రతి రోజూ డిన్నర్ తర్వాత ఏదో ఒక స్వీట్ తినాల్సిందే. ఇప్పుడు అలా లేదు. మిస్ అయినట్టే లేదు. నేనేనా అని అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. డైట్ మొదలుపెట్టిన మూడునెలల తర్వాత మా ఊరికి వెళ్లాను. మా అమ్మగారు హల్వా తయారు చేశారు. మూడు నెలలకు తిన్న స్వీట్ అది.

● **బరువు తగ్గాక శారీరకంగా చాలా మార్పు వచ్చింది. మరి మానసికంగా?**

ధ్యానం నన్ను ప్రశాంతంగా మార్చేసింది. నా ఆలోచనల్లో మెచ్యూర్టీ వచ్చింది. మనుషులను, వాళ్ల మనస్తత్వాలను ఇంతకు ముందుకన్నా బాగా అర్థం చేసుకోగలుగుతున్నాను. ఎవరి ముందు ఏం మాట్లాడాలి? ఎవరి ముందు ఏం మాట్లాడకూడదు అని తెలుసుకుంటున్నాను. అవన్నీ మెల్లిమెల్లిగా అర్థం అవుతున్నాయి. ఈ మధ్యనే మా చుట్టాల ఇంటికి వెళ్లాను. అందరూ 'భలే మెరిసిపోతున్నావు' అన్నారు. నీలో సంతోషం మాత్రమే కనిపిస్తోంది అన్నారు. నా టెంపర్ పోయింది. రిలాక్స్‌గా ఉంటున్నాను. కాన్ఫిడెంట్‌గా మారాను. ఈ మార్పు మొత్తం వీర్ నా జీవితంలోకి వచ్చిన తర్వాతే.

● **తెలుగులో మళ్లీ ఎప్పుడు కనిపిస్తారు?**

నా కెరీర్‌ను తెలుగు సినిమాతోనే ప్రారంభించాను. తెలుగు పరిశ్రమకు రుణపడి ఉంటాను. మంచి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నా.

● **ఈ మధ్య స్టార్స్ అందరూ వెబ్ సిరీస్‌లో కూడా కనిపిస్తున్నారు. మీక్కూడా ఇంట్రెస్ట్ ఉందా?**

కథ బావుంటే ఏదైనా ఓకే. మీకు తెలుసో లేదో నేను కవితలు రాస్తుంటాను. నేను, వీర్ కలిసి కొన్ని స్క్రిప్ట్స్ రాశాం. ఆ కథలను సినిమాగా అయినా, వెబ్ సిరీస్‌గా అయినా తీయొచ్చు. ప్రొడక్షన్ హౌస్ మొదలుపెట్టాలనుకుంటున్నాం.

● **పర్సనల్ లైఫ్‌లోకి వస్తే పిల్లలెప్పుడు?**

పెళ్లి సమయంలోనే ఇప్పుడే పిల్లలు వద్దు అనుకున్నాం. మా తల్లిదండ్రులు అర్థం చేసుకున్నారు. మా అత్తామామలైతే 'డైమండ్' అనొచ్చు. చాలా స్వీట్‌గా ఉంటారు. అర్థం చేసుకుంటారు. పిల్లలెప్పుడు అని కంగారు పెట్టరు.

● **తెలుగింటి కోడలుగా ఉండటం ఎలా ఉంది?**

వీర్ నాకు ప్రపోజ్ చేసినప్పుడు తెలుగు సంప్రదాయ ప్రకారం పెళ్లి జరగాలా? మా గుజరాతీ స్టయిల్ వెడ్డింగ్ కావాలా అనేది నన్నే నిర్ణయించుకోమన్నాడు. చిన్నప్పటినుంచి గుజరాతీ పెళ్లిళ్లు చాలా చూశా. అవి బావుంటాయి. తెలుగు సంప్రదాయం ఎలా ఉంటుందో తెలుసుకోవాలని తెలుగు స్టయిల్‌లో చేసుకున్నాం. వీర్ వాళ్ల అమ్మానాన్నలకు కూడా మా అబ్బాయికి పెళ్ళి అయింది అనే ఫీలింగ్ ఉండాలి కదా. నేను ఎప్పుడూ వినని, తెలియని సంప్రదాయాలను చూశాను.

● **మీ ఫ్యాన్స్‌కి ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?**

తెలుగు ఫ్యాన్స్ అందరికీ ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. బ్యాంగ్‌తో తిరిగొస్తాను. నాలుగైదు డిఫరెంట్ గెటప్స్‌లో నన్ను చూడబోతున్నారు. ఇకపై విభిన్నమైన రోల్స్ చేయనున్నాను. 'నమిత ఈజ్ బ్యాక్' అనేలా మంచి క్యారెక్టర్లు సెలక్ట్ చేసుకుంటాను.

● **అవునూ... మీ భర్తను 'స్వామీ' అని పిలుస్తారట?**

ఇంతకుముందు వీర్ అని పిలిచేదాన్ని. ఆ మధ్యలో వీర్ అయ్యప్ప మాల వేసుకున్నాడు. అప్పుడు స్వామీ అని పిలుస్తాం కదా. అలా పిలవడం నాకు బాగా అనిపించింది. అందుకే ఎప్పటికీ 'స్వామీ' అని పిలవాలని డిసైడ్ అయిపోయాను.

**– డి.జి.భవాని**

నమిత

ట్రాన్స్‌ఫర్మేషన్ వెనక ఉన్న కారణాలు రెండు. ఒకటి సినిమా. రెండోది వేరేవాళ్లు తనపై చూపించిన ఆసక్తి. 'ఇంత బరువు పెరిగారు ఏంటి?' అని అడిగేవాళ్లు. స్త్రీలు బరువు పెరిగితే వంద సమస్యలు ఉంటాయి. కానీ బయటకు చెప్పలేరు. ఎవరికైనా చెప్పినా పెళ్లయ్యాక పెరుగుతారులే అని కొట్టిపారేస్తారు. తగ్గడానికి ప్రయత్నించరు. వాళ్లకు స్ఫూర్తిగా నమిత ఉండాలన్నది నా ఉద్దేశం. తను సడన్‌గా ఎందుకు లావు అవుతోంది? ఎందుకు తగ్గుతోంది అనే ఆలోచనలో పడ్డాను. మనం తినేదాంట్లో సగం కూడా తినడం లేదు.. మరి ఎలా లావు అవుతోంది? అనుకున్నా. తను ఆరేళ్లు డిప్రెషన్‌లో ఉంది. దాంతో సిస్టమ్ దెబ్బతింది. డాక్టర్లను సంప్రదించి ఈ కోర్స్ మొదలుపెట్టాం. అందరూ లావు తగ్గటం పెద్ద టాస్క్ అనుకోకూడదు. అనుకుంటే తగ్గుతారు.

–వీర్, నమిత భర్త

# ఇన్నర్‌వ్యూ
## సండే స్పెషల్

### నాకు ఎంగేజ్‌మెంట్ కాలేదు



సోషల్ మీడియాలో అభిమానులు అడిగే ప్రశ్నలను పట్టించుకోరు నిధీ అగర్వాల్. అయితే ఒక అభిమాని అడిగిన ప్రశ్నను మాత్రం ఆమె పట్టించుకోక తప్పలేదు. నిధి ఆన్‌లైన్ పేజీలోని రిలేషన్‌షిప్ స్టాటస్‌లో 'ఎంగేజ్డ్' అని ఉండడం చూసి అవాక్కయిన ఆ అభిమాని ఆ స్టాటస్‌ను స్క్రీన్ షాట్ తీసి పోస్ట్ చేశాడు. ''మీకు ఎంగేజ్‌మెంట్ అయిందా!'' అని షాక్ తిన్నట్లుగా అడిగాడు. దానికి సమాధానంగానే నిధి తన ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఎంగేజ్‌మెంట్ కాలేదు' అని రెస్పాండ్ అయ్యారు. కాలేదన్న విషయానికి ఆ అభిమాని ఎంతగా సంతోషించాడో కానీ, అభిమానులు తనను ఇంతగా ఫాలో అవుతున్నందుకు మేఘాల్లో తేలిపోయారు నిధి. నిధికి ఇన్‌స్టాగ్రామ్‌లో 40 లక్షల 10 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు.

**– నిధీ అగర్వాల్,** (మోడల్, డాన్సర్, బాలీవుడ్ నటి)

### పచ్చడుంటే చాలు



''పచ్చడి అంటే నాకు ఎంత ఇష్టమో చెప్పలేను. పచ్చడి లేకుండా ముద్ద గొంతు దిగదు. భోజనంలోకి మాత్రమే కాదు.. ఎందులోకైనా నాకు పచ్చడి ఉండాల్సిందే. శాండ్‌విచ్‌లోకి కూడా! చీజ్ శాండ్‌విచ్‌లోకైతే మామిడి కాయ పచ్చడి భలేగుంటుంది. మంచి కాంబినేషన్. ఏ దేశం వెళ్లినా నాకు ఈ అలవాటు పోదు.

**– ప్రియాంక చోప్రా,** ('ఈస్ట్ ఇండియా కామెడీ' గ్రూపుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో)

### మూడుసార్లు వెనక్కి



''నా బుగ్గలు బూరెల్లా ఉన్నాయని, ఒళ్లు బొద్దుగా ఉందని మొదట నన్ను ఈ సీరియల్‌కి తీసుకోలేదు. ఇవే కారణాలతో ఆడిషన్‌లో మూడుసార్లు ఫెయిల్ అయి వెనక్కి వచ్చేశాను. నాలుగోసారి మాత్రమే నన్ను అదృష్టం వరించింది. అప్పటికి కొంచెం సన్నబడినట్లున్నాను. లైఫ్‌లో ఏదీ ఆశించిన వెంటనే దగ్గరకు వచ్చేయదు. ఓర్పు ఉండాలి. నా మొదటి పారితోషికం 300 రూపాయలు. ఒక క్యాటలాగ్ షూట్‌లో పాల్గొన్నందుకు ఇచ్చారు. ఆ మూడొందలు ఇప్పటికీ నా దగ్గర భద్రంగా ఉన్నాయి.

**– రీమ్ షేక్,** (జీటీవీలో ఏడాదిగా ప్రసారం అవుతున్న 'తుఝే హై రాబ్తా' సీరియల్‌లో కల్యాణీ మల్హర్ పాత్రధారి)

### థ్యాంక్యూ





''గాలిలో కాలుష్యం ఎక్కువైంది. ఊహిస్తుంటేనే భయంగా ఉంది. స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరం మన బాధ్యతగా చెట్లు పెంచాలి. థ్యాంక్స్ వరుణ్ తేజ్ గారూ.. ఈ పనికి నన్ను ప్రేరేపించినందుకు''.

**– సాయిపల్లవి**

(వరుణ్‌తేజ్ ఇచ్చిన 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'ని స్వీకరించి మొక్కను నాటాక సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కామెంట్)

**హెల్త్‌టిప్స్**

### గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం కోసం...

**ఇటీవల కాలంలో చాలామందిని గ్యాస్ సమస్య వేధిస్తోంది. దీనికి రక రకాల మాత్రలు వాడేకంటే చిన్న చిన్న చిట్కాలు పాటించడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది.**



- కడుపు ఖాళీగా ఉంటే గ్యాస్ సమస్య వస్తుంది. కాబట్టి రోజూ 6 నుంచీ 8 గ్లాసుల నీటిని తీసుకుంటే గ్యాస్ సమస్య తలెత్తదు.
- రోజూ భోజనానికి ముందు చిన్న అల్లం ముక్కను నమిలి మింగడం చాలా మంచిది. దానిని నేరుగా తినలేకపోతే కొద్దిగా బెల్లం లేదా పంచదార కలుపుకుని కూడా తినవచ్చు.
- నాలుగైదు వెల్లుల్లి రెబ్బలకు రెండేసి స్పూన్ల ధనియాలు, జీలకర్ర తీసుకుని 5 నిముషాల పాటు ఉడికించాలి. చల్లారాక వడపోసి గోరువెచ్చగా ఉన్నప్పుడే తాగాలి.





- దాల్చిన చెక్క గ్యాస్ సమస్యకు మంచి మందు. కొద్దిగా దాల్చిన చెక్కను తీసుకుని నీటిలో వేసి మరిగించాలి. తర్వాత ఆ జ్యూస్ ను తాగాలి. ఇలా రోజూ భోజనానికి ముందు తాగితే గ్యాస్ సమస్య తొలగి పోతుంది.
- గ్యాస్ సమస్య ఉన్నవాళ్లు రోజూ కొబ్బరి నీళ్ళని తాగటం అలవాటు చేసుకుంటే మంచిది.

ఇలా నెల రోజులు ఈ చిట్కాలను పాటిస్తే మంచి ఫలితాలుంటాయి.





# వైకుంఠపురములో పాట

ఒక చేతిలో పుంజు, మరో చేతిలో కత్తి పట్టుకుని సంక్రాంతి పందేనికి బాక్సాఫీస్ బరిలో దిగుతున్నారు అల్లు అర్జున్. త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అల... వైకుంఠపురములో...'. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇది వరకే ప్రకటించింది. తాజాగా జనవరి 12న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు విడుదల తేదీని శనివారం అధికారికంగా వెల్లడించారు. అలాగే అల్లు అర్జున్ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. కీలక తారాగణంపై పాట చిత్రీకరిస్తున్నారు. సుశాంత్, నివేదా పేతురాజ్, టబు, జయరామ్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

● అల్లు అర్జున్

# తీపి కబురు

విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్ వెళ్లిన మహేశ్‌బాబు హైదరాబాద్‌కు వచ్చీ రాగానే అభిమానులకు తీపి కబురు చెప్పారు. 'సరిలేరు నీకెవ్వరు' సినిమాను జనవరి 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మండన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఆర్మీ మేజర్ అజయ్‌కృష్ణ పాత్రలో మహేశ్‌బాబు నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోందని తెలిసింది. కోర్టు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని సమాచారం. విజయశాంతి, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్‌బాబు నిర్మిస్తున్నారు.



● మహేశ్‌బాబు



● వైఎస్ జగన్, హరికృష్ణ, జొన్నలగడ్డ శ్రీనివాస్

# ఆటో రజినికి ఆశీస్సులు

జొన్నలగడ్డ హరికృష్ణ హీరోగా రూపొందుతున్న చిత్రం 'ఆటో రజిని'. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఈ చిత్రం ప్రారంభమైంది. బి.లింగుస్వామి సమర్పణలో జొన్నలగడ్డ శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. జొన్నలగడ్డ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''హరికృష్ణ హీరోగా నటిస్తోన్న రెండో చిత్రమే మంచి మాస్ ఎంటర్‌టైనర్ కావడం ఆనందంగా ఉంది. సీయంగా ఎంతో బిజీగా ఉండి కూడా మా హీరోకి జగన్‌గారి బ్లెస్సింగ్స్ ఉండటం ఆనందంగా ఉంది. ఎలక్షన్ టైమ్‌లో మేము చేసిన 'జననేత జగనన్న..' పాట గురించి ప్రత్యేకంగా ఆయన మమ్మల్ని అభినందించటం జీవితంలో మర్చిపోలేను'' అన్నారు.



● శ్రీవిష్ణు

# తిప్పరా మీసం

అనుకున్నది సాధించినప్పుడో, పందెంలో గెలిచినప్పుడో మీసం తిప్పుతారు. ఇప్పుడు శ్రీవిష్ణు కూడా మీసం తిప్పుతున్నారు. మరి ఆయనేం చేశారో సినిమా చూసి తెలుసుకోవాలి. శ్రీవిష్ణు హీరోగా ఎల్. కృష్ణ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తిప్పరా మీసం'. నికీ తంబోలీ హీరోయిన్. శ్రీ ఓం బ్యానర్ సమర్పణలో రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, కృష్ణ విజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్లు నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబర్ 8న విడుదల చేయాలనుకుంటున్నారు. ''యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. ట్రైలర్, ఆడియోను త్వరలోనే రిలీజ్ చేస్తాం. థియేట్రికల్ రైట్స్‌ను ఏషియన్ సినిమాస్ బ్యానర్ తీసుకున్నారు'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి, కెమెరా: సిద్ధ్.



● మహేశ్, ప్రవల్లిక

ప్రముఖ దర్శకుడు కోడి రామకృష్ణ రెండో కుమార్తె ప్రవల్లిక వివాహ నిశ్చితార్థం సి.హెచ్ మహేశ్‌తో హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో ప్రముఖ నటులు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్‌లతో పాటు కృష్ణంరాజు, రాజశేఖర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. నిర్మాతలు 'దిల్' రాజు, ఎం.ఎస్ రాజు, అల్లు అరవింద్ తదితర సినీరంగ ప్రముఖులతో పాటు రాజకీయవేత్త గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మంచి మలుపు అవుతుంది

సీనియర్ నటుడు సత్యప్రకాశ్ దర్శకుడిగా మారి, రూపొందిస్తున్న చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. రక్షకభటుడు, ఆనందం, లవర్స్ డే లాంటి చిత్రాలను అందించిన నిర్మాత ఎ. గురురాజ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నటరాజ్, నూరిన్, అంకిత తదితరులు ముఖ్య తారలుగా రూపొందుతున్న ఈ చిత్రం నవంబర్‌లో విడుదల కానుంది. శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని హీరో వెంకటేశ్ ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. గురురాజ్ మాట్లాడుతూ– ''సత్యప్రకాష్ నాకు మంచి మిత్రుడు. నటునిగా అతనిలో ఎంత ఫైర్ ఉందో, దర్శకునిగా అంతకు మించిన ఫైర్ ఉంది. ఈ చిత్రానికి నేనే కథను అందించాను. నిర్మాతగా నాకు, దర్శకునిగా సత్యప్రకాష్‌కు ఈ చిత్రం మంచి మలుపు అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''మా చిత్రం ప్రేక్షకులను ఏమాత్రం నిరాశపరచదు'' అన్నారు సత్యప్రకాష్. ఈ చిత్రానికి సమర్పణ: శ్రీమతి ఎ.ముత్తమ్మ.



● గురురాజ్, నటరాజ్, వెంకటేష్, సత్యప్రకాశ్



● అదితీరావ్ హైదరీ

# అలా పెళ్లి చేసుకోవాలని ఉంది

పెళ్లి విషయాల్లో అమ్మాయిలకు ఎన్నో కలలుంటాయి. 'రెక్కల గుర్రం మీద రాకుమారుడు రావాలి, ఊరంతా చెప్పుకునేలా పెళ్లి జరగాలి' అని ఎవరి కలలు వాళ్లవి. మరి మీ డ్రీమ్ వెడ్డింగ్ ఏంటి? అనే ప్రశ్నను అదితీరావ్ హైదరీని అడిగితే ఈ విధంగా సమాధానం ఇచ్చారు. ''నా పెళ్లిలో నేను అచ్చు రాజా రవివర్మ బొమ్మను తలపించేలా ఉండాలి. మా అమ్మగారి వివాహం జరిగినప్పుడు ఆమె మేకప్ లేకుండా సింపుల్‌గా ఉన్నారు. నేనూ అలానే ఉంటాను. నా పెళ్లి బీచ్ ఒడ్డున ఉండే రాజుల నాటి భారీ కోటలో జరగాలి. పెళ్లికి సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాక చెప్పులు తీసేసి బీచ్‌లో పరిగెడతాను. రాత్రంతా డ్యాన్స్ చేస్తూనే ఉంటాను. నేను చెప్పేవన్నీ ఒకదానికి ఒకటి పొంతన లేకపోవచ్చు. కానీ నేనంతే. నా ఆలోచనలన్నీ ఒకేలా ఉండవు'' అన్నారు. ఇదిలా ఉంటే అదితీరావ్‌కి ఆల్రెడీ పెళ్లయింది. కానీ భర్త నుంచి విడిపోయారామె.

# రాజుగారి గది 10 కూడా ఉండొచ్చు



● అశ్విన్

''మంచి మంచి సినిమాలు చేయాలి. అవి ప్రేక్షకులను బాగా ఎంటర్‌టైన్ చేయాలి. 'వీడు బాగా చేశాడ్రా' అని ప్రేక్షకులు అనుకుంటే చాలు '' అంటున్నారు అశ్విన్‌బాబు. 'రాజుగారి గది' సిరీస్‌లో వస్తున్న మరో చిత్రం 'రాజుగారి గది 3'. ఓంకార్ దర్శకత్వంలో అశ్విన్‌బాబు, అవికా గోర్ జంటగా నటించారు. అక్టోబర్ 18న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా అశ్విన్ మాట్లాడుతూ – ''రాజుగారి గది' సినిమా చేస్తున్నప్పుడు ఆ సినిమాకు సీక్వెల్ ఉంటుందనే ఆలోచనే లేదు. ప్రేక్షకులు కోరుకోవడంతో సీక్వెల్ రూపొందించాం. మూడో పార్ట్ వరకూ వచ్చింది. వాళ్లకు నచ్చితే 'రాజుగారి గది 10' కూడా ఉండొచ్చు. సెకండ్ పార్ట్‌లో కొంచెం ఎంటర్‌టైన్‌మెంట్ మిస్ అయిందన్నారు. అందుకే థర్డ్ పార్ట్‌లో ఫుల్ ఎంటర్‌టైన్‌మైంట్ గ్యారెంటీ. ఓ మలయాళ సినిమా నుంచి తీసుకున్న పాయింట్ ఆధారంగా ఈ సినిమా చేశాం. ముందు హీరోయిన్‌గా తమన్నాను అనుకున్నాం. డేట్స్ విషయంలో క్లాష్ ఏర్పడి ఆమె సినిమా నుంచి తప్పుకున్నారు. మొదటి రెండు భాగాల్లో నేను కీలక పాత్రలు చేసినా ఈ సినిమా మాత్రం నా భుజాల మీద నడుస్తుంది. సినిమా మీద కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ప్రస్తుతం నాకు మార్కెట్ లేదు. మార్కెట్ ఏర్పరచుకుంటున్నాను. నాతో సినిమా చేసే నిర్మాతకు డబ్బు మిగలాలన్నదే నా లక్ష్యం. అన్నయ్య (ఓంకార్) టీవీ ప్రోగ్రామ్స్ చేస్తున్నప్పటి నుంచి ప్రొడక్షన్‌లో ఉన్నాం. అందుకే నిర్మాతల గురించి ఆలోచిస్తాను. విభిన్న కథల్లో నటించాలనుంది. కుస్తీ బ్యాక్‌డ్రాప్‌కి సంబంధించిన కథ చర్చల్లో ఉంది. ఆ సినిమా వివరాలు త్వరలోనే ప్రకటిస్తాను'' అన్నారు.

# మళ్లీ మళ్లీ చూస్తారు



● కోటేశ్వరరావు

''మా అబ్బాయి అనురాగ్ ఇంజనీరింగ్ పూర్తి చేసి వ్యాపారంలో నాకు తోడుగా ఉండేవాడు. రామానాయుడులో యాక్టింగ్ కోర్స్ చేసి సినిమాల్లో నటిస్తాను అన్నాడు. వాడి కలను నిజం చేయడానికే ఈ సినిమా నిర్మించాను'' అన్నారు కె. కోటేశ్వరరావు. అనురాగ్ కొణిదెన, శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోహీరోయిన్లుగా హేమంత్ కార్తీక్ తెరకెక్కించిన చిత్రం 'మళ్ళీ మళ్ళీ చూశా'. కె. కోటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత కోటేశ్వరరావు మాట్లాడుతూ – ''ఒక కథ అనుకొని ఒక నిర్మాతతో నా దగ్గరకు వచ్చాడు అనురాగ్. కొన్ని కారణాల వల్ల ఆ ప్రొడ్యూసర్ ముందుకు రాలేదు. అందుకే నేనే నిర్మించాను. మావాడు చిన్నప్పటి నుంచి అన్నింట్లో చురుకుగా ఉండేవాడు. మాకు ఈ ఫీల్డ్‌తో సంబంధం లేకపోయినా వాడి మీద నమ్మకంతో వచ్చాం. స్టూడెంట్ లైఫ్‌కి సంబంధించిన యూత్‌ఫుల్ కథ ఇది. దర్శకుడు చాలా ఆసక్తికరంగా సినిమాను మలిచారు. ఫ్యామిలీ ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. అందరూ మళ్లీ మళ్లీ చూసేలా మా సినిమా ఉంటుంది. హీరోగా అనురాగ్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందనే నమ్మకం ఏర్పడింది. మా బ్యానర్‌పై వరుసగా సినిమాలు నిర్మించాలనుకుంటున్నాం. రెండు, మూడు కథలు చర్చల్లో ఉన్నాయి'' అన్నారు.







సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
13-10-2019

భాగవత చిత్రణ



**హరిమయము విశ్వమంతయు హరి విశ్వమ యుండు సంశయము పని లేదా హరిమయము గాని ద్రవ్యము పరమాణువు లేదు వంశపావన వింటే!**

చిత్ర వివరణ: శ్రీ శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు చెప్పిన తత్వం ఇది. ఈ విశ్వమంతా విష్ణుమయమే!

విష్ణువు లేని పదార్థం గాని, ఒక్క పరమాణువు గాని ఈ విశ్వంలో ఎక్కడా ఉండదు. అంటే అతడు సర్వాంతర్యామి అని శుకయోగీంద్రుడు పరీక్షిత్తుకు వివరించే సందర్భంలోనిది ఈ పద్యము.

తాళ్లపాక అన్నమాచార్యుల వారు కూడా 'ఎదుట ఎవ్వరు లేరు అంతా విష్ణుమయమే' అనే సంకీర్తనలో కూడా ఇదే విషయాన్ని విశదం చేశారు.

**- డా. చెలికాని మురళీకృష్ణారావు**

# వరాల మేను సిరిమాను

**ఉత్తరాంధ్ర ఇలవేల్పు.. అమ్మల గన్న అమ్మ పైడితల్లి అమ్మవారి పేరిట ప్రతి ఏటా జరుపుకునే అమ్మవారి సిరిమానోత్సవం దేశంలోనే ఎక్కడా జరగని కనీ వినీ ఎరుగని రీతిలో మరలా ఈ ఏడాది జరగనుంది. తొలిసారి రాష్ట్ర పండుగగా జరగనున్న ఈ జాతరవిశేషాలను స్మరించుకున్న ప్రతిసారి భక్తితో తనువు పులకిస్తుంది. అమ్మకు అచేతనంగానే మనసు నమస్కరిస్తుంది. ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా నెల రోజులపాటు జరుపుకునే పైడితల్లి అమ్మవారి జాతరలో ఈ 15న సిరిమానోత్సవం సందర్భంగా...**



విజయనగరం రైల్వేస్టేషన్‌కి సమీపంలో పైడిమాంబ అమ్మవారి ఆలయం వనంగుడి ఉంది. వనం అంటే అడవి కనుక దీన్ని వనంగుడి అన్నారు. దీన్ని అమ్మపుట్టినిల్లుగా భావిస్తారు. ఊరి మధ్యలో చదురుగుడి ఉంది. దీన్ని మెట్టినింటిగా భావిస్తారు. చదురుగుడిలో అమ్మవారికి ఇరువైపులా ఘటాలుంటాయి. దీనిలోని నీటిని అమ్మవారి తీర్థంగా భక్తులు పుచ్చుకుంటారు. ఈ గుడిలోనే రావి, వేప చెట్ల సంగమ వృక్షం ఉంది. దీని మొదట్లో పోతురాజు పూజలందుకుంటూ ఉంటాడు.

**ప్రజల కల్పవల్లి**

విజయనగరంలో అమ్మవారు వెలిసిన నాటి నుంచి ఇక్కడి ప్రజలు కష్టాలే ఎరుగలేదన్న విశ్వాసం గట్టిగా ఉంది. ఏ ఊరిని తుఫాను ముంచెత్తినా, ఏ ఊళ్లో కల్లోలాలు జరిగినా విజయనగరం మాత్రం ప్రశాంతంగా ఉంటుందని ప్రతీతి. ఆ ప్రశాంతతకు కారణం పైడిమాంబయే.. ఆ చల్లనితల్లి ఈ నేలపై కొలువై ఉన్నందు వల్లే ఈ ప్రాంతం ఎప్పుడూ సుభిక్షంగా అలరారుతోందని భక్తుల నమ్మకం. ప్రజలకు అష్టఐశ్వర్యాలను కానుకగా ఇచ్చిన పైడితల్లి అంతకు మించిన పెద్ద కానుకగా ఈ నేలకు శాంతి సామరస్యాలను ప్రసాదించిందని విశ్వాసం.

**బోనాలను తలపించేలా**

సిరిమానోత్సవం ముందురోజు రాత్రి చదురుగుడి వద్ద నుంచి అమ్మవారి ఘటాలను మేళతాళాలతో కోటలోనికి తీసుకువెళతారు. కోటలో ఉన్న రౌండ్ మహల్ వద్దకు వెళ్లిన తర్వాత అమ్మవారి చరిత్రను స్తుతిస్తూ రాగయుక్తంగా పాటలను ఆలపిస్తారు. అక్కడ పూజలు అనంతరం ఘటాలను చదురుగుడి వద్దకు తరలిస్తారు. ఆ గుడి ఎదురుగా ఒక బడ్డీని ఏర్పాటుచేసి అక్కడ ఘటాలను ఉంచుతారు. అనంతరం పూజారి ద్వారా పైడిమాంబ రాబోవు ఏడాదికాలంలో జరిగే



మంచి, చెడులను అమ్మపలుకుతుంది. పంటల విషయంలోనూ, పాడిసంపదలోనూ ఈ ప్రాంతం అభివృద్ధి ఎలా ఉంటుంది, ఎలా జరగబోతుందో కళ్లకు కట్టినట్లు అమ్మ భవిష్యవాణి పలికిస్తుంది. ఉపద్రవాలు వచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తుంది. ఆ భవిష్యత్‌వాణిని వినేందుకు రైతులు అక్కడకు చేరుకుంటారు. ఆ తర్వాత పూజారి ధాన్యపుగింజలను రైతులకు అందజేస్తారు. వాటిని తమపొలాల్లో తొలివేరుగా విత్తుకుంటే ఆ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయనేది రైతుల నమ్మకం. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా వివిధ వేషధారణలతో పట్టణం కళకళలాడుతుంది. ఈ రాత్రంతా భక్తులు జాగారం మాదిరిగా పట్టణంలో కలియ దిరుగుతారు.

**దేశంలో మరెక్కడా జరగని పండుగ**

పెద్దచెరువులో ఆత్మార్పణ చేసుకున్న పైడిమాంబను విగ్రహరూపంలో చెరువు నుంచి బయటకు తీసి గుడిలో ప్రతిష్ఠించినది విజయదశమి తర్వాత వచ్చిన మంగళవారం రోజున అట. అందుకని ప్రతిఏటా విజయదశమి వెళ్లిన తర్వాత వచ్చే తొలి మంగళవారం రోజున అమ్మవారికి సిరిమానోత్సవం నిర్వహిస్తారు. ఇలాంటి ఉత్సవం దేశంలో మరెక్కడా ఉండదు. దాదాపు 50 నుంచి 60 అడుగుల పొడవుండే సిరిమాను (చింత మాను)కు ఆసనం అమర్చి ఆ ఆసనంలో పూజారిని అమ్మవారి ప్రతిరూపంగా కూర్చోబెట్టి చదురుగుడి వద్ద ఉన్న ఆలయం నుంచి కోట వరకూ మూడుసార్లు ఊరేగిస్తారు. సిరిమాను ఊరేగింపు సాగినంత మేరా భక్తులు పారవశ్యంతో అరటి పండ్లు, పూలు, ఇతర ప్రసాదాలను సిరిమాను మీదకు విసురుతూ అమ్మ దీవెనలు అందుకుంటారు. సిరిమాను బయలుదేరుతుందనగా సిరిమానుకు ముందు అమ్మ విగ్రహాన్ని వెలికి తీసిన వలకు గుర్తుగా బెస్తవారి వలను నడిపిస్తారు. సంబరం ప్రారంభానికి ముందు పలువురు ఈటెలను ధరించి పాలధారగా అమ్మ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి డప్పువాద్యాలతో మహారాజ కోట పశ్చిమభాగంవైపు వెళ్లి, కోటశక్తికి



నమస్కరిస్తారు. వీరంతా సైనికులుగా ఆ సమయంలో పనిచేస్తారు. సిరిమాను జాతరలో అంజలి రథానిది ఓ విలక్షణమైన స్థానం. సిరిమానుకు అంజలి ఘటిస్తూ ముందుకు సాగే రథంపై ఐదుగురు పురుషులు ఆరుమూరల నారచీరను, చేతికి వెండి ఆభరణాలను ధరించి సంబరంలో పాల్గొంటారు. స్త్రీ వేషధారణలో ఉన్న వీరంతా అమ్మవారి పరిచారకులకు ప్రతీకలుగా వ్యవహరిస్తారు. వీరంతా అక్షింతలు పట్టుకుని సంబరం జరుగుతున్నంత సేపూ భక్తులపై విసురుతూ ఉంటారు. దానికి ప్రతిగా భక్తులు భక్తిభావంతో అరటిపళ్లను వారిపై విసురుతూ ఉంటారు.

**–బోణం గణేష్,**
సాక్షి, విజయనగరం
ఫొటోలు:డి.సత్యనారాయణ మూర్తి

**కార్యక్రమ వివరాల సిరి**

అక్టోబరు 14, సోమవారం తొలేళ్ల ఉత్సవం, 15, మంగళవారం సిరిమానోత్సవం, 22, మంగళవారం వనంగుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మేళతాళాలతో, బాజాభజంత్రీలతో పెద్దచెరువులో అమ్మవారి ఉత్సవవిగ్రహంతో తెప్పోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తారు. 26, శనివారం వనంగుడి వద్ద నుంచి సాయంత్రం 5.30 గంటలకు దీక్షాపరులు జయ జయ ధ్వానాల మధ్య కలశ జ్యోతులు పట్టుకుని ఉత్సవ విగ్రహంతో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి నుంచి బయలుదేరి చదురు గుడికి చేరుకుంటారు. అక్కడ అమ్మవారికి జ్యోతులు సమర్పించి, ఆలయం ఆవరణలో జరిగే అంబలం పూజలో పాల్గొంటారు. 29, మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహిస్తారు. మరుసటిరోజు అక్టోబరు 30న వనంగుడి ఆవరణలో పూర్ణాహుతి, దీక్షావిరమణలతో పైడితల్లి జాతరమహోత్సవాలు ముగుస్తాయి.



నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

స్త్రీ వైశిష్ట్యం - 12

# మమజీవనహేతునా...



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

''సీతమ్మా! నీ భర్త అంత రాజ్యాన్ని వదిలి పెట్టి అరణ్యవాసానికి వస్తుంటే, ఆయనను అనుగమించి వచ్చేసావు... అలా వస్తుంటే నీ భర్త చేతకానివాడిలా అనిపించలేదా... రాజ్యాన్ని సముపార్జించుకోలేడూ, తండ్రిని ధిక్కరించలేడూ... ఆయన ధర్మానికి కట్టుబడ్డాడని ప్రశంసాపూర్వకంగా వెంట వచ్చావా తల్లీ... ఎంత గొప్పపని అమ్మా నీవు చేసింది...'' అని అనసూయమ్మ(అత్రి మహర్షి భార్య) తమ ఆశ్రమానికి వచ్చిన సీతమ్మతో అన్నది. మెచ్చుకుని భర్తను అనుగమించడం కేవలం గుడ్డితనంగా కాదు. అదేదో అయనది అధికారమనీ కాదు, ఆ భర్త పట్ల గౌరవాన్ని వ్యక్తం చేసింది.



ఒక తండ్రి ఆడపిల్లను కంటాడు. నోములు పట్టిస్తాడు, వ్రతాలు చేయిస్తాడు... మంచి భర్త కోసం. ఆ తరువాత... పెళ్ళయి పోయాక వ్రతాలు పడుతుంది... ఎవరి కోసం? భర్తకోసం, అత్తామామల కోసం, పుట్టింటివారి కోసం... సరే.. మరి తనకోసం??? ఏమీ ఉండదు. వాళ్ళ సుఖమే తన సుఖం. అది ఆడపిల్ల గొప్పతనం. అందుకే స్త్రీ వైశిష్ట్యం వేరు. అదే పురుషుడయితే... ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం... అలా తనకోసం చాలా చెబుతాడు. ఆమెకో!!! తనకోసం అంటూ ఏమీ ఉండదు. ఆయన దీర్ఘాయుష్షుతో ఉండాలి. పిల్లలు బాగుండాలి. అత్తమామలు, అమ్మానాన్నలు, తోబుట్టువులు, ఆడపడుచులు, బావగార్లూ, మరుదులూ బాగుండాలి... మరి నువ్వో... 'అందరూ బాగుండడమే నేను బాగుండడం'... అనుకుంటుంది. అందుకే నెలకు పడే మూడువానల్లో ఒక వాన ఉత్తములయిన స్త్రీల వలన పడుతున్నది అన్నది శాస్త్రం. అటువంటి ఔదార్యం కలిగిన ఆడపిల్లకు తండ్రి పరిమితంగానే ఇస్తాడు. పెళ్ళయ్యేవరకు ఉత్తముడయిన వరుణ్ణి చూస్తాడు. పుట్టింటికి వస్తే పసుపు కుంకుమలు ఇస్తారు.. అలా ఆమెకు రక్త సంబంధీకులు కానీ, బంధుగణం కానీ ఎవరిచ్చినా అది పరిమితమే... ఇంత అని చెప్పడానికి వీలు లేనంత అపరిమితమయిన దాన్ని ఇచ్చేవాడు ఎవరంటే... భర్త ఒక్కడే. కారణం– శాస్త్రంలో ఒక మర్యాదుంది. నేను ఎంత ఐశ్వర్యవంతుడిని అయినా, నేను నా భార్య పాణిగ్రహణం చేయగానే, ఆమె నా పత్ని కాగానే నా ఐశ్వర్యం అంతా ఆమెదయిపోతుంది. నిజానికి నా ఆయుర్దాయం కూడా ఆమె వలన నిర్ణయింపబడుతుంది. ఆమె సౌశీల్యం వల్ల నా ఆయుర్దాయం నిలబడుతుంది. అందుకే 'మమజీవనహేతునా' అని చెప్పి మంగళసూత్రం కడుతున్నారు.

అందుకే అనసూయమ్మ అంటున్నది... ''అమ్మా! భర్త తాను చేసిన పుణ్యంలో సగభాగం భార్యకిస్తున్నాడు. ఆయన ఐశ్వర్యం అంతా ఆమెదే. ఆయన ఆయుర్దాయానికి నేను కర్త. విశేషించి నేను లేని నాడు ఆయనకు ధర్మం లేదు. నేను తల్లినయి అమ్మా అని పిలిపించుకుని ఆనందాన్ని పొందానంటే దానికి కారణం–ధార్మికమైన సంతానాన్ని ఆయన వలన పొందాను కాబట్టి. నేను ఎంత నాసిరకం చీర కట్టినా 'సువాసిని' అని గౌరవించడానికి కారణం– ఆయన ఉండబట్టే. ఇవన్నీ మరెవరి వలనా సంభవించవు... అందువలననే కులకాంతలు, ఉత్తమమైన స్త్రీలను గౌరవిస్తారమ్మా... శాస్త్రం ఎరిగిన వారు.''ఒక్కొక్క మహా పతివ్రత ఈ దేశంలో సూర్యోదయ, సూర్యాస్తమయాలను శాసించింది. రేపు తెల్లవారితే నీ భర్త మరణిస్తాడంటే... ''సూర్యోదయమవకుండు గాక'' అని ఆదేశించింది. ధర్మచక్రం నిలబడిపోయిందంతే. అది ఎన్ని యజ్ఞయాగాది క్రతువులు చేసినా పురుషుడు పొందగలడో లేదో కానీ పతివ్రతాధర్మంతో స్త్రీ సాధించింది.

ఆలయం ఆగమం

# శయనాలయం

దేవీ ఆలయం తర్వాత భక్తులు దర్శించాల్సిన ముఖ్యమైన ప్రదేశం శయనమందిరం. దీన్నే శయనాలయం, అద్దాలమండపం, ఏకాంత సేవామందిరం, పవళింపుసేవా మండపం అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఆగమ పరిభాషలో భోగశక్తి ఆలయం అంటారు.

శయనమందిరాన్ని భక్తులు ఉదయం మేల్కొలుపు సమయంలో... రాత్రి ఏకాంతసేవ సమయంలో ఇలా రోజులో రెండుసార్లు మాత్రమే దర్శించుకోగలరు. ఆలయం తెరిచాక శయనమందిరం వద్దకు వెళ్లి స్వామి అమ్మవార్ల శయనమూర్తులను మేల్కొలుపు చేసి జయజయ ధ్వానాలతో వారిని కీర్తిస్తూ... పల్లకిలో ఆ మూర్తులను వేంచేపు చేసుకుని ఊరేగింపుగా గర్భగుడిలోకి తీసుకొని వెళ్లే ఘట్టం కనిపిస్తుంది. ఆ ఘట్టానికి ప్రధాన సాక్షి ఈ శయనమందిరం. రాత్రి పూజలు పూర్తయ్యాక తిరిగి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ అద్దాల మండపం మధ్యలో అమర్చిన ఊయలపై ఉంచి పవళింపు చేసేది ఈ శయనమందిరంలోనే. కనుక ఇంతటి విశిష్టమైన శయనమందిరాన్ని ప్రతీ భక్తులూ తప్పక దర్శించుకోవాలి. శయనమందిరంలోకి అడుగుపెట్టగానే సువాసనా పరిమళాలు... మధ్యలో ఊయల... చుట్టూ అద్దాలు ఉంటాయి. కొన్ని చోట్ల వెండిమంచం ఉంటుంది. రోజంతా పూజలతో అలసిన స్వామి అమ్మవార్ల విశ్రాంతి కోసం ఈ ఏకాంతసేవ జరుపుతారు.

ఊయలను డోల అంటారు. డోలపై విశ్రాంతి తీసుకొనే స్వామివారిని దర్శించుకుంటే డోలాయమానంగా అంటే ఊగిసలాడుతున్న మన సమస్యలన్నీ చిటికెలో మటుమాయమవుతాయని భక్తుల నమ్మకం.



ఎటు చూసినా అద్దాలు...ఆ అద్దాలన్నింటిలో స్వామివారి ప్రతిరూపం కనిపిస్తుంది. అంటే ఎటుచూసినా దేవుడే... అన్నింటా.. అంతటా నిండి ఉన్నది ఆ దేవుడే అనే సత్యాన్ని అద్దాల ద్వారా తెలియజెప్పుతున్నారు. అలాగే మానవుడు అనేక కోరికలతో దేవుడి దగ్గరికి వస్తాడు. అవి ఒకటో.. రెండో... కాదు... అనేకం. ఆ కోరికలకు ప్రతీకలే ఈ అద్దాలు. ఎన్ని అద్దాలున్నా అందులోని ప్రతిరూపంగా ఉన్న స్వామి వారొక్కరే... అలాగే వాటన్నింటినీ తీర్చేది దైవశక్తి మాత్రమే.

మేల్కొలుపు సేవలో పాల్గొని స్వామివారిని దర్శిస్తే తలపెట్టిన పనిలో విజయం తథ్యమని... ఏకాంతసేవలో పాల్గొంటే దంపతుల మధ్య సఖ్యత... సత్సంతానం కలుగుతుంది.

**–కందుకూరి వేంకటసత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

సువార్త

# దేవుని ప్రేమను చర్చి ప్రత్యక్షంగా కనపర్చాలి

కాకులా? అరవడానికి తప్ప అవెందుకు పనికొస్తాయి? అంటుంది లోకం. కరువులో చిక్కుకున్న నా సేవకుడు ఏలియాను పోషించేందుకు కాకులు నాకు చాలా ఉపయోగకరమైనవి అంటాడు దేవుడు. మనిషి ఆలోచనలకు, దేవుని ఆలోచనలకూ మధ్య ఇంత తేడా ఉంటుంది. కరువులో, కారడవిలోని కెరీతు వాగు దగ్గరి ఒక గుహలో ప్రార్థనాదీక్షలో అజ్ఞాతంగా ఉన్న ఏలియాకు మరి ఆహారమెలా? అని ఆలోచించిన ప్రేమామయుడు దేవుడు. అందువల్ల ప్రవక్తకు దేవుడు ప్రతిరోజూ కాకులతోనే ఆహారం పంపి పోషించాడు ( 1 రాజులు 17:4–6). ఇలా పేదలు. ధనికులు, పండితులు, పామరులన్న వివక్షకు తావులేని సమదృష్టి, సమ న్యాయమున్న దేవుని అనంతమైన ప్రేమను అపొస్తలులు సరిగ్గా ఒడిసిపట్టుకున్నారు కాబట్టే వాళ్ళు స్థాపించిన ఆదిమ చర్చి పేదరికంలో కూడా అత్యంత ప్రభావంతో విస్తరించి దేవునికి మహిమ తెచ్చింది. ఆదిమ కాలంలో చర్చిలన్నీ పేదలు, శరణార్థులైన విశ్వాసుల ఇళ్లలోనే స్థాపించబడ్డాయి, అందువల్ల చర్చి అనేది ఒక అనువైన స్థలమే తప్ప, అందమైన మహా కట్టడం కాదు. అయితే దేవుని సహజ స్వభావమైన సార్వత్రిక ప్రేమ, సమన్యాయం, సమదృష్టికి దూరంగా, విరుద్ధంగా నడిచే ఏ చర్చి, పరిచర్య, విశ్వాస జీవితమైనా అది దైవవ్యతిరేకమైనదే. యేసు పరలోకారోహణ తర్వాత ఆనాడు మేడగదిలో వినూత్న విశ్వాసుల సమక్షంలో, వాళ్ళే సభ్యులుగా ఆవిర్భవించిన 'చర్చి' దేవుని అద్భుతమైన ప్రేమకు మరో సాదృశ్యం, సాధనం కూడా. అందుకే యేసుప్రభువు ప్రేమను భూదిగంతాలకు వెళ్లి ప్రకటించాలన్న దేవుని మహాభీష్టాన్ని నెరవేర్చే విశ్వాససమూహమైన చర్చికి యేసు ప్రభువే శిరస్సని పౌలు తన పత్రికల్లో వర్ణించాడు. చర్చికి దేవుడిచ్చిన విశిష్టమైన స్థానమిది.



అయితే రాను రానూ బాహ్యసౌందర్యానికి, సంఖ్యాబలానికే ప్రాముఖ్యతనిచ్చిన కారణంగా కాపరులకు, చర్చి సభ్యులకు మధ్య అసలు సంబంధమే లేని మెగా చర్చిలు ఆవిర్భవించాయి. చర్చి కాపరి, చర్చిలో విశ్వాసులతోనే నివసిస్తూ ఒక తండ్రిగా, దేవుని ప్రేమ మూర్తీభవించిన ఒక నిస్వార్థ నాయకుడుగా, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకునే ఆప్తుడని అర్థం. ఆదిమ అపొస్తలులు అలాగే ఉన్నారు అందుకే చర్చి ద్వారా దేవుని ప్రేమ భూదిగంతాలకు పాకింది. అయితే చర్చి భవనాలు గొప్పగా నిర్మించి తాము కూడా చాలా గొప్పవాళ్లమనిపించుకోవాలన్న పరిచారకుల దురాశయం కారణంగా, మెగా చర్చిలు ఏర్పడ్డాయి. కానీ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, నిరాశ్రయులను, నిరుపేదలను ఆదరించడమే నిజమైన క్రైస్తవమనే సత్యం మాత్రం పూర్తిగా మరుగున పడింది (మత్తయి 25: 35,36). ధనార్జనే ధ్యేయం గా, చివరికి బైబిల్‌లోని దశమభాగం సూత్రాన్ని వక్రీకరించి, నిరుపేదల నుండి కూడా ముక్కుపిండి డబ్బు వసూలు చేసే సుంకరుల్లాంటి కాపరుల తరంలో చర్చి వ్యాపార కేంద్రంగా మారింది. ఒక్క చర్చి కోసం పడే శ్రమతోనే, వంద చర్చిల కానుకల్ని రాబట్టాలన్న వ్యాపారపు కాసుల గోలే తప్ప, విశ్వాసుల సంక్షేమమే పట్టని ఇలాంటి 'చర్చి'కి యేసు శిరస్సు ఎలా అవుతాడు? దేవుడే విశ్వాసులతో పాటు ఉండాలనుకొని తనను తాను 'ఇమ్మానుయేలు' అంటే 'దేవుడు మనకు తోడు' అని పిలిపించుకోగా, విశ్వాసులకు దూరంగా ఉండాలనుకునే బోధకుడు ఆ దేవుని ప్రతినిధి ఎలా అవుతాడు? మంచి కాపరి తన గొర్రెల కోసం ప్రా ణం పెడతాడని యేసుప్రభువన్నాడు (యోహాను 10:11). అలాంటి ప్రభువు దృష్టిలో ఈ కాపరులు ఏమవుతారు? కాకులు కూడా నాకు కావాలనుకున్న దేవుని ప్రేమ ఎక్కడ? ఎంతటి విశ్వాసులైనా నాకు వాళ్ళక్కర్లేదు. వాళ్ళిచ్చే కాసులు, నాకొచ్చే పేరే నాకు ముఖ్యం అనుకునే ఈ చర్చిలు, కాపరులెక్కడ?

**–రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**
సంపాదకులు, **ఆకాశధాన్యం**

పండుగ పర్వం



**రామాయణమనే రసవత్తరమైన, ఆదర్శప్రాయమైన, అజరామరమైన మహా కావ్యాన్ని భారతీయులకు వారసత్వ సంపదగా అందించిన ఆదికవి వాల్మీకి. 24,000 శ్లోకాలతో కూడిన రామాయణ గాథ భారతీయుల సంస్కృతి, నడవడిక, నమ్మకాలు, ఆచారాలపై ఎనలేని ప్రభావం చూపింది. తండ్రీకొడుకులు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, యజమాని-సేవకులు, మిత్రులు, రాజు-ప్రజలు, భగవంతుడు-భక్తుడు - వీరందరి మధ్య గల సంబంధ బాంధవ్యాలు, ప్రవర్తనా విధానాలను తన కావ్యం ద్వారా చక్కగా చెప్పిన వాల్మీకి చిరస్మరణీయుడు. రామాయణంలోని ఉత్తరకాండలో వాల్మీకి పూర్వాశ్రమ జీవితం గురించి తెలుస్తుంది.**

**(నేడు వాల్మీకి జయంతి)**

# జీవిత సత్యం

ఓ ముగ్గురు స్నేహితులు పర్యటన నిమిత్తం విదేశాలకు వెళ్ళారు. అక్కడ ఒక పెద్దహోటల్‌లో 75 వ అంతస్తులో రూమ్ బుక్ చేసుకున్నారు. ఆ హోటల్ నిబంధనల ప్రకారం రాత్రి పదకొండు గంటలకల్లా రూంకు చేరుకోవాలి. పదకొండు దాటితే లిఫ్ట్ పనిచేయదు. ఈవిషయం తన కస్టమర్లకు ముందుగానే చెప్పారు హోటల్ నిర్వాహకులు. ఆలస్యంగా వచ్చిన వాళ్ళు పై అంతస్తులకు వెళ్ళాలంటే చుక్కలు చూడాల్సిందే. మొదటిరోజు ముగ్గురు స్నేహితులూ సమయానికే చేరుకున్నారు.కాని రెండవ రోజు కాస్తంత ఆలస్యమైంది. వచ్చేసరికి లిఫ్ట్ కు తాళంవేసి ఉంది. ఏంచెయ్యాలో అర్థం కాలేదు. 75 అంతస్తులంటే మాటలా? అయినా చేసేదేమీ లేదు. గదికి వెళ్ళాలంటే కాళ్ళకు బుద్ధిచెప్పాల్సిందే.

అలసట తెలియకుండా ఉండడం కోసం ఒక స్నేహితుడు సరదాగా ముచ్చట్లు, కథలు చెప్పడం ప్రారంభించాడు. అలా సరదాగా ఆడుతూ పాడుతూ పాతిక అంతస్తులు సునాయాసంగా అధిగమించారు. తరువాత రెండవ స్నేహితుడు బంధాలు, బాధ్యతలకు సంబంధించిన వాస్తవగాథలు వినిపిస్తుండగా మరో పాతిక అంతస్తులు అధిగమించారు. ఇక చివరి పాతిక అంతస్తులు మిగిలాయి. మూడవ స్నేహితుడు బాధలు, కష్టాలు, కడగండ్లకు సంబంధించిన కథలు, జీవన సత్యాలను విడమరిచి చెబుతుంటే, వాటిని జీర్ణించుకోడానికి ప్రయత్నిస్తూ, పడుతూ లేస్తూ, ఆపసోపాలు పడుకుంటూ ఎలాగోలా తమ గదివరకూ చేరుకున్నారు. తీరా పైకి వెళ్ళిన తరువాత గదితాళాలు కింద వాహనంలోనే మరచి వచ్చామన్నసంగతి గుర్తొచ్చింది వారికి.

ఖచ్చితంగా ఇలానే ఉంది ఈనాటి మన పరిస్థితి. మన జీవితకాలంలోని మొదటి ఇరవై పాతిక సంవత్సరాలు బాల్యం,



యవ్వనం, చదువు, ఆట పాటల్లోనే గడిచిపోతోంది. మిగతా పాతిక సంవత్సరాలు కుటుంబం, ఉద్యోగం, వ్యాపారం, బంధాలు, బాధ్యతలతో గడిచి పోతోంది. ఇక మిగిలిన పాతిక సంవత్సరాలు బాధలు, నొప్పులు,

ఇస్లాం వెలుగు

వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యలతో జీవితం భారంగా గడుస్తోంది. చివరికి గమ్యానికి చేరుకునే సరికి ఏమీ మిగలడం లేదు. రిక్తహస్తాలతోనే సమాధికి చేరిపోతున్నాం.

అప్పుడుగాని అసలు విషయం గుర్తుకు రావడం లేదు. ప్రాపంచిక జీవనవ్యామోహంలో పడి సత్కర్మలు అనే తాళం చెవులు మరిచిపోయి వచ్చామని. అసలు వెంట తేవలసిన వాటినే తీసుకురాలేదని. మరలా వెనక్కి వెళ్ళడానికి, వెళ్ళి తీసుకురావడానికి అవకాశమే ఉండదు.

అయినప్పటికీ కొంతమంది అడుగుతారట.. 'ప్రభూ.. మాకు మరొక్కసారి అవకాశాన్ని ప్రసాదించు. మమ్మల్ని ఇహలోకానికి పంపు. మేము ఎలాంటి తలబిరుసు తనానికి పాల్పడకుండా, నువ్వుచెప్పినట్లే నడుచుకుంటాము.' అని మొరపెట్టుకుంటారట. కాని వారికి అలాంటి అవకాశమే ఇవ్వబడదు. అందుకని చావుపుట్టుకల మధ్య ఉన్నటువంటి ఈ జీవన వ్యవధిని సద్వినియోగం చేసుకుంటూ సత్కర్మలు ఆచరించడానికి ప్రయత్నించాలి. సమాధికి చేరడానికి ముందే తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

గురు సన్నిధి

దేనినైతే 'నేను' అని చెబుతున్నామో దాన్ని తెలుసుకోవడమే ఆత్మజ్ఞానం. యోగసాధనతో అటువంటి ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తులు ఉన్నతస్థాయి ప్రజ్ఞా పాటవాలను చేరుకోగలరు. ఈ కోవకు చెందిన వారు శ్రీ శ్రీ శ్రీ అఖండానంద సరస్వతీ స్వామి. వీరు అద్వైత తత్వానికి ప్రతీకగా పేరుపొందిన ఆచార్యేంద్రులు.

# అఖండానంద సరస్వతీ స్వామి



**యుగపురుషులు**

శ్రీ అఖండానంద సరస్వతీ స్వామివారు ఇరవయ్యవ శతాబ్దపు గొప్ప ప్రవచనకారులేగాక, వేదాంతశాస్త్రాల పండితులు కూడా. బ్రహ్మానుభూతి, రాసపంచాధ్యాయీ, శ్రీ కృష్ణ లీలారహస్యం తదితర గ్రంథాలు రచించి భక్తితత్వాన్ని విరివిగా ప్రచారం చేసారు. వీరి ప్రజ్ఞాపాటవాలు తెలిసిన వారంతా వీరిని 'రాజర్షి' అని పిలిచేవారు.

**సాక్షాత్ శుకబ్రహ్మ!**

భక్తి సాహిత్యంలో భాగవతం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుని భక్తికి మారు పేరుగా నిలచింది. అటువంటి భాగవతాన్ని వీరు వివిధ వ్యాఖ్యానాలతో, అనేక ఉదహరణలతో చెబుతుంటే 'సాక్షాత్తూ శుకమహర్షియే చెబుతున్నాడా' అనేట్టుగా సాగిపోయేది వాగ్ధాటి. ఈనాటికీ భాగవత ప్రవచనకారులు వీరి మార్గంలో భాగవతాన్ని బోధించేందుకు ఆరాటపడుతుంటారు.

**సత్త్వభక్తి**

భాగవతసారాన్ని కాచివడపోసి వీరు ఉపదేశించే మాటలు నిత్యసత్యాలు.

నిండు విశ్వాసంతో, సర్వం భగవదర్పణంగా, లోకక్షేమం చేకూర్చుతూ తెలియక చేసిన పాపాల ప్రక్షాలన కోసం ఆచరించెడిది సత్త్వభక్తి అని ఇదే ఆచరణీయమని బోధించారు.

**ఆశ్రమం-త్రివేణి సంగమం'**

బృందావనంలో శ్రీ అఖండానంద స్వామి వారు స్థాపించిన 'ఆనందబృందావన ఆశ్రమం' కర్మ, భక్తి, జ్ఞానములనే మూడింటి సంగమంలాగా ఉంటుంది. ఇక్కడ ఒక పాఠశాల, లైబ్రరీ, ఉచిత వైద్య కేంద్రం ఏర్పాటు చేయబడ్డాయి. అవసరమైన వారందరికీ ఆశ్రమం ద్వారా నిరంతరసేవలు అందుతుంటాయి.

**–అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని**
వేదపండితులు

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
ఆదివారం
13-10-2019



ఆఫ్‌బీట్ కెరీర్

# క్రికెట్ కామెంటరీ

**క్రికెట్ అభిమానులకు భారత్ పెట్టింది పేరు. భారత టీం మ్యాచ్ ఆడుతుందంటే జనాలు కాలేజీలు, ఆఫీసులు, మీటింగ్‌లన్నీ బంక్ కొట్టాల్సిందే. కోట్ల మంది టీవీకి అతుక్కుపోవడం పరిపాటే. ప్లేయర్ల ఆటతీరు పక్కన పెడితే.. ప్రేక్షకుల్లో మ్యాచ్ పట్ల అమితాసక్తిని రగిల్చేది క్రికెట్ కామెంటేటర్లే. బ్యాట్స్‌మన్ గాల్లోకి కొట్టిన బంతి బౌండరీ దాటుతుందా! లేదా ఫీల్డర్ ఒడిసిపడతాడా!! అనే విషయాన్ని కళ్లకు కట్టినట్లు ప్రేక్షకులకు వివరిస్తారు కామెంటేటర్లు. ఆటకు అదనపు హుషారు కామెంటరీ. ప్రేక్షకులను ఆటలో మరింత లీనం చేస్తుంది కామెంటరీ. 'వాట్ ఎ షాట్', 'ఇన్ ది ఎయిర్', 'దట్స్ ఎ హ్యూజ్ ఇట్' వంటి కామెంట్లు ప్రేక్షకులను మరింత ఉల్లాసపరిచి.. ఆటను ఆసాంతం ఆస్వాదించేలా చేస్తాయనడం సందేహం లేదు. ఆఫ్‌బీట్ కెరీర్‌గా మారుతున్న క్రికెట్ కామెంటేటర్ కెరీర్‌పై ప్రత్యేక కథనం...**

» యువతను ఆకర్షిస్తున్న కామెంటరీ కెరీర్
» ఆటపై అవగాహన+ మాటకారితనం ముఖ్యం

రాబోయే రోజుల్లో క్రికెట్‌కు మరింత ఉజ్వల భవిష్యత్తు ఖాయం. వివిధ లీగ్‌ల పేరిట అధికారిక టోర్నీలు, అనధికార మ్యాచ్‌లు ఇప్పుడు పరిపాటి. వీటికి తోడు ఇటీవల స్థానికంగా ప్రతిభావంతులను వెలికితీసే లోకల్ టోర్నీలు సైతం తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మొదలయ్యాయి. బీసీసీఐ, ఆల్ ఇండియా రేడియో మధ్య జరిగిన అవగాహన మేరకు రేడియోలోనూ క్రికెట్ కామెంటరీ మళ్లీ ప్రసారం కానుంది. ఇది దేశం నలుమూలల ఉన్న లక్షల మంది క్రికెట్ అభిమానులను అలరిస్తుందని చెప్పొచ్చు. క్రికెట్ కామెంటరికీ ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో ప్రతిభావంత కామెంటేటర్లకు డిమాండ్ ఏర్పడింది. ఇటీవల కాలంలో ప్రాంతీయ భాషల్లోనూ కామెంటరీ చెబుతున్నారు. రకరకాల డిజిటల్ వేదికలపై కామెంటేటర్లకు అవకాశాలు లభిస్తున్నాయి. కామెంటేటర్ అవతారం ఎత్తాలంటే.. ఎలాంటి నైపుణ్యాలు ఉండాలి.. కామెంటరీ కెరీర్ ఎవరికి సూట్ అవుతుంది.. అవసరమైన అర్హతలేంటి తదితరాల గురించి తెలుసుకోవడం ముఖ్యం.




### స్వీయ ప్రతిభ

క్రికెట్ కామెంటేటర్‌గా రాణిస్తున్న వారిలో అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రికెట్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉన్నవారే ఎక్కువ. క్రికెట్ ఆడిన అనుభవంలేని వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు రావడం కష్టమనే అభిప్రాయముంది. అయితే ఆటపై అవగాహనతోపాటు వ్యక్తిగత నైపుణ్యాలుంటే.. కామెంటేటర్‌గా రాణించడం పెద్ద కష్టమేమీ కాదు. హైదరాబాద్‌కు చెందిన హర్ష భోగ్లే ప్రస్తుతం అత్యంత ప్రేక్షక ఆదరణ పొందిన కామెంటేటర్. అతనికి రంజీ వరకు క్రికెట్ ఆడిన అనుభవం లేదు. అయినా క్రికెట్ సబ్జెక్టుపై రాటుదేలి, అద్భుతమైన అనలిటికల్ స్కిల్స్‌తో చక్కటి కామెంటేటర్‌గా పేరొందాడు. స్వయం కృషితో ఎదిగిన కామెంటేటర్ హర్షభోగ్లే. అతను విసిరే చలోక్తులు హాస్యం పండించడంతోపాటు ప్రేక్షకులను ఆలోచింపచేస్తాయి. కాబట్టి స్వీయ ప్రతిభ ఉన్నవారికి క్రికెట్ కామెంటరీ చక్కటి ఆఫ్‌బీట్ కెరీర్‌గా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

### ఆ కోర్సులతో మేలు

ప్రత్యేకంగా కామెంటేటర్ సంబంధిత కోర్సులు అందుబాటులో లేవు. అయితే స్పోర్ట్స్ జర్నలిజం, మాక్ మీడియా కోర్సులు పూర్తిచేస్తే కామెంటేటర్‌గా రాణించడానికి అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలు అలవడతాయి. వీటితోపాటు యాంకరింగ్, రేడియో జాకీ లాంటి మీడియా కోర్సులు కూడా కామెంటేటర్ సంబంధిత కెరీర్ కోవకు చెందినవే. అలానే విశ్లేషణా నైపుణ్యాలు అందించే ఎంబీఏ పట్టా పొందటం వల్ల కెరీర్ ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

### టాకెటివ్‌నెస్

టీవీ చూసేటప్పుడు ప్రేక్షకులు కోరుకునే వినోదం లేకపోతే వారు చానెల్ మార్చేస్తారు. క్రికెట్ గురించి కామెంటరీ చెప్పేటప్పుడు సబ్జెక్టుకు సంబంధించిన సాంకేతిక పదాలు ఉపయోగిస్తూ సగటు ప్రేక్షకుడికి అర్థమయ్యేలా మాట్లాడాలి. మ్యాచ్ డల్‌గా నడుస్తున్నప్పుడు ఆడియన్స్ చానల్ మార్చకుండా ఆపడంలో కామెంటేటర్ ప్రతిభ కీలకం. ఆటలో, నిబంధనల్లో జరిగే మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. ప్రభావవంతంగా విశ్లేషించడం అలవాటు చేసుకోవాలి. అంతేకాకుండా ప్రతి ఒక్కరు తమకంటూ ప్రత్యేకశైలిని ఏర్పరచుకొని గుర్తింపు పొందటం ముఖ్యం.

### నాలెడ్జ్

కామెంటేటర్ కెరీర్‌కు ఏకధాటిగా మాట్లాడటం, చక్కగా విశ్లేషణ చేయడంతోపాటు క్రికెట్ నాలెడ్జ్ ఉండాలి. వేర్వేరు టోర్నమెంట్స్, మ్యాచ్‌లు జరుగుతుంటాయి. కాబట్టి ఆయా ఆటగాళ్ల నేపథ్యం గురించి తెలుసుకోవాలి. కీలక ఘట్టాల గణాంకాలపై అవగాహన పెంచుకోవాలి. గతంలో ఆయా ఆటగాళ్లు ఆడిన మ్యాచ్‌ల తేదీలు, వారి ప్రదర్శనను ఇట్టే చెప్పగలగాలి. అలాగే, ఉచ్చారణ, సంస్కృతి, వాయిస్ పిచ్‌ను సందర్భానుసారంగా పెంచడం, తగ్గించడం కూడా ముఖ్యమే. 2007లో భారత ఆటగాడు యువరాజ్ సింగ్ ఇంగ్లాండ్‌పై 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టిన సందర్భంలో వినిపించిన కామెంటరీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడం మనందరికీ తెలిసిందే.

### భాష మీద పట్టు

భాష మీద బాగా పట్టు ఉన్నవారే కామెంటేటర్‌గా స్థిరపడగలరు. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే గ్లోబల్ వేదికగా అవకాశాలు మెరుగవుతాయి. ఇంగ్లిష్ కామెంటరీ ద్వారా పెద్ద సంఖ్యలో ప్రేక్షకులకు చేరువకావచ్చు. మంచి కామెంటేటర్‌గా ఎదగడానికి ఇంగ్లిష్ భాషను సులభంగా, అవలీలగా మాట్లాడే స్కిల్ ఉండాలి. ఇటీవల కాలంలో తెలుగులోనూ కామెంటరీ పెరిగింది. డిజిటల్ వేదికలు, తెలుగు చానల్స్ కామెంటరీ ప్రారంభించాయి. వీటిల్లో రేడియో జాకీలుగా పనిచేసిన వారికి అవకాశాలు లభిస్తున్నాయి.

### వేతనాలు ఆకర్షణీయం

నైపుణ్యాలున్న క్రికెట్ కామెంటేటర్ల సంఖ్య చాలా తక్కువ. కాబట్టి జాబ్ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే కామెంటేటర్ అనుభవం, నైపుణ్యాన్ని బట్టి వేతనం లభిస్తుంది. స్కిల్ ఉంటే ఆకర్షణీయ వేతనాలు అందుకునే వీలుంది. రోజు లెక్కల ప్రకారం, మ్యాచ్‌ల ఆధారంగా పే ఉంటుంది. కనిష్ఠంగా రూ.2 లక్షలు –రూ.3 లక్షల నుంచి జీతభత్యాలు మొదలవుతాయి. అనుభవం, గుర్తింపుతో రూ.10 లక్షలకు పైనే వార్షిక జీతభత్యాలు లభించే అవకాశం ఉంది.

### మాటే మంత్రం

కామెంటేటర్ కావాలంటే క్రికెట్ ప్రాథమిక అంశాలపై అవగాహన తప్పనిసరి. రంజీ వరకు కాకున్నా.. లీగ్ క్రికెట్, కాలేజీ లెవల్ వరకు అయినా క్రికెట్ ఆడి ఉండాలి. ఇంగ్లిష్ లేదా తెలుగు భాషపై పట్టుతోపాటు మాటకారితనం అవసరం. ఆటమీద సంపూర్ణమైన అవగాహనతోపాటు దాన్ని వ్యక్తపరిచే నైపుణ్యం ఉండాలి. అంతేకాకుండా గలగలగా, విట్టీగా మాట్లాడే వారికి కామెంటేటర్ కెరీర్ సెట్ అవుతుంది. స్టార్‌స్పోర్ట్స్, సోనీ లివ్, జియో టీవీ.. డిజిటల్ హక్కులు తీసుకొని తెలుగులో మొబైల్ ద్వారా మ్యాచ్‌లు ప్రసారం చేస్తున్నాయి. అలాగే ఆల్ ఇండియా రేడియోలో సైతం తెలుగులో కామెంటరీ ఇచ్చే అవకాశం ఉంది. దీనివల్ల తెలుగులోనూ అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రాంతీయ భాషల్లో వ్యాఖ్యానికి ఆదరణ పెరుగుతున్నట్లు చెబుతున్నారు. హిందీ భాష తర్వాత తెలుగు ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. అలాగే, కామెంటేటర్స్‌లోనూ లీడ్ కామెంటేటర్స్, ఎక్స్‌పర్ట్ కామెంటేటర్స్ అని రెండు రకాలుగా ఉంటారు. లీడ్ కామెంటేటర్స్ మ్యాచ్ పరిచయం, అతిథుల ఇంటర్వ్యూలు వంటి పనులు చేస్తుంటారు. ఎక్స్‌పర్ట్ కామెంటేటర్స్ క్రికెట్ టర్మినాలజీపై దృష్టి పెడతారు. ఒక ఆటగాడు ఔట్ అయినప్పుడు రీప్లేలో దాన్ని టెక్నికల్‌గా వివరిస్తారు. మన దగ్గర కామెంటేటరీ కోర్సులు అందుబాటులో లేవు. కానీ స్టార్‌స్పోర్ట్స్ వంటి చానల్స్ సొంతంగా శిక్షణ ఇస్తున్నాయి. సెలబ్రిటీ క్రికెట్స్, లోకల్ లీగ్స్ వల్ల కామెంటరీ అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

**సీహెచ్ వెంకటేష్,**
స్పోర్ట్స్ రైటర్, కామెంటేటర్.

---

# విద్యా బోధనలో టెక్నాలజీ

గెస్ట్ కాలం

'ప్రస్తుతం విద్యా విధానంలో మార్పులు తేవడం ఎంతో అవసరం. ఇందుకోసం ఎప్పటికప్పుడు వీటికి సంబంధించి సమీక్షలు నిర్వహించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమిక విద్య నుంచే టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి అనుగుణంగా విద్యా సంస్థలు సదుపాయాలు కల్పించాలి' అంటున్నారు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఛైర్ పర్సన్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి అనితా కర్వాల్. ఎంహెచ్ఆర్‌డీలో పాఠశాల విద్యకు సంబంధించిన విధానాల అమలులో విశేష అనుభవం గడించి.. ప్రస్తుతం సీబీఎస్ఈ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అనితా కర్వాల్‌తో ఈ వారం గెస్ట్‌కాలమ్...

### నూతన విద్యా విధానం.. అన్ని వర్గాలకు మేలు

నూతన విద్యా విధానం ముసాయిదాలో పేర్కొన్న సిఫార్సులను పరిశీలిస్తే.. ఇవి పాఠశాల స్థాయి నుంచి ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ వరకు.. అన్ని వర్గాలకు మేలు చేసే విధంగానే ఉన్నాయి. ముఖ్యంగా ఆర్‌టీఈ పరిధిని విస్తరించడం మొదలు టీచర్లకు శిక్షణ, ఉన్నత విద్యలో నిరంతర పర్యవేక్షణ, నియంత్రణ వంటి అంశాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం.

### వృత్తి విద్య

ప్రస్తుతం వృత్తి విద్యకు ప్రాధాన్యం పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీబీఎస్ఈ వృత్తి విద్యను అందించే చర్యలకు శ్రీకారం చుట్టింది. సెకండరీ, సీనియర్ సెకండరీ స్థాయిల్లో స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను అందిస్తున్నాం. ముఖ్యంగా సీనియర్ సెకండరీ స్థాయిలో.. పలు రంగాలకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం, ప్రాక్టికల్ అవగాహన కల్పించేలా దాదాపు 40కు పైగా స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టాం.

### ఉపాధ్యాయులకు శిక్షణ

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. కాబట్టి టీచర్లు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. అందుకే సీబీఎస్ఈ ఆధ్వర్యంలో టీచర్లకు వర్క్‌షాప్స్, సెమినార్స్ నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా దేశవ్యాప్తంగా 10 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయులు టెక్నాలజీ ఆధారిత టీచింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం తగిన శిక్షణ పొందాలి.

### పాఠశాల విద్యలో ఐసీటీ

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమిక విద్య నుంచే ఐసీటీ (ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) విధానం అమలు చేయడం చాలా అవసరం. పాఠశాల విద్యలో ఇది ఒక అంతర్గత భాగంగా ఉండాలి. కానీ నేటికీ ఐసీటీ గురించి చాలా మంది పెద్దగా పట్టించుకోవట్లేదు. సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల్లో మాత్రం ఐసీటీ ఆధారిత విద్యను తప్పనిసరిగా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఐసీటీ సమర్థంగా అమలు కావాలంటే.. మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.



**అనితా కర్వాల్,**
సీబీఎస్ఈ ఛైర్ పర్సన్

### అవకాశాల గురించి అవగాహన

సీనియర్ సెకండరీ, +2 తర్వాత అధిక శాతం మంది విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడిసిన్ గురించి మాత్రమే తెలుసు. వాస్తవానికి ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ అవకాశాలున్నాయి. వీటిని విద్యార్థులకు తెలియజేసేలా సీబీఎస్ఈ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ సదుపాయాన్ని కల్పిస్తున్నాం. అదే విధంగా కాలేజీ గైడ్ పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చాం. ఇందులో +2 తర్వాత అందుబాటులో ఉండే అన్ని రకాల కోర్సులు, వాటిని అందిస్తున్న సంస్థల వివరాలు పొందుపరిచాం. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

### పొరపాట్లకు తావు లేకుండా

ఇటీవల కాలంలో సీబీఎస్ఈ పేపర్ మూల్యాంకనలో పొరపాట్లపై నిరసనలు జరిగిన మాట వాస్తవమే. భవిష్యత్తులో ఇలాంటివి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు మూల్యాంకన చేయాల్సిన పేపర్ల సంఖ్యను తగ్గించాలనే ఆలోచనలో ఉన్నాం. దీనివల్ల ఎవాల్యుయేటర్స్‌పైన పని భారం తగ్గుతుంది. ఫలితంగా ప్రతి ఆన్సర్ షీట్‌ను క్షుణ్నంగా పరిశీలించి.. సరైన విధంగా ఎవాల్యుయేషన్ చేయడానికి ఆస్కారం ఉంటుంది.

### స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు

ప్రతి స్కూల్‌లోనూ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఒకరైనా ఉండాలి. దీనివల్ల దివ్యాంగ విద్యార్థులకు ఇతరులతో సమానంగా బోధన అవకాశాలు లభిస్తాయి. ఈ విధానాన్ని సీబీఎస్ఈ ఇప్పటికే అమలు చేస్తోంది. రాష్ట్రాల స్థాయిలోనూ పాఠశాలల్లో ఇలాంటి విధానం తప్పనిసరి చేయడం వల్ల ప్రత్యేక సామర్థ్యాల విద్యార్థులకు మేలు జరుగుతుంది. టీచర్లు విద్యార్థులకు అకడమిక్‌గా, కెరీర్ పరంగా కౌన్సెలర్లుగానూ వ్యవహరించాలి. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా వారికి అందుబాటులో ఉండే భవిష్యత్తు అవకాశాల గురించి తెలియజేయాలి.

### యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్

విద్యార్థులకు ఏ అంశంలో ఆసక్తి ఉందో తెలుసుకోవడానికి ప్రధాన మార్గం యాక్టివిటీ బేస్డ్ టీచింగ్. దీన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలి. ఫలితంగా విద్యార్థులు ఏ సబ్జెక్ట్‌లకు సంబంధించిన యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొంటున్నారో తెలుస్తుంది. ఫలితంగా వారికి నిజంగా ఏ సబ్జెక్ట్‌పై ఆసక్తి ఉందో అంచనా వేయడానికి వీలవుతుంది.

### మార్పులు సహజం

ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రంగాల్లో మార్పులు జరగడం సహజంగా మారింది. వీటి గురించి ఆందోళన చెందకుండా.. మార్పులకు అనుగుణంగా నైపుణ్యం పొందాలి. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో మార్పులకు సంబంధించి వార్తలు వస్తున్న మాట నిజమే. అయితే సివిల్స్ స్థాయి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మార్పులకు ఆందోళన చెందడం సరికాదు!!

***

---



ఎంబీఏ స్పెషల్

» టాప్ 10లో ఏడు యూఎస్ ఇన్‌స్టిట్యూట్స్
» టాప్ 100లో మూడు భారత బిస్కూల్స్‌కు చోటు

## క్యూఎస్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్ 2020

# అమెరికా బీస్కూల్స్ హవా

**క్యూఎస్ వరల్డ్ గ్లోబల్ ఫుల్‌టైమ్ ఎంబీఏ ర్యాంకింగ్స్-2020 విడుదలయ్యాయి. ఇందులో స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ, వార్టన్ బిజినెస్ స్కూల్స్‌కు మొదటి ర్యాంకు లభించింది. స్టాన్‌ఫోర్డ్ వరుసగా రెండోసారి ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. మొత్తంగా ర్యాంకింగ్స్‌లో యూఎస్ ఇన్‌స్టిట్యూట్ల హవా కొనసాగింది. ఈ నేపథ్యంలో.. ఎంబీఏ అభ్యర్థులకు ఉపయోగపడేలా అంతర్జాతీయంగా టాప్ 10 ర్యాంకులు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లతో పాటు ర్యాంకింగ్స్‌లో భారత బీస్కూల్స్, ర్యాంకింగ్ ప్రామాణికాలపై ప్రత్యేక కథనం...**

| టాప్ 10 ఇన్‌స్టిట్యూట్ | ర్యాంకు |
|---|---|
| స్టాన్‌ఫోర్డ్ | 1 |
| ది వార్టన్ స్కూల్ | 1 |
| ఇన్‌సీడ్(సింగపూర్) | 3 |
| మిట్(సోలన్) | 3 |
| హార్వర్డ్ | 5 |
| లండన్ బిజినెస్ స్కూల్ | 6 |
| హెచ్ఈసీ పారిస్ | 7 |
| చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ | 8 |
| యూసీ బెర్కలీ | 9 |
| నార్త్ వెస్ట్రన్ వర్సిటీ (కెల్లాగ్ మేనేజ్‌మెంట్ స్కూల్) | 10 |

### అమెరికాదే హవా

ఫుల్‌టైమ్ ఎంబీఏ కోర్సుల పరంగా అమెరికా ఇన్‌స్టిట్యూట్లు సత్తా చాటాయి. టాప్ 100లో ఏకంగా 50 శాతం బీస్కూల్స్ ఆ దేశం నుంచే ఉండటం గమనార్హం. అంతేకాకుండా టాప్10లో ఏడు యూఎస్ ఇన్‌స్టిట్యూట్లకు చోటు దక్కింది. యూకే నుంచి టాప్ 100లో పది, ఫ్రాన్స్ నుంచి ఆరు (టాప్10లో రెండు) బీస్కూల్స్‌కు స్థానం లభించింది.

### ఆసియా

సింగపూర్‌లోని ఇన్‌సీడ్ క్యాంపస్ మొత్తంగా మూడో స్థానంలోనూ, ఆసియా విభాగంలో మొదటి స్థానంలోనూ నిలిచింది. దీని తర్వాత స్థానాల్లో షాంఘైలోని సీఈఐబీఎస్(25), మెల్‌బోర్న్ యూనివర్సిటీ(26), సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ(32)లు నిలిచాయి.

### భారత బీస్కూల్స్

భారత్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంలు) ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. దేశీయంగా ఐఐఎం అహ్మదాబాద్ టాప్‌లో నిలిచింది. ఐఐఎం-ఎ గతేడాదితో పోల్చితే ఎనిమిది స్థానాలు మెరుగుపరుచుకుంది. ఐఐఎం బెంగళూరు ఏకంగా 27 స్థానాలు ఎగబాకడం విశేషం. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) రెండు స్థానాలను మెరుగుపరచుకుంది.

| ఇన్‌స్టిట్యూట్ | ర్యాంకు |
|---|---|
| ఐఐఎం అహ్మదాబాద్ | 40 |
| ఐఐఎం బెంగళూరు | 44 |
| ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ | 98 |
| ఐఐఎం కలకత్తా | 101–110 |
| ఎస్‌పీ జైన్ ఐఎంఆర్ | 151–200 |

### ప్రామాణికాలు ఇవే

మొత్తం ఐదు ప్రామాణికాలను పరిగణలోకి తీసుకొని ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు. అవి....

| ప్రామాణికం | వెయిటేజీ |
|---|---|
| ఎంప్లాయిబిలిటీ | 40 శాతం |
| ఎంట్రప్రెన్యూర్‌షిప్, అల్యూమినీ ఔట్‌కమ్స్ | 15 శాతం |
| రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ | 20 శాతం |
| థాట్ లీడర్‌షిప్ | |
| క్లాస్ అండ్ ఫ్యాకల్టీ డైవర్సిటీ | 10 శాతం |

### ఎంప్లాయిబిలిటీ

క్యూఎస్ గ్లోబల్ ఎంప్లాయర్ సర్వేను పరిగణనలోకి తీసుకున్నారు. ఎంప్లాయర్ సర్వే ద్వారా.. రిక్రూటర్లు ఏయే ఇన్‌స్టిట్యూట్స్‌లో నియామకాలు జరిపేందుకు ఆసక్తిగా ఉన్నారనే విషయాన్ని తెలుసుకోవడం జరిగింది. 2015–19 మధ్య ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 45,000 మంది రిక్రూటర్ల అభిప్రాయాలు సేకరించడం విశేషం. తాజాగా వ్యక్తమైన అభిప్రాయాలకు ఎక్కువ వెయిటేజీ ఇచ్చారు. సర్వేలో భాగంగా అన్ని రంగాలు, ఇండస్ట్రీల్లోని ఎంప్లాయర్ల అభిప్రాయాలు సేకరించారు. ఫేస్‌బుక్, గూగుల్, ఉబెర్, వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా తదితర కంపెనీల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్టూడెంట్ ఎంప్లాయిమెంట్ రేటు, ఎంబీఏసీఎస్ఈఏ ప్రమాణికాలు తదితరాల ఆధారంగా ఈ సూచీ కింద స్కోరు కేటాయించారు.

### ఎంట్రప్రెన్యూర్‌షిప్, అల్యూమినీ ఔట్‌కమ్స్

అల్యూమినీ ఔట్‌కమ్ ఇండెక్స్‌లో భాగంగా ఆయా బిజినెస్ స్కూల్స్ అల్యూమినీలో ఆపిల్, అమెజాన్, యూబీఎస్, ఐఎంబీ, మైక్రోసాఫ్ట్, జేపీఎమ్ మోర్గాన్ ఛేజ్, పెప్సికో తదితర కంపెనీల్లో పనిచేస్తున్న సీఈవోలు, ఎగ్జిక్యూటివ్‌లు, బోర్డు మెంబర్లు కలిపి 60,000 మందికి పైగా ఉన్నట్లు తేలింది. దీంతోపాటు 150 గ్లోబల్, రీజనల్ లిస్టులు, ఫోర్బ్స్ 2000 లిస్టు, సోషల్ మీడియా గ్లోబల్ ఫార్చ్యూన్ టాప్ 500 లిస్టు,ప్రముఖ పబ్లిషర్లను పరిగణలోకి తీసుకొని వెయిటేజీ కేటాయించారు.

### రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్

ఈ సూచీ కింద వెయిటేజీ నిర్ధారణకు అనేక ప్రమాణికాలను పరిశీలించారు. పదేళ్ల కాలానికి రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్, జీతాలు, లివింగ్ కాస్ట్, ఎంబీఏ ముందు.. తర్వాత పొందుతున్న జీతాలు, కోర్సు పూర్తయిన మూడు నెలల్లోగా ఎంతమంది ఉద్యోగాలు పొందారు, వారు అందుకుంటున్న జీతాలు తదితరాల ఆధారంగా స్కోరు నిర్ణయించారు.

### థాట్ లీడర్‌షిప్

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వర్సిటీలు, బిజినెస్ స్కూల్స్‌లకు సంబంధించి 95,000 అకడమిక్స్‌ను పరిశీలించి వెయిటేజీ నిర్ధారించారు. ఈ సూచీ కింద రీసెర్చ్ ఫ్యాక్టర్, ఫ్యాకల్టీలో డాక్టోరల్ డిగ్రీ హోల్డర్ల సంఖ్య తదితరాలను పరిగణలోకి తీసుకున్నారు.

### క్లాస్ అండ్ ఫ్యాకల్టీ డైవర్సిటీ

ఈ సూచీ కింద తరగతిలోని విద్యార్థులు, ఫ్యాకల్టీ పరంగా జెండర్ డైవర్సిటీని పరిశీలించారు. దీంతోపాటు ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ, ఇంటర్నేషనల్ స్టూడెంట్‌ల సంఖ్యను పరిగణలోకి తీసుకొని వెయిటేజీ నిర్ధారించారు.



## అంతిమ సమరంలో సౌరవ్ కొఠారి పరాజయం

ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్ లాంగ్ అప్ ఫార్మాట్‌లో భారత ప్లేయర్ సౌరవ్ కొఠారి రన్నరప్‌గా నిలిచాడు. మెల్‌బోర్న్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సౌరవ్ 967-1307తో పీటర్ గిల్‌క్రిస్ట్ (సింగపూర్) చేతిలో ఓడిపోయాడు. పలుమార్లు ఆధిక్యం చేతులు మారిన ఈ మ్యాచ్‌లో మొదటి సెషన్‌లో కొఠారి ఆధిక్యం ప్రదర్శించాడు. అయితే రెండో సెషన్‌లో తడబడి ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇచ్చాడు. ఒకదశలో 250 పాయింట్లతో వెనుకంజలో ఉన్న గిల్‌క్రిస్ట్ 313 పాయింట్లు సాధించి 949-917తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఇదే జోరును మూడో సెషన్‌లోనూ కొనసాగించి పీటర్ విజేతగా నిలిచాడు.

# శాసించేది మనమే

ఇక ఈ టెస్టే కాదు... సిరీసే మన చేతిలోకి వచ్చేసినంత సంబరం. మూడు టెస్టుల సిరీస్ విజేత రెండో టెస్టు మూడో రోజే దాదాపు ఖరారైంది. ఇప్పటికైతే భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. ఇక మిగిలింది భారీ విజయమే! ఈ రెండు రోజుల్లో ఎంత తేడాతో విరాట్ సేన గర్జిస్తుందో చూడాలంటే పుణే మ్యాచ్‌పై ఓ కన్నేయాలి. మూడో రోజు సఫారీ పతనం పేస్‌తో మొదలైంది. స్పిన్‌తో పరిపూర్ణమైంది. పేస్ ద్వయం ఉమేశ్, షమీల బౌలింగ్‌ను టాపార్డర్, మిడిలార్డర్ ఎదుర్కోలేకపోయింది. మిగతా బ్యాటింగ్ అశ్విన్ స్పిన్‌లో చిక్కుకుంది. కానీ... కేశవ్ మహరాజ్, ఫిలాండర్ పోరాటమే భారత శిబిరాన్ని కాస్త ఇబ్బంది పెట్టింది. ఆలౌట్‌ను కాస్త ఆలస్యం చేసింది.




**పుణే టెస్టులో భారత్‌కు 326 పరుగుల ఆధిక్యం ● అశ్విన్‌కు నాలుగు వికెట్లు ● దక్షిణాఫ్రికా 275 ఆలౌట్ ● పోరాడిన కేశవ్, ఫిలాండర్**

**పుణే:** భారత్ ఆటను రెండో రోజు నాయకుడు నడిపిస్తే... ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను మూడో రోజు బౌలర్లు పడేశారు. టీమిండియాకు భారీ ఆధిక్యాన్ని కట్టబెట్టారు. రెండో టెస్టులో భారత్‌కు 326 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కేశవ్ మహరాజ్ మొండిగా పోరాడకుంటే ఆతిథ్య జట్టుకు 400 పైచిలుకు పరుగుల ఆధిక్యం దక్కేది. శనివారం దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 105.4 ఓవర్లలో 275 పరుగుల వద్ద ఆలౌటైంది. లంచ్ వరకే మరో మూడు వికెట్లను, రెండో సెషన్‌లో ఇంకో రెండు వికెట్లను కోల్పోయిన సఫారీ జట్టు... ఆఖరి సెషన్లో చివరి రెండు వికెట్లతోనే 78 పరుగులు జతచేయడంతో సఫారీ రోజంతా ఆడగలిగింది. పదో వరుస బ్యాట్స్‌మన్ కేశవ్ మహరాజ్ (132 బంతుల్లో 72; 12 ఫోర్లు) ఒక్కడే జట్టు పరువు నిలిపే బాధ్యత మోశాడు. ఫిలాండర్ (192 బంతుల్లో 44 నాటౌట్; 6 ఫోర్లు) అండతో పోరాడాడు. డు ప్లెసిస్ (117 బంతుల్లో 64; 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా... టీమిండియా బౌలర్లలో అశ్విన్ 4, ఉమేశ్ 3, షమీ 2 వికెట్లు తీశారు.

### వికెట్ల వేటతోనే ఆట షురూ...

ఆటతో పాటు వికెట్ల వేట కూడా మొదలైంది. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 36/3తో శనివారం ఆట కొనసాగించిన సఫారీ జట్టు మరో 5 పరుగులు మాత్రమే జతచేసి నోర్జే (3) వికెట్‌ను కోల్పోయింది. షమీ బౌలింగ్‌లో కోహ్లి క్యాచ్ పట్టడంతో అతను వెనుదిరిగాడు. కాసేపటికే జట్టు స్కోరు 50 పరుగులు దాటాయో లేదో మరో వికెట్ కూలింది. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ డి బ్రుయిన్ (58 బంతుల్లో 30; 6 ఫోర్లు) ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో కీపర్ సాహాకు క్యాచ్ ఇచ్చి ఐదో వికెట్‌గా నిష్క్రమించాడు. దీంతో 53 పరుగులకే దక్షిణాఫ్రికా సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ డు ప్లెసిస్‌కు వికెట్ కీపర్ డికాక్ జతయ్యాడు.


కేశవ్ మహరాజ్


డు ప్లెసిస్


ఫిలాండర్

### రాణించిన డు ప్లెసిస్...

అనుభవజ్ఞులైన డు ప్లెసిస్, క్వింటన్ డికాక్ ఇన్నింగ్స్‌ను ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా వికెట్ల పతనాన్ని అడ్డుకునేందుకు వీరిద్దరూ జాగ్రత్తగా ఆడారు. జట్టు స్కోరు కనాకష్టంగా 100 పరుగులు దాటింది. అదుపు తప్పిన బంతిని బౌండరీకి తరలిస్తూ డు ప్లెసిస్ వేగంగా అర్ధసెంచరీకి చేరువయ్యాడు. 64 బంతుల్లోనే 8 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో అతను ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. వీళ్లిద్దరు ఆరో వికెట్‌కు 75 పరుగులు జోడించారు. కానీ ఈ భాగస్వామ్యం మరింత బలపడకముందే లంచ్ విరామం లోపే అశ్విన్... డికాక్ (48 బంతుల్లో 31; 7 ఫోర్లు)ను బౌల్డ్ చేశాడు.

### కోహ్లి ఎత్తుగడ ఏంటో...

తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 326 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలున్న ఈ టెస్టులో ఆతిథ్య బౌలర్ల సమష్టి జోరు చూస్తే ఇన్నింగ్స్ విజయానికి ఇది సరిపోతుంది. కానీ కెప్టెన్ కోహ్లి ఎత్తుగడ ఎలా ఉండబోతుందో ఆసక్తికరంగా మారింది. అతను తన బౌలింగ్ దళానికి కాస్త విశ్రాంతి ఇవ్వాలనుకుంటే మాత్రం కచ్చితంగా రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు ఓపెనర్లను బరిలోకి దింపే అవకాశముంది. తొలి సెషన్ అంతా ఆడటం... లంచ్ తర్వాత పిచ్ పరిస్థితుల్ని బట్టి డిక్లేర్ చేసి ప్రత్యర్థి వికెట్లను తీయడం జరగొచ్చు. లేదంటే టీమ్‌తో సమాలోచనలు జరిపి ఫాలోఆన్ ఆడించినా ఆశ్చర్యం లేదు. ఆట ముగిశాక మీడియా సమావేశానికి వచ్చిన స్పిన్నర్ అశ్విన్ కూడా ఏ విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. 'ఫాలోఆన్' లేదంటే రెండో ఇన్నింగ్స్ ఆడటమా అనేది కోహ్లినే నిర్ణయిస్తాడని చెప్పాడు.

### కేశవ్ పోరాటం...

రెండో సెషన్ ఆరంభమైన కాసేపటికే ముత్తుసామి (7)ని జడేజా ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కాసేపయ్యాక డు ప్లెసిస్ కూడా స్పిన్ ఉచ్చులోనే పడ్డాడు. అశ్విన్ బౌలింగ్‌లో రహానే క్యాచ్‌తో అతను పెవిలియన్ చేరాడు. 162 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన సఫారీ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇక 200 పరుగుల్లోపే దక్షిణాఫ్రికా ఖేల్‌ఖతం అనుకున్నారంత. అయితే స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ విలవిల్లాడిన పిచ్‌పై ఫిలాండర్, కేశవ్ అసాధారణ పోరాటపటిమ కనబరిచారు. ఈ ఇద్దరు 43.1 ఓవర్ల పాటు భారత బౌలర్లను ఎదుర్కొన్నారు. ఆఖరి సెషన్‌ను అవలీలగా ఆడారు. ఈ క్రమంలో కేశవ్ 96 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. తొమ్మిదో వికెట్‌కు 109 పరుగులు జోడించాక కేశవ్‌ను, రబడ (2)ను అశ్విన్ ఔట్ చేయడంతో సఫారీ ఇన్నింగ్స్ ముగిసింది.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 601/5 డిక్లేర్డ్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** ఎల్గర్ (బి) ఉమేశ్ 6; మార్క్‌రమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఉమేశ్ 0; డి బ్రుయిన్ (సి) సాహా (బి) ఉమేశ్ 30; బవుమా (సి) సాహా (బి) షమీ 8; నోర్జే (సి) కోహ్లి (బి) షమీ 3; డు ప్లెసిస్ (సి) రహానే (బి) అశ్విన్ 64; డికాక్ (బి) అశ్విన్ 31; ముత్తుసామి (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 7; ఫిలాండర్ (నాటౌట్) 44; కేశవ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 72; రబడ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (105.4 ఓవర్లలో ఆలౌట్) 275.**
**వికెట్ల పతనం:** 1-2, 2-13, 3-33, 4-41, 5-53, 6-128, 7-139, 8-162, 9-271, 10-275. **బౌలింగ్:** ఇషాంత్ శర్మ 10-1-36-0, ఉమేశ్ 13-2-37-3, జడేజా 36-15-81-1, షమీ 17-3-44-2, అశ్విన్ 28.4-9-69-4, రోహిత్ శర్మ 1-1-0-0.

## బలగాలున్నది భద్రత కోసమా... మ్యాచ్ చూడ్డానికా?

**మైదానంలో అభిమానులు దూసుకెళ్లడంపై గావస్కర్ అసంతృప్తి**

**పుణే:** భారత దిగ్గజం సునీల్ గావస్కర్ అభిమానుల అతిక్రమణపై, భద్రతా సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడో రోజు ఆటలో ఓ ప్రేక్షకుడు మైదానంలోకి దూసుకొచ్చాడు. రోహిత్ కాళ్లు మొక్కేందుకు యత్నించి 'హిట్‌మ్యాన్'ను కింద పడేశాడు. టీవీ వ్యాఖ్యాతగా ఉన్న సన్నీ దీనిపై తీవ్రంగా స్పందించారు. 'భద్రతా బలగాలు అప్రమత్తంగా లేకపోవడం వల్లే ఈ సమస్య. వాళ్లు భద్రతను మరిచి మ్యాచ్‌ను చూస్తుంటారు. వాళ్లున్నది అనుకోని ఘటనల్ని నియంత్రించేందుకు తప్ప మ్యాచ్‌ను ఉచితంగా తిలకించేందుకు కాదు' అని అన్నారు. ప్రేక్షకుల అతి చేష్టల వల్ల ఆటగాడు గాయపడితే పరిస్థితి ఏంటని, గతంలో ఇలాంటివి జరిగాయని, ఇక ముందు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటనలో ఇది మూడో ఉదంతం. వైజాగ్ టెస్టులో ఒకరు కోహ్లితో సెల్ఫీ దిగేందుకు దూసుకొచ్చాడు. మొహాలీలో జరిగిన రెండో టి20లో అభిమానులు మైదానంలోకి రావడంతో రెండు సార్లు ఆటకు అంతరాయం ఏర్పడింది.




## శ్రీశ్వాన్‌కు కాంస్యం

**ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్**



**ముంబై:** సొంతగడ్డపై జరిగిన ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు మెరిశారు. శనివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో భారత్‌కు ఒక స్వర్ణం, మూడు రజతాలు, మూడు కాంస్య పతకాలతో కలిపి మొత్తం ఏడు పతకాలు లభించాయి. భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ కుర్రాడు మరాలాక్షికరి శ్రీశ్వాన్ అండర్-14 ఓపెన్ విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత నిజామాబాద్ జిల్లాకు చెందిన 13 ఏళ్ల శ్రీశ్వాన్ 8 పాయింట్లతో మరో ఐదుగురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... శ్రీశ్వాన్‌కు మూడో స్థానం లభించింది. భారత్‌కే చెందిన ఎల్.ఆర్.శ్రీహరి (తమిళనాడు) రెండో స్థానంలో నిలిచి రజతం గెల్చుకున్నాడు. ఈ విభాగంలో అజర్‌బైజాన్‌కు చెందిన ఐదిన్ సులేమాన్లి 9 పాయింట్లతో విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో శ్రీశ్వాన్ ఏడు గేముల్లో గెలుపొంది, రెండింటిని 'డ్రా' చేసుకున్నాడు. మరో రెండు గేముల్లో ఓడిపోయాడు. ఈ ఏడాది జూలైలో బార్సిలోనాలో జరిగిన టోర్నీలో శ్రీశ్వాన్ మూడో అంతర్జాతీయ నార్మ్ (ఐఎం)ను సాధించి... తెలంగాణ తరపున పిన్న వయస్సులో అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) హోదా పొందిన ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు.

అండర్-18 ఓపెన్ విభాగంలో 14 ఏళ్ల తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద చాంపియన్‌గా అవతరించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ప్రజ్ఞానంద ఏడు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అండర్-18 బాలికల విభాగంలో వంతిక అగర్వాల్ భారత్‌కు రజతం అందించింది. అండర్-14 బాలికల విభాగంలో దివ్య దేశ్‌ముఖ్ రెండో స్థానంలో, రక్షిత మూడో స్థానంలో నిలిచి వరుసగా రజత, కాంస్య పతకాలు అందించారు. అండర్-16 ఓపెన్ విభాగంలో అరోన్యాక్ ఘోష్ కాంస్యం గెలిచాడు.


ప్రజ్ఞానంద

## పసిడి పోరుకు మంజు రాణి

- సెమీస్‌లో ఓడి కాంస్యాలు నెగ్గిన మేరీకోమ్, జమున, లవ్లీనా
- ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్

**ఉలన్ ఉడే (రష్యా):** ఆడుతున్న తొలి ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనే భారత యువ మహిళా బాక్సర్ మంజు రాణి అదరగొట్టింది. 2001లో మేరీకోమ్ తర్వాత బరిలోకి దిగిన తొలి ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనే ఫైనల్‌కు చేరిన తొలి భారత బాక్సర్‌గా గుర్తింపు పొందింది. శనివారం జరిగిన 48 కేజీల సెమీఫైనల్లో మంజు 4-1తో చుతామట్ రక్సత్ (థాయ్‌లాండ్)పై ఘన విజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో ఎకతెరీనా పల్త్‌సెవా (రష్యా)తో మంజు రాణి తలపడుతుంది.

**మేరీకోమ్‌కు షాక్...**
రికార్డు స్థాయిలో ఏడో పసిడి పతకంపై గురిపెట్టిన భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ తన పోరాటాన్ని సెమీస్‌తో ముగించింది. దీంతో ఆమె ఈసారి కాంస్యంతో సరిపెట్టుకుంది. 51 కేజీల విభాగంలో జరిగిన సెమీస్ బౌట్‌లో ఆమె 1-4తో రెండో సీడ్ బుసెంజ కకిరోగ్లు (టర్కీ) చేతిలో ఓడింది. 54 కేజీల విభాగంలో జమునా బోరో 0-5తో టాప్ సీడ్ హుయాంగ్ హ్సియావో వెన్ (చైనీస్ తైపీ) చేతిలో, లవ్లీనా 2-3తో యాంగ్ లియు (చైనా) చేతిలో ఓడి కాంస్యాలతో సంతృప్తి చెందారు.




## ఆంధ్ర ఖాతాలో ఐదో ఓటమి

**ఆలూరు (బెంగళూరు):** సమష్టి వైఫల్యంతో విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు ఖాతాలో ఐదో పరాజయం చేరింది. జార్ఖండ్‌తో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు మూడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ టోర్నీలో ఆంధ్ర ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌లు ఆడింది. ఐదింటిలో ఓడిపోయి, ఒక మ్యాచ్‌లో గెలిచింది. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. జార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత ఆంధ్ర 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసింది. ఓపెనర్ క్రాంతి కుమార్ (72; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్రశాంత్ (56; 4 ఫోర్లు, సిక్స్), రికీ భుయ్ (59; 6 ఫోర్లు, సిక్స్) కూడా అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం జార్ఖండ్ 49.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 266 పరుగులు చేసి గెలిచింది. విరాట్ సింగ్ (58 బంతుల్లో 74 నాటౌట్; 7 ఫోర్లు, సిక్స్) దూకుడుగా ఆడి జార్ఖండ్‌ను గెలిపించాడు.

## షాట్‌పుట్‌లో తజీందర్ జాతీయ రికార్డు

**రాంచీ:** జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తజీందర్ పాల్ సింగ్ తూర్ కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. శనివారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో తజీందర్ ఇనుప గుండును 20.92 మీటర్ల దూరం విసిరి స్వర్ణ పతకాన్ని సాధించాడు. 20.75 మీటర్లతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును అతను బద్దలు కొట్టాడు. ఈ నెలాఖర్లో చైనాలో జరిగే ప్రపంచ మిలిటరీ గేమ్స్‌లో పాల్గొనబోతున్న తజీందర్ ఆ ఈవెంట్‌లో టోక్యో ఒలింపిక్స్ అర్హత ప్రమాణం 21.10 మీటర్లను అందుకుంటానని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఇటీవల దోహాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తజీందర్ 20.43 మీటర్లతో 18వ స్థానంలో నిలిచాడు.


తజీందర్

## భారత్ శుభారంభం

**జొహర్ బారో (మలేసియా):** సుల్తాన్ జొహర్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 4-2తో మలేసియాపై గెలిచింది. భారత ఆటగాళ్లలో ప్రతాప్ లాక్రా రెండు గోల్స్ (19వ, 33వ నిమిషాల్లో) సాధించగా... ఉత్తమ్ సింగ్ (60వ ని.లో), శిలానంద్ లాక్రా (39వ ని.లో) చెరో గోల్ చేశారు.




## ఒకే ఒక్కడు... కిప్‌చెగో

**మారథాన్ రేసును 2 గంటల్లోపు పూర్తి చేసిన తొలి అథ్లెట్‌గా గుర్తింపు**

**వియన్నా:** గతంలో ఎవరికీ సాధ్యంకాని ఘనతను కెన్యా రన్నర్, రియో ఒలింపిక్స్ చాంపియన్ ఇలియుడ్ కిప్‌చెగో సాధించాడు. 42.195 కిలోమీటర్ల పురుషుల మారథాన్ రేసును 2 గంటల్లోపు పూర్తి చేసిన తొలి అథ్లెట్‌గా కిప్‌చెగో గుర్తింపు పొందాడు. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో శనివారం ప్రత్యేకంగా జరిగిన మారథాన్ రేసులో 34 ఏళ్ల కిప్‌చెగో గంటా 59 నిమిషాల 40.2 సెకన్లలో గమ్యానికి చేరాడు. అయితే ఇది అధికారికంగా గుర్తింపు పొందిన మారథాన్ రేసు కాకపోవడంతో కిప్‌చెగో ఘనత రికార్డు పుస్తకాల్లో చేరడం లేదు. ప్రస్తుత మారథాన్ ప్రపంచ రికార్డు కిప్‌చెగో పేరిటే ఉంది. గత ఏడాది బెర్లిన్ మారథాన్‌లో కిప్‌చెగో 2 గంటల 1 నిమిషం 39 సెకన్లతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. శనివారం వియన్నాలో జరిగిన మారథాన్ రేసును తిలకించేందుకు కిప్‌చెగో స్వదేశం కెన్యాలోని వీధుల్లో ప్రత్యేకంగా టీవీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. వేలాది మంది అభిమానులు కిప్‌చెగో ఘనతను టీవీల్లో వీక్షించారు. రెండేళ్ల క్రితం ఇటలీలో కిప్‌చెగో 2 గంటల్లోపు మారథాన్ రేసును పూర్తి చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అయితే రెండో ప్రయత్నంలో మాత్రం అతను సఫలమై తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

## షెర్బో సరసన సిమోన్ బైల్స్

**వరల్డ్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో 23వ పతకంతో ఆల్‌టైమ్ రికార్డు సమం**


సిమోన్ బైల్స్

**స్టుట్‌గార్ట్ (జర్మనీ):** అమెరికా మెరుపుతీగ సిమోన్ బైల్స్ ప్రపంచ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఆల్‌టైమ్ పతకాల రికార్డును సమం చేసింది. శనివారం జరిగిన వాల్ట్ ఈవెంట్‌లో 22 ఏళ్ల బైల్స్ 15.399 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల చరిత్రలో ఆమెకిది 17వ పసిడి పతకంకాగా ఓవరాల్‌గా 23వ పతకం. ఈ క్రమంలో బెలారస్ జిమ్నాస్ట్ వితాలీ షెర్బో (23 పతకాలు) పేరిట ఉన్న అత్యధిక పతకాల ఆల్‌టైమ్ రికార్డును బైల్స్ సమం చేసింది. షెర్బో 1991 నుంచి 1996 మధ్య జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో 12 స్వర్ణాలు, 7 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 23 పతకాలు గెలిచాడు. శనివారమే జరిగిన అన్‌ఈవెన్ బార్స్ ఫైనల్లో బైల్స్ బరిలోకి దిగినా ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. లేదంటే కొత్త రికార్డు నెలకొల్పేది. అయితే నేడు బ్యాలెన్సింగ్ బీమ్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఫైనల్స్‌లోనూ బైల్స్ పోటీపడనుంది. ఈ రెండింటిలో ఆమె ఒక్క పతకం సాధించినా ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌గా కొత్త చరిత్ర లిఖిస్తుంది.

## క్లుప్తంగా...

### మాజీ ఎమ్మెల్యే రాంమూర్తియాదవ్ కన్నుమూత



**హాలియా:** రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన చలకుర్తి (ప్రస్తుత నాగార్జునసాగర్ నియోజకవర్గం) మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రాంమూర్తి యాదవ్ (73) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మరణించారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి ఆయన స్వగ్రామం. 1981లో పెద్దదేవులపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన 13 ఏళ్లు పనిచేశారు. ఆ తర్వాత 1994లో అప్పటి చలకుర్తి నియోజకవర్గం నుంచి తొలి సారిగా టీడీపీ తరపున పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జానారెడ్డిపై విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ఆయన టీఆర్‌ఎస్‌లో చేరారు. 2019 ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ విజయానికి కృషి చేశారు. రాంమూర్తియాదవ్ భార్య లక్ష్మమ్మ మూడేళ్ల క్రితమే మరణించారు. ఆయనకు ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పెద్ద అల్లుడు బడుగుల లింగయ్యయాదవ్ రాజ్యసభ సభ్యుడుగా ఉన్నారు. ఆదివారం ఉదయం పెద్దదేవులపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, పలువురు నాయకులు రాంమూర్తి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### పన్నుల భారంతోనే ఆర్టీసీకి నష్టాలు

**మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్**



**జనగామ:** ఆర్టీసీకి ప్రభుత్వం సాయం చేయడం కాదు.. సంస్థనే సర్కారుకు అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన రిలే దీక్షలు శనివారం 8వ రోజుకు చేరుకున్నాయి. నాగేశ్వర్ వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఆర్టీసీ సంస్థ ఏటా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.740 కోట్లు చెల్లిస్తోందని, ఇందులో డీజిల్‌పై రూ.300 కోట్లు, మోటారు వెహికిల్ చట్టం కింద రూ.290 కోట్లు, విడి పరికరాల కొనుగోలుపై రూ.150 కోట్లు ట్యాక్స్‌ల రూపంలో చెల్లిస్తున్నట్లు చెప్పారు. అయితే ఏటా ఆర్టీసీ నష్టపోయేది రూ.825 కోట్లని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలకు లేని ట్యాక్స్‌లు ప్రజారవాణాపై ఎందుకని ప్రశ్నించారు. పన్నుల రూపంలో ప్రభుత్వం తీసుకునే డబ్బులు వద్దనుకుంటే.. లాభాల్లో ఆర్టీసీ ఒక మెట్టు పైనే ఉంటుందన్నారు. అలాగే లాభాలు వచ్చే రూట్లలో ప్రైవేట్ సర్వీసులను పంపిస్తూ.. నష్టాలు వచ్చే ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను నడిపించడం కూడా నష్టాలకు ఒక కారణమని అన్నారు. ప్రజలు కార్మికులకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.



శ్రీపాల్‌రెడ్డి



కమలాకర్‌రావు

### పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడిగా శ్రీపాల్‌రెడ్డి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీరెల్లి కమలాకర్‌రావు**

**విద్యారణ్యపురి:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హన్మకొండలో జరుగుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా శనివారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన శ్రీపాల్‌రెడ్డి హన్మకొండలో స్థిరపడ్డారు. వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ జెడ్పీ హైస్కూల్‌లో మ్యాథ్స్ స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్‌కు చెందిన బీరెల్లి కమలాకర్‌రావు మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన నాలేశ్వర్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరి పదవీకాలం రెండేళ్ల వరకు ఉంటుంది. వీరితో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సముద్రాల రాంనర్సింహాచార్యులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల పరిశీలకులుగా పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి వ్యవహరించారు.

**రాష్ట్ర కార్యవర్గంలో ప్రతీ జిల్లానుంచి ప్రాతినిధ్యం**

పీఆర్‌టీయూ రాష్ట్ర నూతన కార్యవర్గంలో ప్రతీ జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా 250 మంది, ఉపాధ్యక్షులుగా 250, కార్యదర్శులుగా 250 మంది ఉపాధ్యాయులకు అవకాశం కల్పించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో 50 మంది మహిళా ప్రతినిధులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, కూర రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్, 33 జిల్లాల నుంచి యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.



## ‘పాటల’ పిచ్చుక

పై చిత్రంలో బూడిద రంగు కలిగి నలుపు చారలతో చూడ ముచ్చటగా ఉన్న ఈ పక్షి పేరు కిరీటపు పిచ్చుక. సాధారణ పిచ్చుకల జాతికి చెందినదే అయినా.. దీనికి ఓ ప్రత్యేకత ఉంది. మగ పిచ్చుకలు వినసొంపైన గొంతుతో పాటలా కూత పెడుతూ సంతానోత్పత్తి కాలంలో ఆడ పిచ్చుకలను ఆకర్షిస్తాయి. గుడ్లను రెండూ కలిసి పొదుగుతాయి. ఇవి ప్రధానంగా దక్షిణ భారతదేశంలో ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు కనిపిస్తాయి. ముఖ్యంగా గడ్డి మైదానాల్లో మట్టి బొరియలుచేసుకుని గూళ్లు నిర్మించుకుంటాయి. వరంగల్ రూరల్ జిల్లా పాకాల అటవీ ప్రాంతంలో కనిపించిన ఈ పిచ్చుకను వైల్డ్ లైఫ్ ఫొటో గ్రాఫర్ శ్యాంసుందర్ తన కెమెరాలో బంధించారు.

– ఖానాపురం

## ఆర్టీసీపై ప్రతిపక్షాలది నీచ రాజకీయం

**మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

**వేల్పూర్:** ఆర్టీసీ సమ్మెపై ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆర్‌అండ్‌బీ, గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోగా, తెలంగాణాలో మాత్రం విలీనం చేయాలంటూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న కార్మికుల డిమాండ్ ఎట్టి పరిస్థితుల్లో నెరవేరదని స్పష్టం చేశారు. అది తమ పార్టీ మేనిఫెస్టోలో లేదని, విలీనం చేస్తామని సీఎం కేసీఆర్ ఎప్పుడూ చెప్పలేదన్నారు. పశ్చిమ బెంగాల్‌తోపాటు కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న కేరళలో సైతం ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాలేదన్నారు. ఆర్టీసీలో సంస్కరణలు తీసుకువచ్చి ప్రజలకు మంచి సేవలు అందించేందుకు సీఎం చేస్తున్న కృషిని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన 44 శాతం ఫిట్‌మెంట్, 16 శాతం ఐఆర్ ఏ ఇతర ఉద్యోగులకూ ఇవ్వలేదన్నారు. 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల అనైతిక డిమాండ్ తీర్చడం కంటే, 4 కోట్ల ప్రజల అవసరాలు తీర్చడమే ముఖ్యమని వెల్లడించారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం సమంజసం కాదన్నారు. ఆర్టీసీలో సంస్కరణలు తెచ్చి లాభాల బాటలోకి తేవాలని సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లపై ధర్నా చేయడం ఆర్టీసీ కార్మికుల హక్కు అని, అలా కాకుండా ప్రభుత్వ విధానాలపై సమ్మె చేయడం సరైన విధానం కాదన్నారు. కొన్ని సంస్థలు ఆర్టీసీకి రూ. 50 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు.



### నేడు ఆదివాసీ యోధుడు కుమురం భీం వర్ధంతి

**సాక్షి, ఆసిఫాబాద్:** ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం 79వ వర్ధంతిని ఆదివారం కుమురం భీం జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఊట్నూర్ ఐటీడీఏ, జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది మంది గిరిజనులు తరలిరానున్నారు. ఆదివాసీలు సంప్రదాయ బద్ధంగా నివాళి అర్పించిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. జిల్లా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ముగ్గురి దారుణహత్య

**పురుగు మందు తాగించి, బ్లేడ్‌తో గొంతుకోసి..**

- అన్న, అన్న కూతురు, సొంత కూతురును చంపిన ఉన్మాది
- కామారెడ్డి జిల్లాలో దారుణం



బాలయ్య (ఫైల్)



లత (ఫైల్)



చందన (ఫైల్)

**దోమకొండ:** ఓ వ్యక్తి తన సొంత కూతురుతో పాటు తోడబుట్టిన అన్నను, అన్న కూతురును పురుగు మందు తాగించి అనంతరం కర్కషంగా బ్లేడ్‌తో గొంతు కోసి చంపిన ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండలో చోటు చేసుకుంది. మృతులంతా భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందినవారు. కామారెడ్డి డీఎస్పీ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జంగంపల్లి గ్రామానికి చెందిన బందెల బాలయ్య (45), బందెల లత (16), బందెల చందన (6)లను శుక్రవారం సాయంత్రం బాలయ్య తమ్ముడు బందెల రవి జంగంపల్లి గ్రామం నుంచి తన బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడు. వీరు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వారి కోసం వెతికారు. కాగా, శనివారం మధ్యాహ్నం దోమకొండ గ్రామ శివారులోని మల్లన్న గుడి పక్కన చెట్ల పొదల్లో ముగ్గురి శవాలను స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలయ్యకు ఇద్దరు కూతుళ్లు దీప, లతతో పాటు కుమారుడు అజయ్ ఉన్నాడు. వీరిలో పెద్ద కూతురు దీప 20 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన నర్సింహులును ప్రేమ వివాహం చేసుకుంది. ఈ విషయంలో ఇరువురి కుటుంబాల మధ్యన గొడవలు జరిగినా, ఒకే సామాజికవర్గం కావడంతో సర్దుకుపోయారు. అయితే బాలయ్య తమ్ముడు రవికి మాత్రం తన అన్న కూతురు ఇలా పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. వాళ్లు తమ కాళ్లు మొక్కే వారని, వాళ్లింటికి మన అమ్మాయి వెళితే మనం వాళ్ల కాళ్లు ఎలా మొక్కుతామంటూ రవి పలుమార్లు బాలయ్యతో గొడవపడ్డాడు. గురువారం సాయంత్రం మద్యం సేవించిన రవి ఇంటివద్ద అన్న, కుటుంబ సభ్యులతో ఇదేవిషయంపై గొడవ పడ్డాడు. కుటుంబ పరువు తీసిన అన్న కూతురుతో పాటు అందరినీ చంపుతానంటూ మాట్లాడాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం అన్న బాలయ్య, అన్న కూతురు లత, తన కూతురు చందనలకు మాయ మాటలు చెప్పి తన బైక్‌పై ఎక్కించుకుని దోమకొండ మండల కేంద్రానికి సమీపంలోని మల్లన్న ఆలయం వద్దకు తీసుకెళ్లాడు. వారికి కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలిపి తాగించాడు. అనంతరం బ్లేడ్‌తో అన్న గొంతు, అన్న కూతురి గొంతుకోసి దారుణంగా హత్యచేశాడు. చందన మాత్రం పురుగు మందు ప్రభావంతో చనిపోయినట్లు తెలుస్తోంది. నిందితుడు రవి బైక్‌ను దోమకొండ గుండ్ల చెరువు వద్ద పోలీసులు గుర్తించారు. అన్న కూతురు చేసుకున్న ప్రేమ పెళ్లి ఇష్టం లేక సైకోగా మారి వీరిని చంపాడని పోలీసులు తెలిపారు. మృతుడు బాలయ్య గ్రామంలో డప్పు కొడుతూ జీవనం సాగించేవాడు.

**నిందితుడికి నేరచరిత్ర..**

హత్యకు పాల్పడినట్లు భావిస్తున్న బందెల రవి నేర చరిత్ర కలిగి ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. గ్రామంలో గతంలో జరిగిన గొడవలో కాలనీకి చెందిన వారిపై కత్తులతో దాడిచేసి కాళ్లు నరికి వేశాడన్నారు. శుక్రవారం ముగ్గురిని చంపి పరారైన రవి శనివారం వరకు కనిపించ లేదని తెలిపారు. కాగా, ఘటనా స్థలం వద్ద డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు ఆధారాలకోసం ప్రయత్నించారు. కామారెడ్డి ఎస్పీ శ్వేత, డీఎస్పీ లక్ష్మీనారాయణ, కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, భిక్కనూరు సీఐ రాజశేఖర్ ఇతర సిబ్బంది సంఘటన స్థలాన్ని సందర్శించారు.

**ప్రాణభయం ఉంది..**

మా పెద్ద కూతురు దీప 20 రోజుల క్రితం ప్రేమ పెళ్లి చేసుకుంది. దీంతో మా మరిది రవి తరచుగా మాతో గొడవ పడుతున్నాడు. దీప ప్రేమ పెళ్లి చేసుకుని గ్రామంలో కుటుంబ పరువు తీసిందని, అందరినీ చంపేస్తానని బెదిరించాడు. కాని ఇంత పని చేస్తాడనుకోలేదు. నా భర్తను, కూతురును చంపాడు. నన్ను, నా కొడుకును కూడా చంపుతాడని భయంగా ఉంది. పోలీసులు అతడిని శిక్షించి మమ్మల్ని కాపాడాలి.

– మణెవ్వ, మృతుడు బాలయ్య భార్య

### కృష్ణా ప్రాజెక్టులకు పెరిగిన వరద

**సాక్షి, హైదరాబాద్:** ఎగువ పరీవాహకంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు మళ్లీ వరద ఉధృతి పెరిగింది. శనివారం ఆల్మట్టిలోకి 65 వేల క్యూసెక్కులు వస్తుండగా, అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్‌లోకి 66వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 69వేల క్యూసెక్కుల నీటిని వదిలేస్తున్నారు. ఇక జూరాలకు 85వేల క్యూసెక్కులు, శ్రీశైలంలోకి 1.59లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం నుంచి 79వేల క్యూసెక్కులను సాగర్‌కు వదులుతున్నారు. ఇక శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండేందుకు సిద్ధమవుతోంది. ప్రాజెక్టులోకి స్థిరంగా ప్రవాహాలు కొనసాగుతుండటంతో నిల్వలు క్రమంగా పుంజుకుంటున్నాయి. శనివారం ప్రాజెక్టులోకి 13,030 క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తుండటంతో నిల్వ 90కి గానూ 80.66 టీఎంసీలకు చేరింది.

## లేటు వయసులో కవలలకు జననం

**52 ఏళ్ల వయసులో వారసుడి కోసం తపన ● ఆరోగ్యంగా తల్లీపిల్లలు**

**టవర్‌సర్కిల్ (కరీంనగర్):** ఆమె అమ్మమ్మ.. అయినప్పటికీ వారసత్వం కోసం మళ్లీ పిల్లలు కనాలని తపించింది. ఆమె ఆశయానికి కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం అండగా నిలిచింది. 52 ఏళ్ల వయసులో కూడా పండంటి కవలలకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. భద్రాచలంకు చెందిన ఆరె సత్యనారాయణ, రమాదేవి దంపతులకు ఇద్దరు సంతానం. కూతురుకు వివాహం కాగా ఆమెకు ఇద్దరు పిల్లలు. కుమారుడు 2013లో 13 ఏళ్ల వయసులో ప్రమాదవశాత్తు మరణించాడు. ఆ తర్వాత భార్యాభర్తలు ఒంటరితనంతో బాధపడ్డారు. ఐవీఎఫ్ ద్వారా పిల్లలు కనాలనే ఆలోచనకు వచ్చారు. కరీంనగర్‌లోని పద్మజ సంతాన సాఫల్య కేంద్రాన్ని సందర్శించి వారి కోరికను వెల్లడించారు. రమాదేవికి 52 ఏళ్లు ఉన్నప్పటికీ సవాలుగా తీసుకున్న డాక్టర్ పద్మజ ఐవీ ఎఫ్ చికిత్సను ప్రారంభించి విజయవంతం చేశారు. ఈ నెల 11న ఉదయం ఆసుపత్రిలో సాధారణ ప్రసవం చేశారు. రమాదేవి కవలలకు జన్మనిచ్చింది. ఇద్దరు ఆడ శిశువుల్లో ఒకరు 2 కిలోలు, మరొకరు 2.2 కిలోల బరువుతో జన్మించారు. తల్లీ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు తెలిపారు.



కవల పిల్లలను చూపిస్తున్న తల్లిదండ్రులు, డాక్టర్

**55 ఏళ్ల వరకు ఐవీఎఫ్ చేయవచ్చు..**

ఐవీఎఫ్ పద్ధతిలో 55 ఏళ్ల లోపు వయసున్న ఎవరికైనా టెస్ట్‌ట్యూబ్ ద్వారా పిల్లలను కనే అవకాశం ఉందని సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ పద్మజ తెలిపారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇదేమీ కొత్త కాదని, గతంలో 54, 55 ఏళ్ల వయసున్న వారికి కూడా ఐవీఎఫ్ పద్ధతిలో తమ ఆసుపత్రిలో సంతానం కలిగిందన్నారు.

**వారసుడి కోసం..**

తమ కుమారుడు 2013లో మరణించాక వారసుని కోసం మళ్లీ పిల్లలు కనాలనే ఆలోచన వచ్చిందని, కవలలకు జన్మనిచ్చిన రమాదేవి, ఆమె భర్త సత్యనారాయణ తెలిపారు. కరీంనగర్‌లో ఉన్న పద్మజ ఆసుపత్రి గురించి తెలుసుకొని ఇక్కడికి రావడంతో సంతానభాగ్యం కలిగిందని వెల్లడించారు. తమకు వారసత్వం కోసం మగ పిల్లాడు జన్మించాలని కోరుకున్నామని, అయితే దేవుడు ఇద్దరు ఆడపిల్లలను ఇచ్చినప్పటికీ ఆనందంగానే ఉందన్నారు.

### ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య

**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం**

**చర్ల/కాళేశ్వరం:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ యువకుడిని దారుణంగా హతమార్చారు. తెలంగాణ పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, పలుమార్లు హెచ్చరించినా లక్ష్యపెట్టకపోవడం వల్లే హతమారుస్తున్నామని మృతదేహం వద్ద వదిలిన లేఖలో పేర్కొన్నారు. బీజాపూర్ జిల్లా తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బేటి కొత్తూరుకు చెందిన కిష్టయ్య (20)ను మావోయిస్టులు రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి తాళ్లగూడెం–భోపాలపట్నం ప్రధాన రహదారిపై గొడ్డళ్లు, కత్తులతో నరికి కిష్టయ్యను దారుణంగా హత్య చేశారు. మృతదేహం వద్ద మావోయిస్టు పార్టీ మద్దేడు ఏరియా కమిటీ పేరిట ఒక లేఖను వదిలారు. కిష్టయ్య కొంతకాలంగా తెలంగాణ పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తూ దళాల సమాచారాన్ని వారికి చేరవేస్తున్నాడని, పేరూరు, వాజేడు ఎస్సైలతో చేతులు కలిపి తమ పార్టీ మిలీషియా సభ్యుల సమాచారాన్ని పోలీసులకు తెలిపి అరెస్ట్ చేయిస్తున్నాడని లేఖలో పేర్కొన్నారు. ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరించే వారందరికీ ఇదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. కాగా, మృతుడు కిష్టయ్య ఉంటున్న గ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు సమీపంలోనే ఉంటుంది.

## ఊడిపోయిన ఆర్టీసీ బస్సుటైర్లు

నార్కట్‌పల్లి/చిట్యాల

ఆర్టీసీ బస్సులకు మరమ్మతులు లేకపోవడంతో ప్రమాదకరంగా తయారవుతున్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో వెళుతుండగా వెనుక టైర్లు ఊడిపోయాయి. దీంతో డ్రైవర్ గమనించి బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. రోజువారీగా బస్సులను మెకానిక్‌లు చెక్ చేయాల్సి ఉంటుంది. అయితే మెకానిక్‌లు కూడా సమ్మెలో ఉండటంతో వాటిని పట్టించుకునే వారు లేరు. ఈ క్రమంలో శనివారం బస్సు నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు 60 మంది ప్రయాణికులతో వెళ్తుండగా మార్గమధ్యలో వెనుక టైర్లు ఊడిపోయాయి. ఎవరికి ఏమీ కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.





వెనుకటైర్లు ఊడిపోయిన నార్కట్‌పల్లి డిపో బస్సు

**రెండు ఆర్టీసీ బస్సులు ఢీ**

నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ శివారులో హైవేపై శనివారం రెండు ఆర్టీసీ బస్సులు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. కోదాడ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ అద్దె బస్సు హైదరాబాద్ నుంచి కోదాడకు 36 మంది ప్రయాణికులతో వెళ్తోంది. చిట్యాల పట్టణ శివారులోని రైల్వే స్టేషన్ వద్దకు రాగానే ముందు మరో ఆర్టీసీ బస్సుతో పాటు కారు వెళ్తున్నాయి. రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలోని హైవేపై కారు యూటర్న్ తీసుకోగా, వెనుకాల వస్తున్న బస్సు డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న కోదాడ డిపో బస్సు అదుపుతప్పి ముందున్న బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స కోసం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.

# సున్నపు రాయితోనే సమస్య

- మిడ్‌మానేరు కట్టను పరిశీలించిన రిటైర్డ్ ఇంజనీర్లు
- బోగం ఒర్రె ప్రాంతంలో కట్ట లోపల సున్నపురాయి
- నీరు చేరాక సున్నపురాయి కరిగి సీపేజీ వస్తోందని వెల్లడి
- కట్టకు గ్రౌటింగ్ చేయడమే ఉత్తమని సూచన

**బోయినపల్లి (చొప్పదండి):** మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట లోపల బోగం ఒర్రె ప్రాంతంలో సున్నపురాయి ఉండటంతో సీపేజీ ఏర్పడుతోందని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు పేర్కొన్నారు. శనివారం తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.చంద్రమౌళి, వర్కింగ్ అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి, సలహాదారులు పి.వెంకట్రామారావు, అనంతరాములు, ఎం.సత్తిరెడ్డి తదితరులు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు(శ్రీరాజరాజేశ్వర) ప్రాజెక్టు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఎడమవైపు కట్ట పరిసరాల్లో సీపేజీ వస్తున్న బోగం ఒర్రె పరిసరాలు తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే అప్పటి అధికారులు బోగం ఒర్రె ప్రాంతంలో సరైన పర్యవేక్షణ చేయలేదని, దీంతో సమస్య తలెత్తిందని వెల్లడించారు. ఇది డ్యామ్ నిర్మాణ సమస్య కాదని.. జియలాజికల్ సమస్య అని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో బోగం ఒర్రె ప్రాంతంలో బాగాలోతు నుంచి నల్లమట్టి నింపితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు భద్రతపై పలుసూచనలు చేశారు. రిజర్వాయర్ బోగం ఒర్రె పరిసరాల్లో కట్ట పటిష్టంగా ఉండేందుకు గ్రౌటింగ్ చేయాలని సూచించారు. ఇది ఒక రకంగా డ్యామ్ లోపల సీపేజీ ప్రాంతంలో సబ్ సర్ఫేస్ డ్యామ్‌లా నిర్మాణం చేయడమని తెలిపారు. ప్రాజెక్టుకింది నుంచి కట్ట ఎత్తుకు పదిరెట్ల పొడవున బండ్‌పై నల్లమట్టి వేయాలని సూచించారు. సీపేజీ ప్రాంతంలో ఐదు మీటర్ల లోడింగ్ బర్మ్ (రక్షణ కట్ట) వేయాలన్నారు. ప్రాజెక్టు కట్ట దిగువన రిలీఫ్ వెల్స్ నిర్మించాలని సూచించారు. ప్రతీరిజర్వాయర్‌లో నీరు చేరాక సీపేజీ రావడం సహజమని తెలిపారు. అందుకే రాక్టోస్, ఫిల్టర్స్ పెడతారని అన్నారు. లోపల కట్ట అడుగులో నిర్మాణం చేసిన సందర్భంలో మరికొన్ని మీటర్ల మేర లోతుకు నల్లమట్టి నింపాల్సి ఉండేదన్నారు. నల్లమట్టి నింపి ఉంటే ఇపుడు ఈ సమస్య వచ్చి ఉండేది కాదని రిటైర్డ్ ఇంజనీర్లు అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టులో 15 టీఎంసీల మేర నీరు చేరాక బోగం ఒర్రె పరిసరాల్లో లోపల కొంతమేర లైమ్‌స్టోన్ వచ్చిందన్నారు. అది నీరు తాకగానే కరిగిపోయి సీపేజీగా ఏర్పడుతోందని తెలిపారు. సున్నపురాయి ఇలాగే కరుగుతూ పోతే కట్టకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కట్టను విస్తరించి రిలీఫ్ వెల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఇలాంటి సమస్యే గోరకల్ రిజర్వాయర్‌లో వచ్చిందని గుర్తు చేశారు. డ్యామ్ నిర్మాణంలో ఎలాంటి సమస్య లేదని, డ్యామ్ కింద వచ్చిన సీపేజీతో సమస్య ఏర్పడిందని వెల్లడించారు. సమస్యను గుర్తించిన ప్రాంతంలో ప్రతీ మూడు మీటర్లకు ఒకహోల్ వేసి గ్రౌటింగ్ చేస్తే ఏదైనా లీకేజీ ఉంటే పరిష్కారమవుతుందని చెప్పారు. డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ గ్రౌటింగ్ చేయవచ్చని తెలిపారు. ఇరవై రోజుల్లో ఈ పనులు పూర్తి చేయవచ్చని వెల్లడించారు.



మిడ్‌మానేరు కట్టను పరిశీలిస్తున్న రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు

### ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి: చాడ



ఎదులాపురం (ఆదిలాబాద్): సీఎం కేసీఆర్ పట్టింపులకు పోకుండా ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించి, సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పక్క రాష్ట్రమైన ఏపీలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, తెలంగాణలో విలీనం చేయడానికి ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, రెవెన్యూ చట్టాల సవరణ ప్రయత్నాలు మానుకోవాలని ప్రభుత్వానికి షరతు విధించగా అందుకు ప్రభుత్వం అంగీకరించినందువల్లనే హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ఆర్థిక మాంద్యం ఏర్పడి సామాన్యులు బతకలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు నిరసనగా 16న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం 3 రోజుల్లో ఆర్టీసీ కార్మికుల సమ్మెను విరమింపజేస్తేనే టీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నళినీరెడ్డి, అరుణ్‌కుమార్, కుంటాల రాములు తదితరులు పాల్గొన్నారు.



## భూకంప బాధితుల రక్షణ ఇక స్మార్ట్‌గా

అది చూడడానికి అచ్చంగా క్రెడిట్ కార్డు మాదిరిగా ఉంటుంది. కానీ దానిలో నిక్షిప్తమై ఉన్న సాంకేతిక పరిజ్ఞానం అపారం. ప్రధానంగా భూకంపాల సమయంలో శిథిలాల్లో చిక్కుకున్న వారిని కాపాడటం కోసం ఇండోనేసియాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఈ పరికరాన్ని తయారు చేశారు. దీనిని ఒక్కసారి స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్‌లకి అనుసంధానం చేస్తే చాలు 10 కి.మీ. విస్తీర్ణంలో ఎవరు ఆపదలో ఉన్నా ఇట్టే కనిపెట్టేస్తుంది. శిథిలాల్లో చిక్కుకొని కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న వారి ఊపిరిని కూడా గుర్తించి సంకేతాలు పంపిస్తుంది. పదేళ్ల క్రితం ఇండోనేసియాలో భూకంపంలో తన కుటుంబ సభ్యుల్ని కోల్పోయిన వారిలో ఒకరైన రైడీ బోయర్ ఇప్పుడు ఈ పరికరాన్ని రూపొందించిన విద్యార్థి బృందంలో ఉన్నారు. భూకంపాలు వచ్చినప్పుడు శిథిలాల కింద ఉన్న వారిని యుద్ధప్రాతిపదికన రక్షించకపోతే ఏమైనా జరగొచ్చు. వారి కాళ్లు, చేతులు తీసేయాల్సిన పరిస్థితి రావొచ్చు. ఒక్కోసారి వారి ప్రాణాలకే ప్రమాదం రావొచ్చు. అలాంటి సమయంలో ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందని ఆ విద్యార్థులు చెబుతున్నారు. బ్రవిజయా యూనివర్సిటీకి చెందిన ఈ విద్యార్థులకు ఈ పరికరంపై పేటెంట్ హక్కులు వచ్చాయి. దీని ధర ఏడు డాలర్లు. త్వరలోనే ఈ పరికరానికి మరిన్ని హంగులు చేకూర్చి మార్కెట్‌లోకి తీసుకురానున్నారు. అన్నింటికంటే ముఖ్యమైనదేమిటంటే ఇంటర్నెట్ సౌకర్యం లేకపోయినా ఈ పరికరం పనిచేస్తుంది. భూకంపాలు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ఈ పరికరం బాగా ఉపయోగపడుతుంది.



## నింగి నుంచి నిఘా...



ప్రకృతి విపత్తులకి చిగురుటాకుల్లా వణికిపోయే ప్రజల్ని కాపాడడానికి, వారికి ఆపన్న హస్తం అందించడానికి మద్రాస్ ఐఐటీ విద్యార్థులు ఐ ఇన్ ది స్కై అన్న పేరుతో ఒక కొత్త డ్రోన్‌ను అభివృద్ధి పరిచారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ (సీఎఫ్‌ఐ), ఐఐటీ మద్రాస్ సంయుక్తంగా కృత్రిమ మేధతో పని చేసే ఈ డ్రోన్లను తయారు చేశారు. వరదలు, భూకంపాలు, కార్చిచ్చులు వంటి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈ డ్రోన్లు ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఆపదలో ఉన్న వారి గురించి కచ్చిత సమాచారాన్ని అందిస్తాయి. అంతేకాదు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ విజన్‌తో ఈ డ్రోన్లను అభివృద్ధి చేయడంతో సహాయ బృందాలు క్షణాల్లో అక్కడికి చేరుకోవడం వల్ల ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంది. బాంబే ఐఐటీలో ఇటీవల జరిగిన భారత్ నూతన ఆవిష్కరణల అభివృద్ధి కార్యక్రమంలో వివిధ ఐఐటీల మధ్య పోటీ జరిగింది. ఇందులో ఐ ఇన్ ది స్కై డ్రోన్లను అభివృద్ధి పరిచిన బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో నిలిచిన 18 ఇన్నోవేటివ్ స్టార్టప్‌లలో ఈ డ్రోన్లు కూడా ఉన్నాయి. అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సాంకేతిక సహకారం అందించే 390 ప్రాజెక్టులలో ఇది కూడా ఉండటం విశేషం.

## క్లుప్తంగా...

### మరికొందరు ఈఎస్‌ఐ నిందితులకు ఏసీబీ కస్టడీ

హైదరాబాద్: ఈఎస్‌ఐ మందుల కుంభకోణంలో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో వున్న మరికొందరు నిందితులను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. సురేంద్రనాథ్, సుధాకర్‌రెడ్డి, అరవింద్‌బాబు, మహిళా జైల్లో ఉన్న నాగలక్ష్మిలకు శనివారం ఏసీబీ కోర్టు కస్టడీ విధించింది. ఇదే కేసులో ప్రధాన నిందితులను గత బుధవారం రెండు రోజులు కస్టడీలోకి తీసుకుని, విచారణ తర్వాత అధికారులు తిరిగి జైలుకు తరలించారు.

### బోధ్ గయ పేలుళ్ల నిందితుడి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: బోధ్ గయ పేలుళ్ల కేసులో మరో నిందితుడు అజీజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 2013, జూలై 7వ తేదీన బిహార్‌లోని బోధ్ గయ ఆలయంలో ఐదు వరుస పేలుళ్లు జరిగాయి. ఈ కేసులో న్యాయస్థానం ఇప్పటికే ఐదుగురికి జీవితఖైదు విధించింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అజీజ్ ఈ పేలుళ్లకు సహకరించాడని ఎన్‌ఐఏ దర్యాప్తులో తేలింది. ఘటన అనంతరం నిందితుడు అజీజ్ పోలీసులకు చిక్కకుండా సౌదీ అరేబియాకు పారిపోయాడు. శుక్రవారం సౌదీ నుంచి హైదరాబాద్ వస్తున్నాడన్న ముందస్తు సమాచారం మేరకు అజీజ్‌ను ఛత్తీస్‌గఢ్ ఏటీఎస్ పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం దిగగానే అదుపులోకి తీసుకున్నారు.

### లలితా జ్యువెలరీ నగలు స్వాధీనం

టి.నగర్ (చెన్నై): తిరుచ్చిలోని లలితా జ్యువెలరీ దుకాణంలో చోరీ చేసిన నగలను దొంగల ముఠా నేత మురుగన్ పెరంబలూరులో ఒకచోట పాతిపెట్టినట్లు సమాచారం అందటంతో బెంగళూరు పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మురుగన్‌ను శనివారం పెరంబలూరు తీసుకువెళ్లి వాటిని గుర్తించారు. తిరుచ్చి సత్రం బస్టాండ్ సమీపంలోని లలితా జ్యువెలరీ దుకాణానికి గత నెల 2న దొంగలు కన్నం వేసి రూ. 13 కోట్ల విలువైన నగలను చోరీ చేసిన విషయం విదితమే. ఎనిమిది మంది ముఠాలో కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తిరువణ్ణామలై జిల్లా సెంగం కోర్టులో సురేష్ అనే వ్యక్తి లొంగిపోయాడు. ప్రధాన నిందితుడు మురుగన్ కోసం గాలిస్తుండగా.. అతడు శుక్రవారం బెంగళూరు 11వ సెషన్స్ కోర్టులో లొంగిపోయాడు.



### ఆ వివరాల్ని సమాచార హక్కు వెబ్‌లో పొందుపర్చాలి

**ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని పిల్ దాఖలు**

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి చెందిన 17 అంశాల సమాచారాన్ని, వాటికి సంబంధించిన అధికారుల విధులు, అధికారాల గురించి సమాచార హక్కు చట్టం అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)–2005 ప్రకారం ఈ వివరాల్ని వెబ్‌సైట్‌లో 120 రోజుల్లో పొందుపర్చాలని, ఆ చట్టం అమల్లోకి వచ్చి 14 ఏళ్లు అయినా ఇప్పటి వరకూ పొందుపరచలేదని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది తాండవ యోగేశ్ పిల్ దాఖలు చేశారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం సంబంధిత సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపర్చి ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని ఏపీ ప్రభుత్వం ఇది వరకే ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. తెలంగాణలో 8,801 మంది అధికారుల్లో కేవలం 76 మంది మాత్రమే ఆ చట్టంలోని సెక్షన్ 4(బి) ప్రకారం వివరాల్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని, ఆ సమాచారం కూడా అసమగ్రంగా ఉందని, ఈ వివరాలు సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించినట్లు ఆయన పిల్‌లో వివరించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సమాచార హక్కు చట్టం డిప్యూటీ సెక్రటరీలను ప్రతివాదులుగా చేశారు. దీనిపై హైకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టే అవకాశముంది.

# పిల్లలపై పంజా

**మృత్యు ఘంటికలు మోగిస్తున్న డెంగీ...**

**గ్రేటర్‌లో ఆరు రోజుల్లో 172 కేసులు నమోదు**

**ఇప్పటికే 20 మంది చిన్నారులు మృతి..తాజాగా మరొకరు**

**వైద్య ఆరోగ్యశాఖలో నమోదు కాని డెంగీ మరణాలు**

**డెంగీని గుర్తించడం ఇలా...**

- ఈడిస్ ఈజిప్టై(టైగర్ దోమ) కుట్టడం ద్వారా డెంగీ సోకుతుంది.
- కేవలం పగటి పూట మాత్రమే కుట్టే ఈ దోమ...ప్రస్తుతం లైటింగ్ ఎక్కువగా ఉండటంతో రాత్రిపూట కూడా కుడుతుంది.
- దోమ కుట్టిన 78 రోజులకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం రావడంతో పాటు కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది.
- ఎముకలు, కండరాల్లో భరించ లేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి.
- సాధారణంగా మనిషి రక్తంలో 1.50 నుంచి 4.50 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి.
- డెంగీ బాధితుల్లో రక్త కణాలు(ప్లేట్ లెట్స్) సంఖ్య 40 వేలలోపు పడిపోతుంది.
- 20 వేలలోపు పడిపోతే..ప్రమాదం. ఆ సమయంలో తిరిగి ఎక్కించాల్సి ఉంటుంది.
- లేదంటే అవయవాలన్నీ పనిచేయడం మానేసి, మృత్యువాతపడే ప్రమాదం ఉంది.
- లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స తీసుకోవడం వల్ల డెంగీ నుంచి బయటపడొచ్చు.

– డాక్టర్ సందీప్ ఘంటా, జనరల్ ఫిజిషియన్, సిటిజన్ ఆస్పత్రి

సూరారం గ్రామానికి చెందిన దుర్గేశ్, లక్ష్మి దంపతుల కుమార్తె సోనీ (15) 8వ తరగతి చదువుతోంది. జ్వరంతో బాధపడుతున్న సోనీని సూరారంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ జ్వరంగా నిర్ధారణ అయింది. బాలిక పరిస్థితి విషమించడంతో సుచిత్రలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది.

రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌కు చెందిన ఇక్బాల్ కుమారుడు బిలాల్(4)కు నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆదర్శనగర్‌లోని హెచ్‌ఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీలోఫర్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీకి చెందిన ప్రభాకర్, పవన్ కు మారిల కుమార్తె దర్శిని (4)కి తీవ్ర జ్వరం రావడంతో క్లినిక్‌కు తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహిం చిన వైద్యులు డెంగీ జ్వరంగా తేల్చారు. చిన్నారిని నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

సాక్షి, హైదరాబాద్

గ్రేటర్‌లో డెంగీ దోమలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. పసిపిల్లల ప్రాణాలను హరిస్తున్నాయి. ఇప్పటికే 14 ఏళ్లలోపు 20 మంది పిల్లలు డెంగీతో చనిపోగా, శుక్రవారం పాతబస్తీలోని తలాబ్‌కట్టకు చెందిన షేక్‌పుర్కాన్ ఆదిల్(14) మృతి చెందడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రేటర్‌లో ఆరు రోజుల్లోనే 172 కేసులు నమోదు కాగా, బాధితుల్లో 50% మంది 14 ఏళ్లలోపు పిల్లలే ఉండటం గమనార్హం. నిలోఫర్ సహా నగరంలోని పలు ప్రైవేటు చిన్నపిల్లల ఆస్పత్రులు జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. పలు ఆస్పత్రుల్లో పీడియాట్రిక్ విభాగాలన్నీ హౌస్‌ఫుల్ కావడం తో పడకల కోసం పిల్లల తల్లిదండ్రులకు పడిగాపులు తప్పడంలేదు. నిలోఫర్, గాంధీ పీడియాట్రిక్ వార్డులు రద్దీగా మారడంతో పిల్లల తల్లిదండ్రు లు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పెద్దలతో పోలిస్తే చిన్నపిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువ. దీంతో దోమలు కుట్టినప్పుడు త్వరగా డెంగీ బారిన పడుతుంటారు. స్కూల్‌కు వెళ్లే పిల్లల్లో అక్కడి పరిసరాల అపరిశుభ్రత కారణంగా దోమలు దాడి చేస్తున్నాయి. డెంగీ చిన్నారుల సంఖ్య పెరుగుతుండటంతో పాఠశాల్లో హాజరు శాతం గణనీయంగా తగ్గుతుంది.



ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ నబీల్ (9), గోషామహల్‌కు చెందిన అపూర్వ(3), సింగరేణికాలనికి చెందిన రాకేష్(9), గాంధీనగర్‌కు చెందిన వర్షిణి(8), బడంగ్‌పేటకు చెందిన హర్షిత(4), మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన నవీన్‌కుమార్(12), సనత్‌నగర్‌కు చెందిన ప్రద్యూమ్న(6), బిస్మిల్లా కాలనీకి చెందిన అయిమన్(10), కూకట్‌పల్లికి చెందిన శ్రీశుభంగ్ అవ్యక్తి (8), ముషీరాబాద్‌కు చెందిన శంకర్(13), రాములు(51), లాలాపేట్‌కు చెందిన రిత్విక్(5), మదీనాగూడకు చెందిన హేమంత్(10), ఉమర్(9)పాపిరెడ్డికాలనీకి చెందిన అవినాష్(13), మేడ్చల్‌లోని అద్వేల్లికి చెందిన ఫర్హాన్(6), ఘోషామహల్‌కు చెందిన

**గ్రేటర్‌లో కొన్ని డెంగీ మరణాలు..**

అపూర్వ(3), బడంగ్‌పేటకు చెందిన రాజారావు(45, వనస్థలిపురానికి చెందిన డాక్టర్ సరస్వతి(45), నాగోల్ జైపురికాలనికి చెందిన బీమ్‌రావు(55), మేడ్చల్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన వెంకటేష్(31), నరేందర్‌రెడ్డి(32), జి. కల్పన(36) సహా 8నెలల గర్భిణి స్వాతి(27), పర్వతనగర్‌కు చెందిన ఎడీవాసు(35), సికింద్రాబాద్ శాంతినగర్‌కు చెందిన యాదగిరి(62), శేరిలింగంపల్లిలోని చందానాయక్‌తండాకు చెందిన చందర్‌నాయక్(38), కాప్రాకు చెందిన అనూష(32) డెంగీ జ్వరంతో చనిపోయిన వారిలో ఉన్నారు. అయితే వీరంతా ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల రికార్డుల్లో నమోదు కావడం గమనార్హం.

## ఉద్యోగమన్నారు.. లక్షలు కాజేశారు..

- విదేశాల్లో ఉద్యోగాల పేరిట లక్షల్లో కుచ్చుటోపీ
- ముగ్గురు నైజీరియన్ల ఘరానా మోసం
- ఉద్యోగార్థులే లక్ష్యంగా ఎర
- ఢిల్లీలో నిందితులను పట్టుకున్న సైబర్‌క్రైమ్ పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు హీదర్ విలియమ్స్, దియోంగ్యూ, ముసా, హాలిటో

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు కొల్లగొడుతున్న ఓ ముగ్గురు నైజీరియన్లతో పాటు నాగాలాండ్ మహిళను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. నైజీరియన్లు దియోంగ్యూ మహమ్మద్, ముసా హలిమాట్, ఎన్‌డౌర్ అలియోనితో పాటు నాగాలాండ్‌కు చెందిన హలిటో జిమోమీని న్యూఢిల్లీ నుంచి ట్రాన్సిట్ వారంట్‌పై శనివారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. కేసు వివరాలను క్రైమ్స్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్‌లతో కలసి సీపీ సజ్జనార్ వెల్లడించారు.

**నేరగాళ్ల పాత్రలిలా..**

న్వోసు డొనాల్డ్ ప్రాస్పర్ అలియాస్ దియోంగ్యూ మహమ్మద్ అలియాస్ హీదర్ విలియమ్స్‌గా చలామణి అవుతున్నాడు. నైజీరియాకు చెందిన న్వోసు డొనాల్డ్ ప్రాస్పర్ పేరును దియోంగ్యూ మహమ్మద్‌గా మార్చుకొని సింగపూర్ పాస్‌పోర్టుపై 2018 మార్చిలో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చాడు. విదేశాల్లో ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న వారి జాబితాను సేకరించి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మెయిల్స్ పంపేవాడు. ముసా హలిమాట్ అలియాస్ మిస్ హీదర్ విలియమ్స్ దియోంగ్యూ ప్రియురాలు. మెడికల్ వీసాపై 2016లో భారత్‌కు వచ్చింది. ఉద్యోగార్థులతో మాట్లాడుతూ వారిని ముగ్గులోకి లాగడం ఈమె పని. ఎన్‌డౌర్ అలియోని అలిమాస్ బెనెడిక్ట్ ఎనబులిలి అలియాస్ మిస్టర్ రాబర్ట్ సెనగల్ పాస్‌పోర్టుపై 2018 సెప్టెంబర్‌లో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చాడు. వివిధ కంపెనీల నకిలీ ఈ–మెయిల్ ఐడీలు సృష్టించడంలో దిట్ట. నాగాలాండ్‌కు చెందిన హలిటో జిమోమి అలియాస్ అకిత కుమారి 2019లో నైజీరియాకు చెందిన ఫ్రాన్సిస్ అగాహోన్‌ను పెళ్లాడింది. అకిత కుమారి పేరుతో మాట్లాడుతూ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చేస్తుంది. పెటోసైల్ ఉఘా, శామ్సన్ విలియమ్‌లు కూడా దియోంగ్యూకు సహకరించేవారు.

**గుట్టు రట్టయిందిలా..**

కూకట్‌పల్లికి చెందిన వి.రాజన్‌బాబు భారత ప్రభుత్వ అటామిక్ ఎనర్జీ విభాగంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. గత మూడేళ్లుగా ఒడిశాలోని పట్నాయక్ స్టీల్స్‌లో సీఈవోగా పనిచేస్తున్నారు. అక్కడ ఏడాదికి రూ.45 లక్షలు జీతం తీసుకుంటున్నారు. ఎక్కువ జీతం వచ్చే జాబ్ కోసం రాజన్ చేస్తున్న ప్రయత్నాలను నైజీరియన్ బ్యాచ్ గుర్తించింది. లాస్‌ఏంజెలిస్‌లోని కాలిఫోర్నియా రొగల్ హోటల్ అండ్ అపార్ట్‌మెంట్స్ సీఈవో అంటూ హీదర్ విలియమ్స్ రాజన్‌కు ఫోన్ చేశాడు. ఏడాదికి కోటిన్నర ఇస్తామని చెప్పారు. బోస్టన్ నుంచి ఢిల్లీలోని బ్రిటిష్ కాన్సులేట్‌కు వస్తున్నానని రాజన్‌ను నమ్మించారు. హీదర్ విలియమ్స్ 12 నెలల అడ్వాన్స్ శాలరీ 1.75 లక్షల డాలర్ల డీడీతో వచ్చిందని, ఇది విడుదల చేయాలంటే రూ.55 వేలు చెల్లించాలని అకిత కుమారి మాట్లాడింది. మళ్లీ ఫోన్ చేసి రూ.2.55 లక్షలు చెల్లించాలని అడగడంతో మళ్లీ అంత మొత్తాన్ని జమ చేశారు. ఆ వెంటనే హీదర్ విలియమ్స్ ఫోన్ చేసి మరో రూ.10 లక్షలు ఇవ్వాలంటూ అడగడంతో మళ్లీ ఖాతాలో వేశాడు. ఇలా పలు దఫాలుగా మొత్తం రూ.47 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ చేశాడు. వారం అయినా నిందితుల నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయానని తెలుసుకొని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆగస్టు 29న ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు కేసు ఛేదించారు. నిందితుల నుంచి 21 సెల్‌ఫోన్లు, నాలుగు పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్, డెబిట్‌కార్డులు, విదేశీ సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, సీహెచ్ రామయ్య, ఎస్‌ఐలు విజయ్ వర్ధన్, రాజేంద్రను సీపీ సజ్జనార్ సత్కరించారు.

## ‘చరిత్రను వెలికితీయాల్సిన అవసరం ఉంది’

- తెలంగాణ పోరాట ఘట్టాలను భావితరాలకు అందించాలి
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య పోరాటాల కంటే ముందే తెలంగాణ నేలపై దేశ ఆత్మగౌరవ పోరాటాన్ని ఎత్తిపట్టారని, విదేశీ శక్తులను పొలిమేర దాకా తరిమిన నాగులంచ వంటి గ్రామాల చరిత్రను వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ అన్నారు. బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన, కట్టా శ్రీనివాస్ రచించిన ‘చరిత్రకెక్కని సమరం (తల వంచని నాగులంచ)’పుస్తకాన్ని బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్, రామానందతీర్థ సంస్థల డైరెక్టర్ నారా కిశోర్‌రెడ్డిలతో కలసి వినోద్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో మరుగున పడిన సమర యోధుల చరిత్రను, తెలంగాణ పోరాట ఘట్టాలను నమోదు చేయాలని, వాటిని పుస్తకాల రూపంలో భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. తొలి స్వాతంత్ర్య పోరు ఘట్టాల్లో సగర్వంగా లిఖించదగ్గ మహోజ్వల పోరు ఘట్టం నాగులంచ గ్రామమని కొనియాడారు.

## రామినేని ఫౌండేషన్ అవార్డుల ప్రదానం

**హాజరైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

హైదరాబాద్: డాక్టర్ రామినేని ఫౌండేషన్ (యూఎస్‌ఏ) 20వ వార్షికోత్సవం సందర్భంగా రామినేని పురస్కారాలను శనివారం సాయంత్రం జలవిహార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. రామినేని ఫౌండేషన్ చైర్మన్, ధర్మ ప్రచారక్ రామినేని, కన్వీనర్ పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2019 సంవత్సరానికిగాను విశిష్ట పురస్కారాన్ని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, విశేష పురస్కారాలను డాక్టర్ చంద్రశేఖర్ సంకురాత్రి, కళారత్న ఏబీ బాలకొండలరావు, గాయకుడు గోరటి వెంకన్నలకు ప్రకటించారు. వీరికి ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సంపాదించిన దాంట్లో వారి ప్రాంతాల కోసం ఎంతో కొంత ఖర్చు చేయాలని కోరారు. సింధును మొదట ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సత్కరించారని గుర్తుచేశారు. అనంతరం రామినేని ఫౌండేషన్ చైర్మన్, ధర్మ ప్రచారక్ రామినేని మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. అవార్డీలను ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ డైరెక్టర్ పద్మశ్రీ జీఎన్ రావు, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, హెచ్‌ఆర్‌డీ ట్రైనర్ బీవీ పట్టాభిరామ్‌లతో కూడిన ప్యానల్ కమిటీ ఎంపిక చేసిందని వివరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, ఏపీ మాజీ మంత్రి గంటా శ్రీనివాస్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ వి.చాముండేశ్వరీనాథ్, ప్రతిభ బయోటెక్ ఫౌండర్లు ఎల్లా సుచిత్ర, కిషన్‌లతోపాటు పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు.

## ఈఎస్‌ఐ మా కష్టార్జితం

**ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ చందాదారుల ఐక్య వేదిక డిమాండ్**

హైదరాబాద్: ‘ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ డబ్బులు మా రక్తం. మా కష్టార్జితం. మా సొమ్మును దోచుకున్న వారిపై సీబీఐతో విచారణ చేయించాలి’ అని ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ చందాదారుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. స్కామ్ వెనక ఉన్న సూత్రదారులు, పాత్రదారులను బయటకు తీసుకురావాలని వేదిక అధ్యక్షుడు తోడేటి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఈఎస్‌ఐలో దఫదఫాలుగా అవినీతి, అక్రమాలు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటివరకు సుమారు రూ.500 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. ఈఎస్‌ఐ కుంభకోణంలో పాత్రధారులు దొరికారు కానీ సూత్రదారులు బయటకు రాలేదని, వారి పేర్లను ఏసీబీ అధికారులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. త్వరలోనే గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిసి స్కామ్‌లో నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

# ‘పరదా’ పడినట్టే

**కింగ్‌కోఠి ప్యాలెస్‌ను ప్రైవేటు కంపెనీకి అమ్మేసిన నిజాం ట్రస్ట్**

**పరదాగేట్‌ను కొన్న ముంబైవాలా**

**5000 గజాల విస్తీర్ణం, రూ. 150 కోట్ల వ్యయం**

**ప్యాలెస్‌లో ఐరిస్ బిజినెస్ మాల్స్**

**అలనాటి నిజాం చరిత్ర వైభవానికి ఆనవాలుగా ఉన్న కింగ్‌కోఠి ప్యాలెస్ (పరదాగేట్) ఇక కనుమరుగుకానుంది. చారిత్రక వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యంగా ఉన్న ఈ ప్యాలెస్ కనుమరుగుకానుందన్న వాస్తవం పురావస్తు, చరిత్ర ప్రేమికులు జీర్ణించుకోవటమూ కాస్త కష్టమే మరి. మొఘల్, యూరోపియన్ అద్భుత వాస్తు నిర్మాణ శైలితో ఎన్నో ప్రత్యేకతల్ని సంతరించుకున్న ఈ భవనం నిజాం రాజులనాటి చారిత్రక వైభవానికి కింగ్‌కోఠి ప్యాలెస్ శిథిల సజీవ సాక్ష్యం. 70 ఏళ్లుగా నిజాం వారసుల చేతుల్లో ఉన్న ఈ భారీ భవనం యాజమాన్య హక్కులు గతంలోనే చేతులు మారాయి. ఢిల్లీకి చెందిన ప్రముఖ హోటల్స్ సంస్థ ఐరిస్ ఈ భారీ భవంతిని కొనుగోలు చేసింది. ఇప్పుడు ఈ భవనాన్ని కూల్చి ఓ భారీ బిజినెస్ మాల్‌ను నిర్మించేందుకు ఐరిస్ సంస్థ సన్నాహాలు ప్రారంభించింది. దీంతో కింగ్‌కోఠి ప్యాలెస్ కాస్తా ఇక నుంచి బిజినెస్ మాల్‌గా మారనుందని తెలుస్తోంది.**

*– సాక్షి, హైదరాబాద్*



ఏడో నిజాం ఉస్మాన్ అలీఖాన్ సమయంలో.. పరదాగేట్ ఇలా.. ఉస్మాన్ అలీఖాన్ పాలన అంతా ఇక్కడ నుంచే

### పరదా కథ

కింగ్‌కోఠి ప్యాలెస్‌లోని ప్రధాన భవనం (నజ్రీబాగ్) పరదాగేట్‌గా ఇప్పటికీ ప్రసిద్ధే. ఈ భవనం ఇప్పటికీ పరదా వేసి ఉండటమే విశేషం. అప్పట్లో నిజాం ఉస్మాన్ అలీఖాన్ నివాస కేంద్రంగా కొనసాగిన ఈ భవంతిలో ఆయన ఉంటేనే పరదాని పైకి లేపి ఉంచేవారు. పరదా కిందకు వేసి ఉంటే ఆయన రాజ్య పర్యటనలో ఉన్నారని అర్థం. నిజాం రాజు నిత్యం వెళ్లే దారిని నీళ్లతో కడిగి శుద్ధి చేసేవారు. ఇక్కడ నిత్యం సాయుధ పోలీస్ బలగాలతో భారీ పహారా ఉండేది. నిజాం నవాబు ఉస్మాన్ అలీఖాన్ ఈ భవనంలోనే తుది శ్వాస విడువగా ఆయన సమాధి సైతం ఈ పరిసరాల్లోనే (జుడీ మస్జీద్) ఉండటం విశేషం.

### హెరిటేజ్ జాబితాలోనే

కమాల్‌ఖాన్ ఆధ్వర్యంలో మొఘల్, యూరోపియన్ అద్భుత వాస్తు నిర్మాణ శైలితో నిర్మించిన ఈ భవనానికి దేశంలోనే అనేక ప్రత్యేకతలున్నాయి. ఈ నిర్మాణ శైలిని చూసేందుకు అనేక దేశాల ఆర్కిటెక్టులు వచ్చి పరిశీలించిన సందర్భాలున్నాయి. ఈ భవనం చాలా కాలం హెరిటేజ్ జాబితాలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో హెరిటేజ్ భవనాల జాబితా ఏదీ అధికారికంగా లేకపోవటంతో ఈ భవనాన్ని ఐరిస్ హోటల్స్ కూలిచ్చివేసే అవకాశమే కనిపిస్తోంది. ఈ భవనానికి సరైన నిర్వహణ లేకపోవటంతో ప్రస్తుతం శిథిలావస్థ కు చేరుకుంది. ఈ విషయమై ఇంటాక్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షురా లు అనురాధారెడ్డి స్పందిస్తూ.. నజ్రీబాగ్ ఎప్పటి నుంచో హెరిటేజ్ భవనంగా ఉందని, ఆ భవనం కూల్చివేతను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

### కొనుగోలు వివాదం

నిజాం ట్రస్ట్ నుంచి ఈ భవనాన్ని తొలుత నిహారిక ఇన్‌ఫ్రా కంపెనీ కొనుగోలు చేయగా, ఇదే కంపెనీలోని ఇద్దరు డైరెక్టర్లు మాత్రమే ఐరిస్ హోటల్స్‌కు విక్రయించారు. ఈ విషయమై నిహారిక డైరెక్టర్లు వర్లీ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆ రిజిస్ట్రేషన్ చెల్లుబాటు కాకుండా చూడాలని కోరారు. ఈ మేరకు ఓ లేఖ సైతం హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌కు చేరింది. ఈ విషయమై రిజిస్ట్రార్ డీవీ ప్రసాద్‌ను వివరణ కోరగా తాము అన్ని పరిశీలించాకే రిజిస్టర్ చేసినట్లు ‘సాక్షి’కి తెలిపారు.

### చేతులు మారిందిలా..

ఏడో నిజాం ఉస్మాన్ అలీఖాన్ వ్యక్తిగత నివాసంగా వెలుగొందిన ఐదువేల గజాల విస్తీర్ణంలో ఉన్న భారీ భవంతి నజ్రీబాగ్ (పరదాగేట్)కు చాలాకాలం ప్రిన్స్ ముకర్రంజా మొదటి భార్య ఎస్రా జీపీఏ హోల్డర్‌గా వ్యవహరించారు. ఎస్రా నుంచి ముంబైకి చెందిన నిహారిక కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ కొనుగోలు చేయగా తాజాగా నిహారిక కన్‌స్ట్రక్షన్స్ నుంచి ఐరిస్ హోటల్స్ సంస్థ రూ.150 కోట్లకు కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఐదెకరాల విస్తీర్ణంలో కింగ్‌కోఠి ప్యాలెస్‌లో ఉన్న మూడు భవనాల్లో ఒకదాన్లో ఈఎన్‌టీ ఆస్పత్రి నడుస్తుండగా, మరో భవనంలో నిజాం ట్రస్ట్ కొనసాగుతోంది.








Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com